బుధవారం
5•2•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 221
• పేజీలు : 12 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE







పుట్టతేనంత చక్కని తీర్థం



మంగళవారం రాత్రి విద్యుత్ వెలుగులతో విరాజిల్లుతున్న మేడారం



# మహాజాతర షురూ

నేడు కన్నెపల్లి నుంచి గద్దెకు రానున్న సారలమ్మ తల్లి • పూనుగుండ్ల నుంచి తరలివస్తున్న పగిడిద్దరాజు

కొండాయి నుంచి బయలుదేరిన గోవిందరాజులు • సంపెంగ వాగుకు చేరుకున్న జంపన్న

- గురువారం గద్దెమీదకు సమ్మక్క రాక
- సకల ఏర్పాట్లుచేసిన ప్రభుత్వం
- మేడారానికి లక్షల సంఖ్యలో తరలుతున్న భక్తజనం
- ఇప్పటికే దర్శించుకున్న 35 లక్షల మంది
- కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు
- భక్తుల కోసం నాలుగువేల బస్సులు, 20 రైళ్లు

(మేడారం నుంచి వరంగల్ ప్రధాన ప్రతినిధి / ములుగు ప్రతినిధి, నమస్తే తెలంగాణ)

రెండేండ్లకోసారి జరిగే, ఆదిమ గిరిజన సంస్కృతుల సమ్మేళనంగా కీర్తించే సమ్మక్క-సారలమ్మల మహాజాతర బుధవారం నుంచి ప్రారంభం కానున్నది. మేడారానికి ఐదు కిలోమీటర్ల దూరంలోని కన్నెపల్లి గ్రామం నుంచి సారలమ్మను గద్దెకు తోడ్కొని రావడంతో జాతర తొలి అంకం మొదలుకానున్నది. భక్తులు అత్యంత పవిత్రంగా భావించే సంపెంగ వాగుకు మంగళవారం జంపన్న చేరుకొన్నాడు. పూనుగుండ్ల నుంచి పగిడిద్దరాజు మేడారానికి బయలుదేరాడు. బుధవారం కన్నెపల్లి నుంచి సారలమ్మ.. కొండాయి నుంచి గోవిందరాజులు గద్దెలకు రానున్నాడు. తల్లుల దర్శనానికి తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్, ఈశాన్య రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు మేడారం చేరుకుంటున్నారు. ఇప్పటికే దాదాపు 30 లక్షల నుంచి 35 లక్షల మంది దర్శించుకున్నారని అధికారులు పేర్కొన్నారు.

**నేడు గద్దెపై కొలువుదీరనున్న సారలమ్మ**

మేడారం మహాజాతరలో ప్రధాన ఘట్టం సారలమ్మ రాకతో మొదలవుతుంది. కన్నెపల్లి నుంచి సారలమ్మ ప్రధాన వడ్డె (పూజారి) కాక సారయ్య నేతృత్వంలోని వడ్డెలు అక్కడి సారలమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గద్దెపైకి తోడ్కొని వస్తారు. అప్పటికే మేడారం చేరుకున్న పగిడిద్దరాజు సారలమ్మ రాక కోసం వేచి చూసే సంప్రదాయం కొనసాగుతున్నది. తమ ఇంటి ఇలవేల్పు

మిగతా 7వ పేజీలో

## సరికొత్త ఢిల్లీ



దేశ రాజధాని ఢిల్లీ సరికొత్త రూపు సంతరించుకోనున్నది. నేటి అవసరాలకు అనుగుణంగా సెంట్రల్ విస్టాను (రాష్ట్రపతి భవన్ నుంచి ఇండియాగేట్ వరకు) ఆధునీకరించేందుకు కేంద్రం బృహత్తర ప్రణాళికను రూపొందించింది. రూ.12 వేల కోట్లతో 2024నాటికి దీన్ని అభివృద్ధిచేయనున్నారు. ప్రస్తుత పార్లమెంట్ భవనానికి ఆనుకుని త్రికోణాకృతిలో కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మిస్తారు. 75వ స్వాతంత్ర్య వేడుకల నాటికి దీన్ని పూర్తిచేయాలని ప్రభుత్వం సంకల్పించింది. 5

# ఏడు నుంచి మెట్రో మూడోలైన్



జేబీఎస్ టు ఎంజీబీఎస్ రూట్‌ను ప్రారంభించనున్న సీఎం కేసీఆర్

- ట్విట్టర్ వేదికగా తెలిపిన ఐటీశాఖ మంత్రి కేటీఆర్
- 8 నుంచి ప్రయాణికులకు అనుమతి
- 69 కిలోమీటర్ల మార్గంతో ఢిల్లీ తర్వాత రెండో అతిపెద్ద ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రో

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**

హైదరాబాద్ నగర ఉత్తర, దక్షిణ ప్రాంతాలను అనుసంధానం చేసే జేబీఎస్ (జూబ్లీ బస్‌స్టేషన్) - ఎంజీబీఎస్ (మహాత్మాగాంధీ బస్‌స్టేషన్) మెట్రోరైలు మార్గాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 7న ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జేబీఎస్ వద్ద ఏర్పాటుచేస్తున్నారు. ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు కారిడార్-2 మార్గంలో కమర్షియల్ ఆపరేషన్‌లో భాగంగా తొలిరైలు ప్రారంభమవుతుందని, ట్విట్టర్ వేదికగా ఐటీ, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేటీఆర్ మంగళవారం వెల్లడించారు. ఈ మార్గంలో ప్రయాణికులకు మెట్రోరైలు శనివారం (8వ తేదీ) నుంచి అందుబాటులోకి వస్తుంది.

**అతిపెద్ద పీపీపీ ప్రాజెక్టుగా విజయవంతం**

జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు గల కారిడార్-2 మార్గం 11 కిలోమీటర్లు ప్రారంభమైతే నగరంలోని మొత్తం 69 కిలోమీటర్ల మెట్రోమార్గం అందుబాటులోకి వస్తుందని హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు మియాపూర్ నుంచి ఎల్బీనగర్

మిగతా 2వ పేజీలో

## పలువురు ఐఏఎస్‌లకు పోస్టింగులు

ఉత్తర్వులు జారీచేసిన సీఎస్ 2

రేపటినుంచి

## సహకార నామినేషన్లు

- దాఖలుకు శనివారం వరకు గడువు
- ఒక్కో డైరెక్టర్ వార్డుకు ఒక పోలింగ్‌కేంద్రం 3
- ఓట్లు సమానమైతే లాటరీతో విజేత ప్రకటన



## ఉరిమిన ఉత్సాహం

- భారీ లాభాల్లో దేశీయ స్టాక్‌మార్కెట్లు
- 917 పాయింట్లు పుంజుకున్న సెన్సెక్స్
- 272 పాయింట్లు ఎగిసిన నిఫ్టీ 8
- రెండు రోజుల్లో రూ.3.57 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద

# తెలంగాణ ఆర్థికం భేష్

ఆర్థిక క్రమశిక్షణలో అగ్రస్థానం

- సంపద ఎక్కువ.. అప్పులు తక్కువ
- మహారాష్ట్ర మినహా అన్నిరాష్ట్రాలూ తెలంగాణ తర్వాతే
- పార్లమెంట్ సాక్షిగా వెల్లడించిన కేంద్రప్రభుత్వం
- జీడీపీలో 48 శాతం కేంద్రం చేసిన అప్పులే ఉన్నాయి
- అప్పులపై ప్రతిపక్షాల కాకిలెక్కలు
- బీజేపీ, కాంగ్రెస్ ఇప్పటికైనా కండ్లు తెరవాలి: కేటీఆర్



**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

సంపదను సృష్టించడం, ప్రజలకు పంచడంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే సరికొత్త ఒరవడిని సృష్టిస్తున్నది. సంపద గణనీయంగా పెరుగుతున్నప్పటికీ పరిమితికి లోబడి అప్పులు తీసుకుని ఆర్థిక క్రమశిక్షణను కట్టుతప్పకుండా పాటిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందువరుసలో నిలిచింది. టీఆర్‌ఎస్ ప్రభుత్వం తెస్తున్న అప్పుల గురించి విపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని, అతితక్కువ అప్పులు తీసుకున్న రాష్ట్రాల్లో మహారాష్ట్ర మినహా మిగిలిన అన్ని రాష్ట్రాలు తెలంగాణ తర్వాతే ఉన్నాయని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే పార్లమెంట్ సాక్షిగా ప్రశంసించింది. దీంతో తెలంగాణ

మిగతా 2వ పేజీలో

# ఎన్నార్సీ ఆలోచనలేదు



దేశవ్యాప్తంగా అమలుచేయడంపై నిర్ణయం తీసుకోలేదు

- ఎన్పీఆర్ కోసం ఎటువంటి పత్రాలు కోరబోము
- ఆధార్ కూడా తప్పనిసరికాదు
- ఏప్రిల్ ఒకటి నుంచి సెప్టెంబర్ 30 వరకు జనగణన
- పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:**

సీఏఏతోపాటు ఎన్నార్సీ, ఎన్పీఆర్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనోద్యమాలు జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మంగళవారం కీలక ప్రకటన చేసింది. జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ)ని దేశవ్యాప్తంగా అమలుచేయడంపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపింది. అదే విధంగా జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) కోసం వివరాలు సేకరించే సమయంలో పౌరుల నుంటి ఎటువంటి పత్రాలు కోరబోమని స్పష్టం చేసింది. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద్‌రాయ్ ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ, 'జాతీయ స్థాయిలో భారతపౌరుల జాబితాను సిద్ధం చేయడంపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయమూ తీసుకోలేదు' అని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం 2014లో మొదటిసారి అధికారానికి వచ్చిన నాటినుంచి ఇంతవరకు ఎన్నార్సీ గురించి చర్చించనేలేదని ప్రధాని మోదీ గత డిసెంబర్ 22న స్పష్టం చేశారు. ఎన్నార్సీ గురించి పార్లమెంట్‌లో లేదా మంత్రివర్గంలో కూడా ప్రస్తావించలేదని చెప్పారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజున పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించిన సమయంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కూడా ఎన్నార్సీ గురించి ప్రస్తావించలేదు. అయితే గత ఏడాది ఎన్నికల అనంతరం ఏర్పడిన నూతన లోక్‌సభనుద్దేశించి జూన్ 20న రాష్ట్రపతి ప్రసంగిస్తూ, మోదీ ప్రభుత్వం

మిగతా 5వ పేజీలో

ఇందూర్‌లో సుగంధ ద్రవ్యాల బోర్డు

# ప్రాంతీయ కార్యాలయం

కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ప్రకటన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

నిజామాబాద్‌లో సుగంధద్రవ్యాల బోర్డు రీజినల్ కార్యాలయాన్ని ఏర్పాటుచేయనున్నట్టు కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. మంగళవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పసుపు, మిరపపంటను దృష్టిలో ఉంచుకొని నిజామాబాద్‌లో ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. దీనిపై త్వరలోనే అధికారిక నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. ఐఏఎస్ స్థాయి అధికారి ఈ ప్రాంతీయకార్యాలయంలో డైరెక్టర్ హోదాలో కార్యకలాపాలు పర్యవేక్షిస్తారని, ఈ కార్యాలయం నేరుగా కేంద్ర మంత్రిత్వశాఖకు నివేదిస్తుందని తెలిపారు. దీనిపై నిజామాబాద్ ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ.. అనేక కారణాలతో బోర్డులు విఫలమవుతున్నాయని, వాటికి శాఖలతో సమన్వయం చేసుకునే అవకాశం లేదని చెప్పారు.



పీయూష్ గోయల్






| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 77.00 | రిటైల్ లైవ్ | 99.00 |
| డ్రెస్‌డ్ | 144.00 | స్కిన్‌లెస్ | 163.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 330.00 | రంగారెడ్డి | 330.00 |
| మెదక్ | 330.00 | కరీంనగర్ | 333.00 |
| వరంగల్ | 333.00 | డజన్ ధర | 60.00 |

## ఫైనల్లో యువ భారత్

జైస్వాల్ అజేయ సెంచరీ..

పాకిస్థాన్‌పై 10 వికెట్ల తేడాతో ఘనవిజయం

అండర్-19 ప్రపంచకప్



వివరాలు ఆటలో

## పసుపు బోర్డు కావాలి స్పైస్‌బోర్డు రీజినల్ ఆఫీస్‌కాదు

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి 3






ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీఏడీ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్



మంగళవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిసి తన కుమార్తె పెండ్లి పత్రికను అందజేస్తున్న 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఎడిటర్ జీఎస్ వాసు

## ఆర్టీసీ కార్గో బస్సులపై నా ఫొటోవద్దు

- అధికారులకు స్పష్టంచేసిన సీఎం కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ కార్గో బస్సులపై తన ఫొటోలు వేయవద్దని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులకు స్పష్టంచేశారు. సరుకు రవాణాచేసే కార్గో బస్సులపై ముఖ్యమంత్రి ఫొటో పెట్టడానికి ఆర్టీసీ ఏర్పాటుచేస్తున్నట్టు మీడియాలో జరిగిన ప్రచారాన్ని ఆయన తప్పుపట్టారు. ఆర్టీసీ బస్సులను సరుకురవాణాకు ఉపయోగించడంవల్ల ఒకవైపు ప్రజలకు సేవలు అందించడం.. మరోవైపు సంస్థను లాభాల్లో పయనింపజేయడమే తన లక్ష్యమని, బస్సులపై ఫొటోలు వేయించుకొని ప్రచారం చేసుకోవాల్సిన అవసరం తనకులేదని, ఈ ప్రాతిపాదన ఆమోదయోగ్యం కాదని సీఎం కేసీఆర్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వపథకాల ద్వారా ప్రజలకు సేవలు అందించాలే తప్పు.. దానిద్వారా ప్రచారం పొందడం తమ అభిమతం కాదన్నారు. సీఎం కేసీఆర్ అభిప్రాయంతో సీఎంవో ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి.. ఆర్టీసీ ఎండీకి నోట్ పంపారు. కార్గో బస్సులపై సీఎం ఫొటో వేయరాదని అందులో సూచించారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌ను కలిసి తమ కుమార్తె వివాహ ఆహ్వానపత్రికను అందజేస్తున్న మేసినేని మంజుల, రాజశేఖర్‌రావు. చిత్రంలో మాజీ ఎంపీ కవిత ఉన్నారు.



## ఇరిగేషన్ ఇంజినీర్లకు పదోన్నతులు

- నెరవేరిన ఉద్యోగుల కల
- 110 మంది జాబితాపై సీఎం కేసీఆర్ సంతకం
- సీఎంకు ఇరిగేషన్ గ్రాడ్యుయేట్ ఇంజినీర్ల అసోసియేషన్ కృతజ్ఞతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నీటిపారుదల శాఖ ఇంజినీర్ల సుదీర్ఘ కల సాకారమైంది. ఏండ్ల తరబడి వేచి చూస్తున్న పదోన్నతి ప్రక్రియ ఎట్టకేలకు సాకారమైంది. ఏకంగా 110 మంది ఇంజినీర్లకు పదోన్నతులు కల్పించే ప్రతిపాదనపై సీఎం కేసీఆర్ మంగళవారం సంతకం చేసినట్టు తెలిసింది. ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు జారీకానున్నాయి. నీటిపారుదల శాఖలో చాలాకాలంగా ఇంజినీర్ల పదోన్నతులు పెండింగులో ఉన్నాయి. పలు చిక్కుముళ్లతో ఉన్న ఈ ప్రక్రియను సజావుగా ముందుకు తీసుకుపోయేందుకు ప్రభుత్వం అనేకచర్యలు తీసుకున్నది. సీఎం కేసీఆర్ తాజాగా ఇంజినీర్లకు పదోన్నతుల కల్పించే ప్రతిపాదనపై సంతకం చేసినట్టు నీటిపారుదలశాఖ వర్గాలు తెలిపాయి. నీటిపారుదలశాఖలో పదిమంది సూపరింటెండెంట్ ఇంజినీర్లకు చీఫ్ ఇంజినీర్లుగా, 25 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు సూపరింటెండెంట్ ఇంజినీర్లుగా, 75 మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పదోన్నతులు దక్కనున్నాయి. పదోన్నతి ప్రక్రియకు సీఎం కేసీఆర్ ఆమోదం తెలుపడంపై ఇంజినీర్లు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు తెలంగాణ ఇరిగేషన్ గ్రాడ్యుయేట్ ఇంజినీర్ల అసోసియేషన్ (టైగర్) అధ్యక్షుడు నల్ల వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ నూనె శ్రీధర్, ప్రధాన కార్యదర్శి వేణు తదితరులు సీఎం కేసీఆర్, ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, నీటిపారుదల శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# హామీలు నెరవేర్చడంలో కేంద్రం విఫలం

- తెలంగాణకు తగిన చేయూతనివ్వండి
- లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత నామా డిమాండ్
- అభివృద్ధి చూసేందుకు రాష్ట్రానికి రావాలని ఎంపీలకు ఆహ్వానం



నామా నాగేశ్వర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విభజన హామీలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు అన్నారు. కేంద్ర పన్నుల వాటాలో ఉన్న 42 శాతాన్ని.. 41 శాతానికి తగ్గించి, వెయిటేజీలో ప్రాధాన్యక్రమాలను మార్చడం వల్ల తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రం మొండిచేయి చూపడం తగదని, తన వైఖరిని మార్చుకొని ప్రగతిశీల తెలంగాణకు చేయూతనివ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా మంగళవారం లోక్‌సభలో నామా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని విశ్లేషించి చెప్పారు. రాష్ట్రంలో మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం పరిఢవిల్లుతున్నదని చెప్పారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో 'పల్లెప్రగతి' ద్వారా గ్రామాల సమగ్రాభివృద్ధికి వినూత్న కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరచామన్నారు. అంశాల ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను సమర్థిస్తున్న తెలంగాణకు తగిన చేయూతనివ్వాలని కోరారు. 'గ్రామాల అభివృద్ధి అంటే ఏమిటో సీఎం కేసీఆర్ ఆరేండ్ల వ్యవధిలోనే చేసి చూపించారు. స్పీకర్ ద్వారా గౌరవ సభ్యులందరికీ విన్నవిస్తున్నాం. తెలంగాణలో జరుగుతున్న గ్రామాభివృద్ధి చూడటానికి సభ్యులందరూ ఒకసారి రాష్ట్రానికి రావాలి' అని నామా ఆహ్వానించారు.

### తెలంగాణలో గ్రామస్వరాజ్యం

రాష్ట్రపతి ప్రసంగంలో బాపూజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం, అంబేద్కర్ సామాజిక న్యాయం, నెహ్రూ కోరిన ఆధునిక భారత్ తదితర అంశాలను పేర్కొన్నారని నామా నాగేశ్వర్‌రావు చెప్పారు. గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని సృష్టిస్తూ, అంబేద్కర్ ఆశయాలను, నెహ్రూ సిద్ధాంతాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ సమసమాజ స్థాపనదిశలో పాలనను కొనసాగిస్తున్నారని, దేశానికే దిక్సూచిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. దేశంలోని చాలాగ్రామాల్లో దహన సంస్కారాలకు స్థలం లేక ఇప్పటికీ రోడ్లవెంట బహిరంగంగా అంత్యక్రియలు నిర్వహిస్తున్న పరిస్థితి ఉన్నదని కానీ, సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో వైకుంఠ ధామాలను నిర్మిస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రభుత్వం 10,500 ట్రాక్టర్లు కొనుగోలు చేసి ఇచ్చిందని, 12,751 గ్రామాలకుగాను 12,705 గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటుచేసి తెలంగాణకు హరితహారం పేరుతో వందకోట్ల మొక్కలను నాటిందని పేర్కొన్నారు. పాడుబడిన బోర్లను మూసివేయాలని సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశాలిచ్చిందని.. అయితే, అంతకుముందే బోరుబావులను మూసివేసిన ఘనత తెలంగాణదేనని చెప్పారు. శిథిల ఇండ్లను తొలిగించామని, వేల కి.మీ. మేర మురుగుకాల్వలను, వీధులను శుభ్రంచేశామని వివరించారు. మిషన్ భగీరథ ప్రారంభించి నాలుగేండ్లలోనే ఇంటింటికీ తాగునీటిని అందిస్తున్నామని తెలిపారు.

## రాజకీయ లబ్ధికోసమే సీఏఏ

- సీఏఏపై సీఎం కేసీఆర్‌కు స్పష్టత ఉన్నది
- ఓట్ల ఏకీకరణకే ప్రమాదకర చట్టం
- రాజ్యసభలో కే కేశవరావు మండిపాటు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాజకీయంగా బలాన్ని పెంచుకోవడానికి బీజేపీ మతతత్వం అనే విషాన్ని ప్రజలకు ఎక్కించాలని ప్రయత్నిస్తున్నదని, ఈ విషయాన్ని ముందే గమనించిన తెలంగాణ సీఎం కేసీఆర్ సీఏఏ చట్టాన్ని వ్యతిరేకించారని టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు అన్నారు. మంగళవారం ఆయన రాజ్యసభలో మాట్లాడుతూ.. దేశం, సీఏఏ వంటి అంశాలపై సీఎం కేసీఆర్‌కు సాహసోపేతమైన తాత్వికతతోకూడిన స్పష్టమైన వైఖరి ఉన్నదని, ఇలాంటి నేతను కలిగి ఉన్నందుకు దేశం గర్వపడుతున్నదన్నారు. దేశవ్యాప్తంగా ఓట్ల ఏకీకరణకు బీజేపీ సీఏఏ వంటి ప్రమాదకరచట్టాలను తెస్తున్నదని ధ్వజమెత్తారు. తెలంగాణలో 15నుంచి 20శాతం వరకు ముస్లింలు ఉన్నారని, ఎక్కడా అశాంతి నెలకొన్న ఘటనలు లేవన్నారు. సీఏఏకు వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానం చేస్తుందని సీఎం చెప్పారని వెల్లడించారు.

## ఏడు నుంచి మెట్రో మూడోలైన్

మొదటిపేజీ తరువాయి...

వరకు 29 కిలోమీటర్లు, నాగోల్ నుంచి రాయదుర్గ్ వరకు 29 కిలోమీటర్లు, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు 11 కిలోమీటర్లు కలిపి 69 కిలోమీటర్లు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. దీంతో దేశంలో రెండో అతిపెద్ద ప్రాజెక్టుగా ఢిల్లీ తర్వాత స్థానాన్ని హైదరాబాద్ మెట్రోరైలు దక్కించుకుంటుందని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పీపీపీ ప్రాజెక్టుగా కూడా ఇది విజయవంతమైందని అన్నారు. 2017 నవంబర్‌లో మెట్రో రైలు తొలిసారి హైదరాబాద్‌లో కూతపెట్టింది. అనంతరం దశలవారీగా వివిధ కారిడార్లను ప్రారంభించారు. జేబీఎస్ టు ఎంజీబీఎస్ ప్రారంభమైతే మొదటిదశ హైదరాబాద్ మెట్రోరైలు దాదాపు పూర్తయినట్టే. ప్రస్తుతం నిత్యం నగరంలో 4 లక్షల మంది మెట్రో రైలులో ప్రయాణిస్తుండగా, జేబీఎస్ టు ఎంజీబీఎస్ మార్గం అందుబాటులోకి వస్తే మరో లక్ష మంది పెరుగుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. 2017 నవంబర్ నుంచి ఇప్పటివరకు 9.3 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చినట్టు గణాంకాలు చెప్తున్నాయి. నాగోల్ నుంచి రాయదుర్గ్, ఎల్బీనగర్ నుంచి మియాపూర్‌తో నగర తూర్పు, పడమర ప్రాంతాలను కలుపుతుండగా, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ కారిడార్ ఉత్తర, దక్షిణ ప్రాంతాలను కలుపుతున్నది.



KTR
@KTRTRS

Hon'ble CM Sri KCR Garu will inaugurate the JBS-MGBS Metro line on 7th Feb at 4pm

This will take the total length of Hyderabad Metro Rail to 67 KM

@ltmhyd @hmrgov

మెట్రో మార్గాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్

### మెట్రోలో ముఖ్యఘట్టాలు

2017 నవంబర్ 28న సీఎం కేసీఆర్‌తో కలిసి ప్రధాని మోదీ మియాపూర్ నుంచి అమీర్‌పేట వరకు 13 కిలోమీటర్లు, అమీర్‌పేట నుంచి నాగోల్ వరకు 17 కిలోమీటర్లు.. మొత్తం 30 కిలోమీటర్ల మార్గాన్ని మియాపూర్ స్టేషన్ వద్ద ప్రారంభించారు. 2018 సెప్టెంబర్ 24న అమీర్‌పేట నుంచి ఎల్బీనగర్ వరకు మంత్రి కేటీఆర్‌తో కలిసి అప్పటి గవర్నర్ నరసింహన్ ప్రారంభించారు. 2019 మార్చి 20న అమీర్‌పేట నుంచి హైటెక్‌సిటీ వరకు పదికిలోమీటర్ల మార్గాన్ని అప్పటి గవర్నర్ నరసింహన్ ప్రారంభించారు. 2019 నవంబర్ 29న హైటెక్‌సిటీ నుంచి రాయ్‌దుర్గ్ వరకు 1.5 కిలోమీటర్ల మార్గాన్ని మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు.

## నవోదయ, కేవీలను ఏర్పాటుచేయండి

- రాజ్యసభలో ఎంపీ బడుగుల డిమాండ్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలోని అన్ని జిల్లాలకు వెంటనే జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు (కేవీ) మంజూరుచేయాలని టీఆర్ఎస్ రాజ్యసభసభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్.. కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం రాజ్యసభలో జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తరువాత పరిపాలన సౌలభ్యం, ప్రజల సౌకర్యం కోసం 33 జిల్లాలుగా ఏర్పాటుచేశామని తెలిపారు. కేంద్రం ఇప్పటివరకు 21 జిల్లాల్లో నవోదయ విద్యాలయాలు, 17 జిల్లాల్లో కేవీలు ఏర్పాటుచేయలేదని చెప్పారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలో మంజూరైన కేంద్రీయ విద్యాలయానికి ఐదెకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించి రెండేండ్లు గడిచినా.. నేటికీ కేంద్రం నిధులు విడుదలచేయలేదని పేర్కొన్నారు. తెలంగాణకు రావాల్సిన మూడు సైనిక స్కూళ్లను ఈ విద్యాసంవత్సరంలోనే ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేశారు. సీఎం కే చంద్రశేఖర్‌రావు విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని, తెలిపారు. నవోదయ విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక పాఠశాలల విషయంలో సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ ఎంపీల బృందం అనేకసార్లు ప్రధానమంత్రి, కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. నవోదయ, కేవీ, సైనిక విద్యాలయాలు మంజూరుచేసి బంగారు తెలంగాణ నిర్మాణానికి సహకరించాలని కేంద్రాన్ని కోరారు.

## తెలంగాణ ప్రస్తావన లేకపోవడం తగదు

- లోక్‌సభలో ఎంపీ రంజిత్‌రెడ్డి అసంతృప్తి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశానికి అనేక అంశాల్లో ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ప్రస్తావన రాష్ట్రపతి ప్రసంగంలో లేకపోవడంపై చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. మంగళవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ వేదికగా అనేక రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి తెలుసుకొని తమ రాష్ట్రాల్లో అమలుకు ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో దేశానికి దిక్సూచిగా ఉన్న తెలంగాణ కార్యక్రమాలను ప్రస్తావించి ఉంటే సంతోషించేవాళ్లమని అన్నారు.

## మేడారాన్ని జాతీయ పండుగగా గుర్తించండి

- రాజ్యసభలో ఎంపీ బండా ప్రకాశ్ విజ్ఞప్తి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో చారిత్రక మేడారం వన జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని టీఆర్ఎస్ ఎంపీ బండా ప్రకాశ్.. కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మేడారం జాతరను తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తున్నదని చెప్పారు. మంగళవారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణతోపాటు నాలుగైదు రాష్ట్రాల ప్రజలు సమ్మక్క, సారలమ్మను ఆరాధ్యదైవంగా భావిస్తారని, జాతరకు భారీసంఖ్యలో జనం తరలివస్తారని తెలిపారు.

## పలువురు ఐఏఎస్‌లకు పోస్టింగులు

- ఉత్తర్వులు జారీచేసిన సీఎస్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పలువురు ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. గత ఆదివారం బదిలీల్లో పోస్టింగ్ ఇవ్వని అధికారులకు తాజాగా పోస్టింగ్ ఇచ్చారు. వెయిటింగ్‌లో ఉన్న బెన్‌హర్‌దత్ ఎక్కాకు ఎంసీహెచ్చార్డీ అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఢిల్లీలోని తెలంగాణభవన్ ఓఎస్డీగా సయ్యద్ లీ ముర్తాజ్‌రిజ్వీ, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా అహ్మద్‌నదీమ్, ఎస్సీ కమిషన్ సెక్రటరీగా జీఎస్ పండాదాస్, వ్యవసాయశాఖ డిప్యూటీ సెక్రటరీగా సీహెచ్ శివలింగయ్య, పంచాయతీరాజ్ రూరల్‌డెవలప్‌మెంట్ డిప్యూటీ సెక్రటరీగా అయేషామస్రత్ ఖానమ్‌కు పోస్టింగ్ ఇచ్చారు. సాగునీటిపారుదల ముఖ్యకార్యదర్శిగా నియమితులైన రజత్‌కుమార్ అదనంగా భూసేకరణ, పునరావాస కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తారు.

**ముహూర్తం**

సూర్యోదయం: 6.48 గంటలకు

సూర్యాస్తమయం: 6.06 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం ఏకాదశి రాత్రి 9.32 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: మృగశిర రాత్రి 1.59 వరకు, తదుపరి ఆరుద్ర, అమృతఘడియలు: సాయంత్రం 5.08 నుంచి 6.44 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.27 నుంచి 1.52 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.04 నుంచి 12.50 వరకు, వర్జ్యం: ఉదయం 7.28 నుంచి 9.05 వరకు.

## సాంకేతికతను అందిపుచ్చుకొందాం

- పట్టణీకరణ నేపథ్యంలో ఆహారోత్పత్తి, వినియోగంపై ప్రభావం
- డిజిటల్ అగ్రికల్చర్ ఇండియా సదస్సులో మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



హైదరాబాద్‌లో డిజిటల్ అగ్రికల్చర్ ఇండియా సదస్సును ప్రారంభిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో అగ్రి వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు తదితరులు ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వ్యవసాయ, ఆహారరంగాల్లో నూతన ఆవిష్కరణలకు నాంది పలుకాల్సిన అవసరం ఉన్నదని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహారాలను డిమాండ్ పెరుగుతున్నదని, అదే సమయంలో సహజ వనరులైన నీరు, నేల తరిగిపోతున్నాయని విచారం వ్యక్తంచేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో నిర్వహించిన డిజిటల్ అగ్రికల్చర్ ఇండియా సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. పట్టణీకరణ ప్రభావం తీవ్రంగా పెరిగిపోతున్న నేపథ్యంలో ఆహారోత్పత్తి, వినియోగంపై ప్రభావం చూపనున్నదని పేర్కొన్నారు. సీఎం కే చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న వ్యవవసాయ విధానాలు దేశంతోపాటు ప్రపంచదేశాల దృష్టిని ఆకర్షిస్తున్నాయని చెప్పారు. ఐక్యరాజ్యసమితి పిలుపుమేరకు 2030 నాటికి ఆహార కొరతలేని సుస్థిర అభివృద్ధి సాధించేందుకు వ్యవసాయరంగంలో సమూల మార్పులు జరగాల్సి ఉన్నదని అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వస్తున్న సాంకేతికతను వ్యవసాయ, ఆహారరంగాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతికత సాయంతో వ్యవ్యవసాయరంగంలో మరో విప్లవం సృష్టించాల్సిన ఆవశ్యకతను గుర్తించాలన్నారు. దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఈ సదస్సు వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులకు తోడ్పడగలదని భావిస్తున్నట్టు చెప్పారు. సదస్సులో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రి వర్సిటీ వీసీ డాక్టర్ వీ ప్రవీణ్‌రావు, ఐటీసీ డైరెక్టర్ శివకుమార్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ అశ్వినీఛాత్రే, జినేశ్‌షా, రామ్‌కౌండిన్య, రాజ్‌కుమార్, సంతోష్‌రావు పాల్గొన్నారు.

## ఉనికి కోసమే లక్ష్మణ్ పిచ్చి విమర్శలు

- కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధం
- ప్రభుత్వ విప్ భానుప్రసాద్ ప్రతిసవాల్



టీఆర్ఎస్ఎల్పీలో మీడియాతో మాట్లాడుతున్న విప్ భానుప్రసాద్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఉనికి కోసం పిచ్చి విమర్శలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ భానుప్రసాద్ మండిపడ్డారు. మంగళవారం టీఆర్ఎస్ఎల్పీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రులు ఢిల్లీలో కొందరి కాళ్లు పట్టుకున్నారని లక్ష్మణ్ వ్యాఖ్యానించడం హాస్యాస్పదమని, బీజేపీ నాయకుల చేతకానితనం వల్లే తెలంగాణకు కేంద్రం ప్రత్యేక నిధులు ఇవ్వడంలేదని ఆరోపించారు. కేంద్రం కేటాయించిన నిధులపై టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బహిరంగచర్చకు రావాలని లక్ష్మణ్ సవాల్ చేశారని, ఈ మాత్రానికి కేటీఆర్ ఎందుకని, తానే చర్చకు సిద్ధమని.. వేదిక ప్రకటించాలని ప్రతిసవాల్ విసిరారు. మున్సిపల్‌శాఖ తరపున మంత్రి కేటీఆర్ పట్టణాలను అభివృద్ధి చేస్తున్నారని, మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను బలపరచడమే దీనికి నిదర్శనమని చెప్పారు. లక్ష్మణ్‌కు దమ్ముంటే మున్సిపల్ ఎన్నికల ఫలితాలను రెఫరెండంగా తీసుకుంటామని చెప్తే బాగుండేదని.. బీజేపీ బలమేందో హుజూర్‌నగర్‌లో, మున్సిపల్ ఎన్నికల్లో తేలిపోయిందని చెప్పారు. అమిత్‌షా గతంలో కేంద్ర నిధులపై అబద్ధాలు చెప్తే, సీఎం కేసీఆర్ వివరంగా ప్రశ్నించడంతో తోకముడిచి పారిపోయారని గుర్తుచేశారు. కేంద్ర బడ్జెట్‌పై బీజేపీ నేతలు మతిలేకుండా మాట్లాడుతున్నారని, కేంద్ర మంత్రులు తెలంగాణ పథకాలను మెచ్చుకుంటున్నా... లక్ష్మణ్‌కు కనిపించడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# తెలంగాణ ఆర్థికం భేష్

**ఆర్బీఐ అంచనా ప్రకారం ప్రస్తుత ధరల వద్ద మన జీఎస్డీపీ వృద్ధిరేటు తీరు**

| సంవత్సరం | తీసుకున్న మొత్తం అప్పు (కోట్లలో) | జీఎస్డీపీ | జీఎస్డీపీలో అప్పు శాతం |
|---|---|---|---|
| 2016–17 | 1,29,531.89 | 6,59,033 | 20.04 |
| 2017–18 | 1,52,190.12 | 7,53,811 | 20.23 |
| 2018–19 | 1,79,795.88 | 8,65,688 | 20.77 |
| 2019–20 | 2,03,730.10 | 9,50,000 (అంచనా) | 17.00 |

మొదటిపేజీ తరువాయి...

సంపద ఎక్కువ, అప్పులు తక్కువన్న విషయం మరోసారి స్పష్టమైంది. రాష్ట్ర సంపదను గణనీయంగా పెంచుతున్న టీఆర్ఎస్ ప్రభుత్వం.. అప్పుల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నది. అడ్డదిడ్డంగా అప్పులు తీసుకోకుండా అత్యవసరాలకు, మరింత సంపద సృష్టికి మాత్రమే రుణాలు తీసుకుంటున్నది. జీఎస్డీపీ (గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రాడక్ట్)లో అధికారికంగా 25 శాతం వరకు రుణాలు తీసుకునే అవకాశమున్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సర (2019–20) వార్షిక బడ్జెట్ అంచనాల్లో ఈ రుణాలను 21.39 శాతానికే పరిమితం చేసింది. వాస్తవానికి ఇది కేవలం 17 శాతంలోపే ఉండవచ్చని రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) తన తాజా అంచనాల్లో వెల్లడించినట్టు నరేంద్రమోదీ సర్కార్ ధ్రువీకరించింది. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని కేంద్ర ఆర్థికశాఖతోపాటు ఆర్బీఐ, ఆర్థిక సంఘం, కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ బ్యూరో ఎప్పటికప్పుడు విశ్లేషించి ఎంత వడ్డీతో ఏమేరకు అప్పులు తీసుకోవచ్చో నిర్ధారిస్తుంటాయి. పరిమితికి మించి రుణాలు తీసుకుంటే ఆర్థికంగా ఆంక్షలు విధిస్తాయి. వాస్తవానికి రాష్ట్రాలు తీసుకునే అప్పులు జీఎస్డీపీలో 25 శాతంలోపే ఉండాలి. కానీ తెలంగాణ సహా కొన్ని రాష్ట్రాలు మాత్రమే దీన్ని పాటిస్తున్నాయి. అనేక రాష్ట్రాలు ఎఫ్ఆర్బీఎం (ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్) పరిమితిని దాటి రుణాలు తీసుకుంటున్నాయి.

### ఏపీ అప్పులు జీఎస్డీపీలో 31.6 శాతం

కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన గణాంకాల ప్రకారం జీఎస్డీపీలో ఏపీ 31.6 శాతం అప్పులు తీసుకోగా.. అరుణాచల్‌ప్రదేశ్ 35 శాతం, బీహార్, 32.4 శాతం, ఉత్తరప్రదేశ్ 38.1 శాతం, ఉత్తరాఖండ్ 24.6 శాతం, పశ్చిమబెంగాల్ 32.6 శాతం, ఛత్తీస్‌గఢ్ 23.7 శాతం, గుజరాత్ 19.2 శాతం, హర్యానా 26.3 శాతం, హిమాచల్‌ప్రదేశ్ 34.9 శాతం, జమ్ముకశ్మీర్ 48.2 శాతం, జార్ఖండ్ 26 శాతం, కేరళ 30.8 శాతం, మధ్యప్రదేశ్ 25.4 శాతం, మణిపూర్ 38.1 శాతం, మేఘాలయ 33 శాతం, మిజోరం 31.6 శాతం, నాగాలాండ్ 38.4 శాతం, ఒడిశా 24.7 శాతం, పంజాబ్ 39.9 శాతం, సిక్కిం 25.1 శాతం, తమిళనాడు 21.7 శాతం, పుదుచ్చేరి 20 శాతం, కర్ణాటక 18.7 శాతం, అసోం 18.9 శాతం, మహారాష్ట్ర 16.9 శాతం అప్పులు చేశాయి. కేంద్ర ప్రభుత్వ అప్పులు సైతం జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి)లో 48 శాతంగా ఉండటం గమనార్హం.

### 25 ఏండ్లు నామమాత్రపు వడ్డీ చెల్లిస్తే చాలు

ప్రాజెక్టులు, ఇతర అవసరాలకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అప్పులను తీర్చేందుకు మరో 25 ఏండ్ల సమయం ఉన్నది. అప్పటివరకు నామమాత్రపు వడ్డీని మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. అది కూడా రెవెన్యూ ఖర్చుల్లో 10 శాతం మించకుండా జాగ్రత్త పడుతున్న టీఆర్ఎస్ ప్రభుత్వం.. రాష్ట్రంలో మరింత సంపదను సృష్టించేందుకు ఎక్కువగా పెట్టుబడి వ్యయం చేస్తున్నది. ద్రవ్యలోటును అత్యంత సమర్థంగా నియంత్రిస్తున్న రాష్ట్రాల జాబితాలో కూడా తెలంగాణ ముందువరుసలో ఉన్నది. వాస్తవానికి ద్రవ్యలోటు మొత్తం జీఎస్డీపీలో 3 నుంచి 3.5 శాతం వరకు ఉండవచ్చు. కానీ తెలంగాణ ప్రభుత్వం దీన్ని జీఎస్డీపీ (రూ.8,65,688 కోట్ల)లో 2.53 శాతానికే (రూ.24,081 కోట్లకే) కట్టడి చేసింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడక ముందు తెలంగాణ జీఎస్డీపీ కేవలం రూ.4 లక్షల కోట్లే. ఇది దేశ సంపద (జీడీపీ)లో 4.04 శాతం మాత్రమే. కానీ టీఆర్ఎస్ పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత రాష్ట్ర సంపద శరవేగంగా పెరిగి ఐదేండ్లలోనే రెట్టింపైంది. ప్రస్తుత ధరల ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సంపద రూ.8.66 లక్షల కోట్లకు పెరిగి దేశ సంపదలో 4.55 శాతానికి చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.9,50,000 కోట్లు దాటవచ్చని ప్రాథమిక అంచనా.

## విపక్షాలు కండ్లు తెరవాలి: కేటీఆర్



KTR
@KTRTRS

BJP & INC leaders who level random allegations on Telangana's borrowings need to educate themselves better

Govt of India in its written reply to a question in Loksabha has stated that Telangana's Debt to GSDP ratio is 17%. State debt is well within FRBM limits & fiscally prudent

తెలంగాణ ప్రభుత్వం పరిమితికి లోబడి అప్పులు తీసుకుంటున్నట్టు పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం వెల్లడించిందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మారుస్తున్నదని తప్పుడు ప్రచారం చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ ఇప్పటికైనా కండ్లు తెరవాలని సూచించారు. ఈ విషయంలో ఆ రెండు పార్టీల నేతలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరమున్నదని ట్వీట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఎఫ్ఆర్బీఎం పరిమితికి లోబడి రుణాలు తీసుకొంటున్నట్టు కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో మరోసారి రుజువయిందని, రాష్ట్రం పట్ల టీఆర్ఎస్ ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని ఈ ప్రకటన నిరూపిస్తున్నదని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

**లోకం పోకడ**




ఈ రాత మార్చమని ఎవరయ్యా మీకు చెప్పింది?

# హైదరాబాద్ రహదారులు సూపర్

- బ్రిటిష్ వృద్ధదంపతుల ప్రశంస
- హైదరాబాద్‌కు చేరిన ‘ట్రాన్స్ ఇండియా చాలెంజ్’ యాత్ర
- సర్క్యులర్ ఎకానమీ ప్రాజెక్టులకు నిధుల సేకరణే ధ్యేయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ రహదారులు సూపర్‌గా ఉన్నాయని బ్రిటన్‌కు చెందిన అలెన్ బ్రేత్‌వైట్ (73), ప్యాట్ దంపతులు ప్రశంసించారు. మంగళవారం వారు హైదరాబాద్‌లోని బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈ నెల 1వ తేదీన ముంబైలో ప్రారంభమైన ట్రాన్స్ ఇండియా చాలెంజ్ యాత్ర ఖమ్మం, రాజమండ్రి, కోల్‌కతా, పాట్నా, వారణాసి, న్యూఢిల్లీ, ఉదయ్‌పూర్ తదితర ప్రాంతాల మీదుగా 34 రోజులపాటు దాదాపు 5,600 కి.మీ. దూరం సాగుతుందని వెల్లడించారు. భారత్‌లో సర్క్యులర్ ఎకానమీ ప్రాజెక్టులకు రూ.1.8 కోట్ల నిధులను సేకరించేందుకు ‘గూంజ్’ సంస్థతో కలిసి ఈ యాత్ర నిర్వహిస్తున్న ట్రాన్స్ ఇండియా చాలెంజ్‌కు రాల్ఫ్ లారెన్, మోర్గాన్ మోటర్ కంపెనీ, వరల్డ్‌వైడ్


ట్రాన్స్ ఇండియా చాలెంజ్ యాత్రలో పాల్గొన్న బ్రిటన్‌కు చెందిన అలెన్ బ్రేత్‌వైట్

ఫుడ్స్, బేరింగ్ పాయింట్, ఈ-కార్గో బైక్స్, యూకే ఫారిన్ అండ్ కామన్‌వెల్త్ ఆఫీస్ సహకారం అందిస్తున్నాయని వివరించారు.

**అలెన్ యాత్ర స్ఫూర్తిదాయకం: ఫ్లెమింగ్**

భారత గ్రామీణ ప్రాంతాలకు ప్రయోజనం కలిగించేందుకు ఈ యాత్ర చేపట్టిన అలెన్, ప్యాట్ దంపతులకు మనస్ఫూర్తిగా ఆహ్వానం పలుకుతున్నామని హైదరాబాద్‌లోని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ డాక్టర్ ఆండ్రూ ఫ్లెమింగ్ చెప్పారు. శస్త్రచికిత్స చేయించుకొన్న అలెన్ 73 ఏండ్ల వయసులో ఈ యాత్ర చేపట్టడం అనేక మందికి స్ఫూర్తినిస్తుందన్నారు. ఈ మీడియా సమావేశంలో గూంజ్ ప్రతినిధి శ్రీధర్ తదితరులు కూడా పాల్గొన్నారు.



**గణతంత్ర దినోత్సవం రోజున ఢిల్లీలో తెలంగాణ శకటం తరఫున పాల్గొన్న కళాకారుల బృంద సభ్యులు మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌ను కలిశారు. వారి ప్రదర్శనను మెచ్చుకొన్న గవర్నర్.. వారితో కలిసి కొద్దిసేపు నృత్యాలు చేశారు. అనంతరం సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు.**



# పసుపు బోర్డు పక్కదారి!

- బోర్డులు విఫలమయ్యాయంటూ బీజేపీ యూ టర్న్
- ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రకటించి చేతులు దులుపుకొన్న కేంద్రం
- వరంగల్ రీజినల్ కార్యాలయంతో ఒనగూరింది శూన్యం
- మాటమార్చిన బీజేపీకి బుద్ధిచెప్తామంటున్న నిజామాబాద్ రైతాంగం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటుపై కమలనాథులు యూ టర్న్ తీసుకున్నారు. బోర్డును సాధిస్తామంటూ గత పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లుదండుకున్న బీజేపీ నేతలు అసలు బోర్డులెందుకు.. అవి విఫలమయ్యాయంటూ కొత్త రాగం అందుకొన్నారు. ఇప్పటికే వరంగల్‌లో కొనసాగుతున్న సుగంధద్రవ్యాల బోర్డు ప్రాంతీయ కార్యాలయంతో ఒనగూరుతున్న ప్రయోజనమేమీ లేకపోగా.. నిజామాబాద్‌లో మరో ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటుచేస్తున్నట్టు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రకటించడంపై ఆర్మూర్ పసుపు రైతులు మండిపడుతున్నారు. బోర్డు ఏర్పాటును సాధించని తన నిస్సహాయస్థితి, అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌తోపాటు బీజేపీ నాయకులు సుగంధద్రవ్యాల బోర్డు ప్రాంతీయకార్యాలయాన్ని ప్రకటించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**బోర్డు ఉన్నచోట బోలెడు ప్రయోజనాలు**

కేంద్రప్రభుత్వం 1987లో కొచ్చి కేంద్రంగా సుగంధద్రవ్యాల బోర్డును ఏర్పాటుచేసింది. సుగంధద్రవ్యాలు పండించే రైతుల ప్రయోజనాలతోపాటు పరిశోధన, గిట్టుబాటు ధర కల్పించడం వంటి చర్యలు తీసుకొంటుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో దిగుబడుల విక్రయానికి అనువుగా ఎగుమతుల వ్యవహారాలను పర్యవేక్షిస్తుంది. బోర్డు కార్యకలాపాలు సాఫీగా కొనసాగించేందుకు రీజినల్, జోనల్ కార్యాలయాల ఏర్పాటుతోపాటు పలు ప్రాంతాల్లో మార్కెటింగ్ అధికారులను నియమించింది.

**ఇప్పటికే వరంగల్‌లో రీజినల్ కార్యాలయం**

సుగంధద్రవ్యాల బోర్డు పరిధిలోకి వచ్చేలా 2010లో కేరళ, తమిళనాడు, కర్ణాటక, సిక్కిం, గువాహటి, గుజరాత్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కోసం గుంటూరు, వరంగల్‌లో ప్రాంతీయ కార్యాలయాలను కేంద్రం ఏర్పాటు చేసింది. వీటితోపాటు 16 జోనల్ కార్యాలయాలు, సికింద్రాబాద్ సహా 13 మార్కెటింగ్ కార్యాలయాలు ఏర్పాటుచేశారు. తెలంగాణకు సంబంధించి ఇప్పటికే వరంగల్‌లో రీజినల్, సికింద్రాబాద్‌లో మార్కెటింగ్ కార్యాలయాలు పనిచేస్తున్నాయి. కానీ, వీటి ద్వారా పసుపు, మిర్చి రైతులకు ఆశించినమేరకు ప్రయోజనం చేకూరడం లేదు. దీంతో తమకు ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటుచేయాలని పసుపు రైతులు సుదీర్ఘకాలంగా పోరాటం చేస్తున్నారు. పసుపుబోర్డును ఏర్పాటుచేస్తామంటూ గత పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు దండుకున్న బీజేపీ నేతలు ఇన్ని రోజులు ఆ ఊసే ఎత్తలేదు. దీంతో పసుపు రైతుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతుండటం.. బోర్డు ఏర్పాటుకు సుముఖంగా కేంద్రం లేకపోవడంతో రైతులను మభ్యపెట్టేందుకు సుగంధ ద్రవ్యాల విస్తరణ రీజినల్ కార్యాలయం ప్రకటన చేయించారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**పరిమిత అధికారాలతో ఒరిగేదెంత?**

తెలంగాణ పరిధిలో ఇప్పటికే వరంగల్‌లో రీజనల్ కార్యాలయం ఉండగా.. మరో కార్యాలయాన్ని ఏర్పాటుచేయడం వల్ల కలిగే అదనంగా ఒనగూరే ప్రయోజనమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. వాస్తవంగా ఇక్కడ రైతులకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడానికి వీలుండదు. ప్రతి విషయాన్ని కేంద్రానికి నివేదించి అక్కడి నుంచి అనుమతి వస్తేనే అమలుచేస్తారు.దళారుల బారినపడి మోసపోయిన పసుపు రైతులకు వరంగల్‌లోని రీజినల్ కార్యాలయం ద్వారా ఎలాంటి న్యాయంజరుగలేదు. ఇదే క్రమంలో నిజామాబాద్‌లో అదనంగా రీజనల్ కార్యాలయం ఏర్పాటు వల్ల మార్కెటింగ్ వ్యవస్థ విస్తరణ, మద్దతు ధర నిర్ధారణ అనేది ఏమాత్రం సాధ్యం కాదనే వాస్తవం.

### పసుపుబోర్డు కావాలి.. స్పైస్‌బోర్డు రీజినల్ ఆఫీసు కాదు



పసుపు బోర్డు ఏర్పాటుచేసి.. దానిద్వారా మద్దతు ధర చెల్లించి పసుపును కొనుగోలుచేయాలి. ఇది రైతులు చేస్తున్న డిమాండ్. ఇదివరకే వరంగల్‌లో స్పైసెస్ బోర్డు ఆఫీసు ఉన్నది. ఓ ఇద్దరు ఆఫీసర్లతో నిజామాబాద్‌లో మరో ఆఫీసు పెడ్తామని కేంద్రం చెప్తున్నది. దీంతో లాభమేమీ లేదు. వరంగల్‌లో ఉన్నా.. నిజామాబాద్‌లో ఉన్నా ఒకటే. నిజామాబాద్‌లో ఓ ఆఫీసు పెడితే పసుపు రైతులకు ఎలాంటి ఉపయోగం లేదు. ఎంపీ అర్వింద్ ఇన్నిరోజులు మాయమాటలు చెప్పి ఇప్పుడు కొత్తనాటకం ఆడుతున్నారు. కేంద్రప్రభుత్వం రైతులకు ఏమైనా మేలు చేయాలంటే వెంటనే పసుపుబోర్డు ఏర్పాటుచేయాలి. మద్దతు ధర ప్రకటించి కేంద్రమే పసుపును కొనుగోలుచేయాలి. ఇదే రైతులు డిమాండ్ చేస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు తెస్తున్నారు. ఎకరానికి పదివేల రైతుబంధు సాయం ఇస్తున్నారు. ఎరువులు, విత్తనాలు సకాలంలో అందిస్తున్నారు. రైతులకు 24 గంటల కరంటు అందిస్తున్నారు. రైతులకు ఏమేమి కావాలో రాష్ట్రప్రభుత్వం నుంచి అన్నీ చేస్తున్నారు. కేంద్రం ఇదొక్క పనిచేయాలని డిమాండ్ చేస్తున్నా. ఇలాంటి తప్పుడు ప్రకటనలు ఇచ్చి మోసం చేసేపని మానుకోవాలి. రైతుల కోసం కేంద్రం ఒక్క పసుపుబోర్డు ఏర్పాటుచెయ్యదా?

**-వేముల ప్రశాంత్‌రెడ్డి, రాష్ట్రమంత్రి**

### పసుపు బోర్డు తప్ప ప్రత్యామ్నాయం లేదు



సుగంధ ద్రవ్యాల రీజినల్ ఎక్స్‌టెన్షన్ సెంటర్‌ను ఏర్పాటుచేస్తున్నట్టు ప్రకటించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. పసుపు పంటకు మద్దతు ధర, ప్రత్యేక పసుపు బోర్డు ఏర్పాటు కోసం 15 ఏండ్లుగా పోరాటం చేస్తున్నాం. వాస్తవంగా ఎన్డీఏ ప్రభుత్వం 2018 లోనే ఈ తరహా కార్యాలయాన్ని ఏర్పాటుచేయగా.. మాజీ ఎంపీ కవిత, పసుపు రైతుల సంఘం వ్యతిరేకించారు. ఇప్పుడు రీజినల్ సెంటర్ ఏర్పాటులో ఎంపీ అర్వింద్ చేసిందేమీ లేదు. పసుపు రైతులకు ఉపశమనం కాదు. పసుపు బోర్డు ఏర్పాటుచేయాలి.

**-కే నరసింహనాయుడు,అధ్యక్షుడు**
**రాష్ట్ర పసుపు రైతుల సంఘం**

### నాటి స్పైస్ పార్కే నేటి ప్రాంతీయ కార్యాలయం

**ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి**




2018లోనే అప్పటి నిజామాబాద్ ఎంపీ కవిత చొరవతో నాటి కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు నిజామాబాద్ కేంద్రంగా స్పైస్ డెవలప్‌మెంట్ పార్కును ఏర్పాటుచేస్తున్నట్టు ప్రకటించారు. ఆ స్పైస్ పార్కునే ఇప్పుడు 2020లో మళ్లీ ప్రకటించారే తప్ప.. కొత్తగా చేసిందేమీ లేదు. పసుపు రైతులకు కావాల్సింది పసుపు ప్రత్యేక బోర్డు ఏర్పాటు, మద్దతుధర మాత్రమే. కానీ, ఎలాంటి స్పైస్ రీజినల్ ఆఫీసులు కాదు. పసుపు రైతులు బోల్తా కొట్టిస్తే బోల్తాపడేవారు కాదు.

# తెలంగాణ ఒక పర్యాటక క్షేత్రం

- అడుగడుగునా ఆహ్లాదకర ప్రదేశాలు
- మన్ననూర్, ఈగలపెంట టూరిజం రిసార్టుల ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్



నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్, ఈగలపెంటలో నిర్మించిన పర్యాటకశాఖ రిసార్ట్ (ఇన్‌సెట్) కృష్ణానదిలో క్రూయిజ్ షికారు చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో విప్ గువ్వల బాలరాజు, ఎమ్మెల్సీ కసిరెడ్డి, నటుడు తనికెళ్ల భరణి కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏ రాష్ట్రంలోనైనా కొన్నే పర్యాటక ప్రాంతాలు ఉంటాయని, అయితే తెలంగాణ మొత్తం ఒక పర్యాటక క్షేత్రమని, ఇక్కడ అడుగడుగునా ఆహ్లాదకర ప్రదేశాలు ఉన్నాయని పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ప్రత్యేక పర్యాటక విధానానికి నాందిపలికి అన్నిప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని మన్ననూరు, ఈగలపెంటలో రూ.34 కోట్లతో నిర్మించిన టూరిజం రిసార్టులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, టీఎస్‌టీడీసీ చైర్మన్ భూపతిరెడ్డి, ఎండీ మనోహర్, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో తెలంగాణను, ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్‌ను అభివృద్ధి చేస్తున్నందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. టెంపుల్, ఎకో టూరిజంపై ప్రత్యేక శ్రద్ధవహించి అభివృద్ధి చేస్తున్నారని, తాజాగా రూ.50 కోట్ల అభివృద్ధి పనులు పూర్తిచేసినట్టు చెప్పారు. వచ్చేనెల బుద్ధవనం ప్రాజెక్ట్ ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. ఇటీవల సోమశిల నుంచి క్రూయిజ్ సేవలను ప్రారంభించామని, తాజాగా పర్యాటకులకు ఇబ్బందులు కలుగకుండా రిసార్టులు, హోటళ్లు, ఇతర వసతులను కల్పిస్తున్నట్టు చెప్పారు. పాపికొండలకు తీసిపోకుండా సోమశిల-శ్రీశైలం క్రూయిజ్ ప్రయాణం ఉంటుందని పేర్కొన్నారు. ఒకప్పుడు మన్ననూర్, ఈగలపెంట తుపాకీ మోతలతో దద్దరిల్లేవని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఈ ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో రూపురేఖలు మారాయని చెప్పారు. మహబూబ్‌నగర్‌ను సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వం పలు ప్రాజెక్టులను ప్రారంభించిదని తెలిపారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ.. హరిత రిసార్టులు తమ నియోజకవర్గంలో ప్రారంభించడం అదృష్టమని చెప్పారు. మంత్రితోపాటు ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఉన్నారు. అనంతరం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి కృష్ణానదిలో క్రూయిజ్ షికారు చేశారు.

**శ్రీశైల మల్లన్నసన్నిధిలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

**శ్రీశైలం:** శ్రీశైల భ్రమరాంబికా మల్లికార్జున స్వామిని మంగళవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణదేవరాయ గోపురం నుంచి ఆలయ ప్రవేశం చేసిన మంత్రికి ఆలయ అధికారులు, వేదపండితులు ఘనస్వాగతం పలికారు.

## ఫేస్ రికగ్నిషన్ ఓటింగ్ విజయవంతం

- సరైన వెలుతురులేక కొన్నిచోట్ల ఇబ్బందులు
- ఈసీకి నివేదించిన రాష్ట్ర ఎన్నికల సంఘం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో చేపట్టిన ఫేస్ రికగ్నిషన్ ప్రయోగం విజయవంతమైంది. దేశంలోనే తొలిసారి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 10 పోలింగ్ కేంద్రాల్లో ఫేస్ రికగ్నిషన్ యాప్ ద్వారా పోలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ రూపొందించిన పెన్షనర్ల సెల్ఫీ యాప్ ఆధారంగా ఫేస్ రికగ్నిషన్ ఓటింగ్ చేపట్టారు. దీనిలో మొత్తం 80 శాతం పోలింగ్ నమోదయిందని, కొన్ని పోలింగ్ కేంద్రాల్లో వెలుతురు సరిగా లేకపోవడంతో ముఖ గుర్తింపు జరుగలేదని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) ప్రకటించింది. పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే సదరు యాప్, మొబైళ్ల నుంచి డాటాను తొలగించామని, ఫేస్ రికగ్నిషన్ పోలింగ్ ప్రక్రియ మొత్తాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదించామని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ పెన్షనర్ల కోసం సెల్ఫీ యాప్‌ను రూపొందించారు. సెల్ఫీ తీసి ఈ యాప్‌లో నమోదుచేస్తే వారు లైవ్ సర్టిఫికెట్ ఇవ్వకున్నా పెన్షన్ సొమ్మును వారి ఖాతాలకు బదిలీచేస్తున్నారు. ఈ యాప్ సాయంతోనే మున్సిపల్ ఎన్నికల్లో ముఖ గుర్తింపు ద్వారా ఓటువేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఇందుకోసం ప్రత్యేకాధికారులను నియమించి, వారికి మొబైల్, ల్యాప్‌ట్యాప్‌లను ఇచ్చారు. కాగా ఫేస్ రికగ్నిషన్ యాప్ ద్వారా ఓటేసే విధానంపై ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విధానం వల్ల ముస్లిం మహిళలకు ఇబ్బంది ఉంటుందని ఆయన ఎన్నికల సంఘానికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

# ఆరోగ్యశ్రీ నిధులు విడుదల

- తాజాగా రూ.227 కోట్లు మంజూరు
- ఇప్పటికే 1,150 కోట్లు చెల్లించిన సర్కార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ఆరోగ్యశ్రీ పథకానికి రాష్ట్రప్రభుత్వం పూర్తిస్థాయి నిధులు విడుదల చేసింది. ఆరోగ్య తెలంగాణ సాధనే లక్ష్యంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలుచేస్తున్న వైద్య పథకాలకు నిధుల మంజూరులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకొంటున్నారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికిగాను ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ పథకాల అమలుకు రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే రూ.1,150 కోట్లు విడుదల చేసింది. మిగిలిన రూ.227 కోట్లు సైతం తాజాగా మంజూరుచేసింది. ఇందుకుసంబంధించి ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు ఆర్థికశాఖ చెక్కులను జారీ చేసినట్టు సమాచారం. వీటిద్వారా ఆరోగ్యశ్రీ సేవలకు చెల్లింపులు జరుపనున్నారు. శాసన సభ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోడ్, తదితర కారణాలతో వైద్య పథకాలకు ఈ ఏడాది చెల్లింపుల్లో కొంత జాప్యం జరిగినప్పటికీ.. ఈ ఆర్థిక సంవత్సరం కేటాయించిన నిధుల్లో పూర్తిస్థాయిలో మంజూరు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను ఆరోగ్యశ్రీ పథకం అమలుకు రూ.973 కోట్లు, ఈహెచ్‌ఎస్ అమలుకు రూ.407 కోట్లు కేటాయించగా ఇప్పటివరకు రూ.1,150 కోట్లు విడుదలయ్యాయి. మిగిలిన మొత్తాన్ని కూడా ఫిబ్రవరిలోనే మంజూరుచేయడంతో ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులకు పూర్తిస్థాయిలో చెల్లింపులు జరిపేందుకు అవకాశం ఏర్పడింది.

# రేపటినుంచి సహకార నామినేషన్లు

- శనివారం వరకు దాఖలుకు గడువు
- రెండు సెట్లు దాఖలు చేయవచ్చు
- ఒక్కో డైరెక్టర్‌వార్డుకు పోలింగ్‌కేంద్రం
- ఓట్లు సమానమైతే లాటరీతో విజేతల ప్రకటన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని 905 సహకార సంఘాల పరిధిలోని 11,742 డైరెక్టర్ పదవుల ఎన్నికలకు సంబంధించి గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలుకానున్నది. ఇప్పటికే జిల్లా సహకార ఎన్నికల అథారిటీ ఎన్నికల నోటిఫికేషన్ జారీచేయడంతో నామినేషన్ల ప్రక్రియ ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. నామినేషన్ల దాఖలుకు శనివారం (8వ తేదీ) వరకు గడువు ఉన్నది. నామినేషన్ ఫీజు ఎస్సీ, ఎస్టీలకు రూ.500, బీసీలకు రూ.750, జనరల్ అభ్యర్థులకు రూ.1000గా నిర్ణయించారు. తొమ్మిదో తేదీన నామినేషన్లను పరిశీలిస్తారు. 10న ఉపసంహరణ తర్వాత అభ్యర్థుల తుదిజాబితా, గుర్తులు కేటాయిస్తారు. 15న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు. ఒక అభ్యర్థి రెండు సెట్లకు మించి నామినేషన్ పత్రాలు దాఖలు చేయరాదని అధికారులు తెలిపారు. ఒక డైరెక్టర్ వార్డులో ఓటరుగా నమోదైన వ్యక్తి, మరో డైరెక్టర్ వార్డులో పోటీచేయవచ్చు. ఆ అభ్యర్థిని ప్రతిపాదించే, బలపరిచేవాళ్లు ఆయా వార్డుల్లోనే ఓటు హక్కు కలిగి ఉండాలి. ఒక వ్యక్తి ఒకరిని మాత్రమే ప్రతిపాదించాలి. ప్రతిపాదించే, బలపరిచే వ్యక్తులు ఓటు వేసేందుకు అర్హులై ఉండాలి. నామినేషన్ పత్రాన్ని ఎన్నికల అధికారికి ఇచ్చే సమయంలో ప్రతిపాదిస్తున్న వ్యక్తి తప్పనిసరిగా అభ్యర్థితో ఉండాలి. ఇక పోటీచేసే అభ్యర్థులు ఇద్దరికి సమానంగా ఓట్లు వస్తే విజేతను లాటరీ పద్ధతిలో ఎంపికచేస్తారు. ఒక డైరెక్టర్ ఎన్నికకు ఒక్కో పోలింగ్ బూత్ చొప్పున 11,742 పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటుచేయనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ముగ్గురు ఎన్నికల సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. ప్రతి ప్యాక్(పీఏసీఎస్)లో 13 డైరెక్టర్ పదవులు ఉండగా, రెండు మహిళలకు (1 ఎస్సీ, 1 ఓసీ), రెండు బీసీలకు, ఒకటి ఎస్సీ, మరొకటి ఎస్టీలకు, ఏడు జనరల్ క్యాటగిరీకి రిజర్వ్ చేశారు. ఈ లెక్కన 906 ప్యాక్స్‌లో 11,742 డైరెక్టర్ పదవుల్లో మహిళలకు 1,808, బీసీలకు 1,808, ఎస్సీ, ఎస్టీలకు 905, మిగతావి ఓపెన్ క్యాటగిరీలో చేర్చారు.








**తెలంగాణ ప్రభుత్వం**
**(వాలంతరి), హైదరాబాద్**
**భూమి మరియు నీటి యాజమాన్యంతో సుస్థిరమైన లాభసాటి వ్యవసాయం**
**(మూడు నెలలు-సర్టిఫికెట్ కోర్సు)**

వాలంతరిలో ఫిబ్రవరి 2020లో ప్రారంభించనున్న మూడు నెలల సర్టిఫికెట్ కోర్సుకై ఇంటరు/ఐ.టి.ఐ/డిప్లొమా చదివిన 18-30సం॥లు వయస్సుగల గ్రామీణ యువత నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి. ఈ కోర్సు రుసుము రూ. 5,000/- (తిరిగి ఇవ్వబడదు) ఉచిత భోజనం మరియు వసతి సదుపాయము కలదు. మౌఖికపరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక చేయబడును. దరఖాస్తు రుసుము రూ. 500/-. దరఖాస్తు మరియు వివరాలకై **www.tswalamtari.cgg.gov.in**ను దర్శించగలరు. **దరఖాస్తు చేసుకోవలసిన ఆఖరు తేది: 15-02-2020 సా. 5.00గం.** వరకు. దరఖాస్తు పంపవలసిన చిరునామా: Director (A&R) WALAMTARI, హిమాయత్‌సాగర్, రాజేంద్రనగర్, హైదరాబాద్-500030 (స్వయంగా లేదా పోస్టు ద్వారా). కోర్సు కాలవ్యవధి: 25 ఫిబ్రవరి, 2020 నుండి 24 మే, 2020 వరకు. ఈ కోర్సు ఏ కారణం చేత ప్రారంభించుటగాని, నిలిపి వేయుటగాని పూర్తి అధికారాలు మహా సంచాలకులు, వాలంతరి గారికి కలిగి వుండును.

సం/- మహా సంచాలకులు, వాలంతరి
DIPR RO. No. 2352-DP/CL/Advt/1/2019-20, Dt: 04/02/2020

**తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయముల సంస్థ (రి),**
**గురుకులం, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్**
Rc. No. B1/Acad/0365/20-21, **ప్రవేశ పరీక్ష ప్రకటన** తేది: 04-02-2020

రాష్ట్రవ్యాప్తంగాగల (73) తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో 2020-21 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో జనరల్ మరియు వృత్తివిద్యా కోర్సులలో చేరుటకు ప్రస్తుతం 10వ తరగతి చదువుచున్న విద్యార్థులు ప్రవేశ పరీక్ష వ్రాయుటకు అర్హులు. దరఖాస్తు ఫారములను ఆన్‌లైన్‌లో సమర్పించుటకు **ఆఖరి తేది: 23-02-2020.**
**ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్లను పాటిస్తూ సెలెక్షన్స్ చేయబడును. ఎంపికైన అభ్యర్థులు సెలక్షన్ లెటర్లను వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొని కళాశాలల్లో చేరవలెను.**
వివరములకు **http://www.tgtwgurukulam.telangana.gov.in** వెబ్‌సైట్‌ను సందర్శించగలరు. ఆఫీస్ నెం. **91213 33472 & 91211 74434**

సం/- **డా॥ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, ఐ.పి.ఎస్.,**
DIPR RO.No. 641-PP/CL/ADVT/1/2019-20, Dt: 04-02-2020 **కార్యదర్శి, గురుకులం**

**తెలంగాణ ప్రభుత్వము**
**న్యాయ శాఖ**
**విచారణ కమిషను**
(రిట్ పిటిషన్ (క్రిమినల్) నెం.348/2019లో గౌరవనీయ సర్వోన్నత న్యాయస్థానము జారీ చేసిన 12.12.2019వ తేదీనాటి ఉత్తరువు ద్వారా రూపొందించబడినది)
హైదరాబాదులో, 2019 డిసెంబర్ 6వ తేదీన ఆరోపిత ఎన్‌కౌంటర్‌లో మహమ్మద్ ఆరిఫ్, చింతకుంట చెన్నకేశవులు, జొల్లు శివ మరియు జొల్లు నవీన్ అనే నలుగురు వ్యక్తుల మరణమునకు సంబంధించినది.
**కోరమ్:** సర్వోన్నత న్యాయస్థానపు మాజీ న్యాయమూర్తి, గౌరవనీయ జస్టిస్ వి.ఎస్.సర్‌పుర్కర్ (రిటైర్డ్), ఛైర్మన్; బాంబే ఉన్నత న్యాయస్థాన మాజీ న్యాయమూర్తి, గౌరవనీయ జస్టిస్ ఆర్.పి.సందుర్ బల్‌డోటా, మరియు కేంద్ర దర్యాప్తు బ్యూరో యొక్క మాజీ డైరెక్టరు, డి.ఆర్.కార్తికేయన్, సభ్యులు.
**సి-బ్లాక్, 2వ అంతస్తు**
**ఉన్నత న్యాయస్థాన భవనములు,**
**హైదరాబాదు-500066, తెలంగాణ.**
సీఓఏ/1/2020 **తేదీ: 4.2.2020**

**బహిరంగ నోటీసు**

ఏ. తెలంగాణ రాష్ట్రములోని హైదరాబాదులో, 2019 నవంబరు 28వ తేదీన జరిగిన ఒక సంఘటనలో ఒక యువ వెటర్నరీ డాక్టరును మానభంగము చేసి, హత్య చేయడం జరిగింది మరియు ఆమె మృత శరీరాన్ని కాల్చివేయడం జరిగింది. సదరు నేరంతో సంబంధమున్న మహమ్మద్ ఆరిఫ్, చింతకుంట చెన్నకేశవులు, జొల్లు శివ మరియు జొల్లు నవీన్ అనే నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి జుడీషియల్ కస్టడీకి, ఆ తరువాత పోలీసు కస్టడీకి పంపడం జరిగినందున;
బీ. 2019 డిసెంబర్ 6వ తేదీన, చనిపోయిన మానభంగ బాధితురాలికి చెందిన కొన్ని వస్తువులను తిరిగి పొందడానికి నేరస్థలములో నేరము జరిగిన పరిస్థితులను పునఃపరిశీలించడానికి పోలీసులు నిందితులను నేర స్థలమునకు తీసుకు వెళ్ళగా, నలుగురు నిందితులు ఆరోపిత ఎన్‌కౌంటర్‌లో పోలీసులచే చంపబడినందున;
సీ. 12.12.2019వ తేదీ నాటి రిట్ పిటిషన్ (క్రిమినల్) నెం.348/2019లో గౌరవనీయ సర్వోన్నత న్యాయస్థానము ఇచ్చిన ఉత్తరువు ననుసరించి, గౌరవనీయ జస్టిస్ వి.ఎస్.సర్‌పుర్కర్ (రిటైర్డ్) ఛైర్మన్‌గా మరియు ఆయన నేతృత్వంలో, గౌరవనీయ జస్టిస్ ఆర్.పి.సందుర్ బాల్‌డోటా (రిటైర్డ్), బాంబే ఉన్నత న్యాయస్థాన మాజీ జడ్జి, మరియు కేంద్ర దర్యాప్తు బ్యూరో యొక్క మాజీ డైరెక్టర్ డి.ఆర్.కార్తికేయన్ సభ్యులుగా నియమిస్తూ విచార కమిషన్ ఏర్పాటు చేయబడింది. ఇంకనూ, 10.01.2020వ తేదీ నాటి ఉత్తరువు ద్వారా గౌరవనీయ సర్వోన్నత న్యాయస్థానము ఈ క్రింది నిబంధనలను నిర్దేశించింది.
ఏ. యువ మహిళా వెటర్నరీ డాక్టరు యొక్క మానభంగము మరియు హత్య ఉదంతానికి సంబంధించి అరెస్టు చేయబడిన మహమ్మద్ ఆరిఫ్, చింతకుంట చెన్నకేశవులు, జొల్లు శివ మరియు జొల్లు నవీన్ అనే నలుగురు వ్యక్తులు, వారు పోలీసు కస్టడీలో ఉండగా, 2019 డిసెంబరు 6వ తేదీన, మరణమునకు దారి తీసిన ఆరోపిత సంఘటనని విచారణ జరుపుట.
బి. పైన పేర్కొనిన నలుగురు వ్యక్తుల మరణమునకైన పరిస్థితులను విచారించుట మరియు ఈ వ్యవహార క్రమంలో ఏదైనా అపరాధము జరిగినదా అను దానిని గురించి కనుగొనవలసినదిగాను, ఒక వేళ జరిగినట్లయితే దానికైన అధికారులతో బాధ్యతను నిర్ధారించుట.
డీ. అందువలన ఇపుడు, ఆ విధంగా నియమించబడిన కమిషను, సంఘటనతో సంబంధమున్న, దానికి గురియైన, దాని గురించి తెలిసి ఉన్న వ్యక్తులందరి నుండి మరియు విచారణ విషయమునకు సంబంధించి పై నిర్దేశములకు సంబంధించిన వివరణలను కమిషనుకు సమర్పించేందుకు సామాజిక అజెండా కలిగినట్టి ఇతర ప్రజా సంస్థలన్నింటి నుండి వివరణలను ఆహ్వానిస్తూ నోటీసును ఇచ్చింది. వివరణలో పొందుపరచే వాస్తవాలకు సంబంధించి అట్టి వివరణలు అఫిడవిట్ రూపంలో ఉండాలి. కమిషను ఆదేశములపైన తప్ప, దీనికి సంబంధించి ప్రతిస్పందనగా సమర్పించిన అఫిడవిట్లు అన్నియు గోప్యతతో కూడిన దస్తావేజులుగా పరిగణించబడతాయి. జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేటు లేదా పబ్లిక్ నోటరీ లేదా ప్రమాణాలు చేయించే కమిషనరు లేదా ప్రమాణము చేయించుటకు న్యాయపరంగా ప్రాధికారమీయబడిన ఎవరైనా ఇతర ప్రాధికారి సమక్షమున అఫిడవిట్లు ప్రమాణము చేయబడవలెను. ఇంకా, వివరణలను సమర్పించే వ్యక్తి, వివరణతో పాటుగా వాటిపై ఆధారపడిన, కమిషనుకు సమర్పించాలని తలచినటు వంటి ఏదైనా పత్రాల జాబితాను, వీలైనంత వరకు అటువంటి పత్రాలు అసలు ప్రతులను తన స్వాధీనము లేదా నియంత్రణలో ఉంచుకుని వాటి నకలు ప్రతులను ఎవరి నుండి పొందవచ్చునో అట్టి వ్యక్తి పేరు, చిరునామాను చెప్పవలెను.
ఈ. సివిల్ ప్రక్రియ స్మృతి క్రింద దావాను విచారించేందుకై సమను చేయుటకు మరియు ఎవరైనా వ్యక్తిని హాజరు పరచుట మరియు ప్రమాణముపై పరీక్షించుట; ఏదైనా దస్తావేజును వెతికి సమర్పించుట; అఫిడవిట్‌పై సాక్ష్యమును స్వీకరించుట; ఏదైనా న్యాయస్థానము లేదా కార్యాలయము నుండి ఏదైనా పబ్లిక్ రికార్డు లేదా దాని ప్రతిని కోరుట; సాక్షుల లేదా దస్తావేజులను పరీక్షించుటకై కమిషనులు జారీ చేయుట; విహితపరచిన ఏదైనా ఇతర విషయములపై సివిల్ న్యాయస్థానమునకు ఉండే అధికారాలను కలిగి ఉండి, విచారణ కమిషను చట్టము, 1952 యొక్క 4వ పరిచ్ఛేదం ప్రకారం కమిషనుకు సివిల్ న్యాయస్థాన అధికారములున్నవని ప్రజా పరిజ్ఞానం కోసం స్పష్టీకరించడమైనది.
ఎఫ్. కమిషను సమక్షములోని ఏదైనా ప్రొసీడింగు, భారత శిక్షా స్మృతి, 1860 యొక్క 193 మరియు 228వ పరిచ్ఛేదముల అర్థము లోపల న్యాయిక ప్రొసీడింగుగా భావించవలెనని కూడా స్పష్టము చేయడమైనది. కమిషను సమక్షంలో సాక్ష్యమును ఇచ్చే క్రమంలో ఒక వ్యక్తి చేసిన వివరణ తనకు లేదా ఏదైనా సివిల్ లేదా క్రిమినల్ ప్రొసీడింగులలో తనపై ఉపయోగించడానికి లోబడి, అట్టి వివరణ ద్వారా తప్పుడు సాక్ష్యమును ఇచ్చుటకైనదిగా అభియోగము చేయరాదు; అయితే, కమిషను కోరిన దానికి సమాధానముగా లేదా విచారణ యొక్క విషయమునకు సంబంధించిన ప్రశ్నకు జవాబును ఇచ్చుటకైన వివరణగా ఉండవలెను.
జీ. జతపరచిన దస్తావేజులతో పాటుగా అఫిడవిట్ వివరణల ఐదు ప్రతులను విచారణ కమిషను కార్యదర్శికి, విచారణ కమిషను, ‘సి’ బ్లాక్, 2వ అంతస్తు, ఉన్నత న్యాయస్థాన భవనములు, హైదరాబాదు, తెలంగాణ అనే చిరునామాకు 05.03.2020వ తేదీన లేదా ఆ లోపుగా చేరునట్లు పంపవలెను. ఆ తేదీ తరువాత అందిన ఏదైనా అఫిడవిట్ లేదా వివరణను అంగీకరించబడదు. అయితే, అట్టి ఆలస్య సమర్పణను పరిశీలించుటకు కమిషనుకు విచక్షణ ఉండును.
విచారణ కమిషను యొక్క ఉత్తరువుల మేరకు జారీ చేయబడినది.
DIPR RO No.2346-DP/CL/Advt/1/2019-20, Dt: 04/02/2020 **సం/- విచారణ కమిషన్ కార్యదర్శి, న్యాయ శాఖ**

గుజరాత్ మారణకాండ కేసు..

## మోదీకి క్లీన్‌చిట్‌పై ఏప్రిల్‌లో విచారణ

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు 2002లో ఆ రాష్ట్రంలో జరిగిన మారణకాండకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆయనకు క్లీన్‌చిట్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ నాడు మతోన్మాదుల చేతుల్లో దారుణ హత్యకు గురైన అప్పటి ఎంపీ ఎహ్‌సాన్ జాఫ్రీ భార్య జకియా జాఫ్రీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఏప్రిల్‌లో వాదనలు వింటామని సుప్రీం కోర్టు తెలిపింది. 2002 ఫిబ్రవరిలో గుజరాత్‌లోని గోద్రాలో సబర్మతి ఎక్స్‌ప్రెస్ రైలులోని బోగీని కొందరు దుండగులు తగులబెట్టడంతో 59 మంది కరసేవకులు మరణించిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మారణకాండలో గుల్బర్గ్ సొసైటీ వద్ద 68 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఎహ్‌సాన్ జాఫ్రీ కూడా ఉన్నారు. అయితే ఈ కేసును దర్యాప్తు చేసిన సిట్ మోదీతోపాటు మరో 63 మందికి క్లీన్‌చిట్ ఇచ్చింది. ఈ క్రమంలో క్లీన్‌చిట్‌ను సవాల్ చేస్తూ జకియా జాఫ్రీ 2018లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## 'బుల్లెట్ రైలు' తెల్ల ఏనుగు వంటిది



**మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే వ్యాఖ్య**

**ముంబై, ఫిబ్రవరి 4:** 'ముంబై-అహ్మదాబాద్' బుల్లెట్ రైలు ప్రాజెక్టు 'తెల్ల ఏనుగు' వంటిదని మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ప్రోత్సాహకంగా ఉంటుందని, ఆచరణ సాధ్యమని నిర్ధారణకు వచ్చాకే బుల్లెట్ రైలు ప్రాజెక్టుపై సమగ్ర నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'బుల్లెట్ రైలు' ప్రాజెక్టు కోసం చేపట్టిన భూసేకరణపై గిరిజనులు, రైతుల నుంచి గట్టి వ్యతిరేకత వ్యక్తం అవుతున్నదన్నారు. 'బుల్లెట్ రైలు ప్రధాని మోదీ కలల ప్రాజెక్టు కావచ్చు. కానీ వాస్తవాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి' అని శివసేన అధికార పత్రిక 'సామ్నా' ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ సంజయ్ రౌత్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఉద్ధవ్ స్పష్టం చేశారు. కేంద్ర నిధుల నుంచి రాష్ట్రానికి సరైన వాటా రావడం లేదన్నారు. ఆ నిధులను ఇస్తే రైతుల సంక్షేమానికి ఉపయోగిస్తామని చెప్పారు. వచ్చే నెల నుంచి పంట రుణ మాఫీ పథకం అమలు ప్రారంభమవుతుందని ఉద్ధవ్ తెలిపారు.

## బడ్జెట్‌పై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

బోడో ఒప్పందం చారిత్రాత్మక విజయం.. బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** కేంద్ర బడ్జెట్‌పై ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అయినప్పటికీ ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని చూస్తే ఇదే ఉత్తమ బడ్జెట్ అని విమర్శకులు సైతం అంగీకరిస్తున్నారని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఢిల్లీలో మంగళవారం ఆయన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ.. బోడో ఒప్పందంతోపాటు త్రిపురలో బ్రూ-రెయాంగ్ గిరిజన తెగ సభ్యులతో సెటిల్మెంట్ కోసం కుదుర్చుకొన్న ఒప్పందాన్ని ఈ దశబ్ద కాలంలో తన ప్రభుత్వం సాధించిన 'చారిత్రాత్మక విజయాలు'గా అభివర్ణించారు. దశాబ్దాల తరబడి హింస, రక్తపాతంతో ఆక్రోశిస్తున్న ఈశాన్య భారతావనిలో శాంతిని నెలకొల్పేందుకు ఈ ఒప్పందాలు దోహదపడతాయని మోదీ పేర్కొన్నారు.








మంగళవారం హైదరాబాద్‌లోని కేర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, విప్ సునీత తదితరులు

## రాష్ట్రంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

- హైదరాబాద్ గచ్చిబౌలిలోని కేర్ హాస్పిటల్‌లో ప్రారంభం
- మార్చి 3 వరకు ఉచిత పరీక్షల నిర్వహణ

**హెల్త్ డెస్క్, నమస్తే తెలంగాణ:** ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని కేర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఓ ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాన్ని ప్రారంభించింది. రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నది. గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ముఖ్యఅతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందం కంటే ఆరోగ్యంపైనే ఎక్కువగా దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. యాభై ఏండ్ల క్రితం పోలియో అంటే భయపడేవారని.. తర్వాత మెడికల్ క్యాంపు లు, టీకాలు, అవగాహనా కార్యక్రమాలతో పోలియోను వందశాతం నిర్మూలించగలిగామని చెప్పారు. ప్రభుత్వంతోపాటు, ఎన్జీవోలు, సామాజిక సేవాసంస్థలు, ప్రతిఒక్కరూ పోలియో నిర్మూలనను బాధ్యతగా తీసుకోవడంతో ఇది సాధ్యమయిందని తెలిపారు. క్యాన్సర్‌పై కూడా ప్రతి మహిళా మరో మహిళకు అవగాహన కలిగించాలని సూచించారు. వాతావరణంలో మంచి మార్పులకు, ప్లాస్టిక్, వాతావరణ కాలుష్యం నివారణకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. అందరం కలిసి క్యాన్సర్ నివారణ కోసం కృషిచేద్దామంటూ పిలుపునిచ్చారు. దేశంలో క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఉచిత క్యాన్సర్ పరీక్షల ద్వారా రాష్ట్ర ప్రజలు లబ్ధి పొందాలన్నారు కేర్ హాస్పిటల్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ గీతా నాగశ్రీ. మనదేశంలో 50శాతానికి పైగా క్యాన్సర్ కేసులు ముదిరిపోయిన తర్వాతే బయటపడుతున్నాయని, వ్యాధిబారిన పడిన వారిలో 70 శాతానికి పైగా మరణిస్తున్నారని చెప్పారు. అందుకే 40 ఏండ్లు దాటిన ప్రతి మహిళ పాప్‌స్మియర్, మమ్మోగ్రఫీ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేర్ దవాఖాన సీఎంఎస్ లెఫ్టినెంట్ జనరల్ డాక్టర్ ఏకే దాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు క్యాన్సర్ సర్వైవర్లు తమ అనుభవాలను పంచుకున్నారు.

**ఉచిత పరీక్ష కోసం..**

క్యాన్సర్‌ను ఎంత తొందరగా గుర్తిస్తే అంత మంచి ట్రీట్‌మెంట్ ఉంటుంది. ఇందుకోసం ప్రతి మహిళా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడానికి మోటివేట్ కావాలి. ఈ స్త్రీ, పురుషులిద్దరికీ మంగళవారం నుంచి మార్చి 3వ తేదీ వరకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల కోసం 040-6165 6565 నంబరులో సంప్రదించి ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సి ఉంటుంది.

# బుసకొడుతున్న క్యాన్సర్!

- 2018లో కొత్తగా నమోదైన 11.6 లక్షల కేసులు
- ప్రతి 10 మందిలో ఒకరు బాధితులు
- పురుషుల్లో అత్యధికంగా నోటి క్యాన్సర్.. మహిళల్లో రొమ్ము క్యాన్సర్




కోల్‌కతాలో పొగాకు ఉత్పత్తుల దిష్టిబొమ్మతో క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించిన ఎన్జీవోలు

**ఐరాస, ఫిబ్రవరి 4:** చాప కింద నీరులా వ్యాపిస్తూ.. శరీర కణజాలాన్ని క్రమంగా హరిస్తూ.. చివరికి ప్రాణాన్ని తీసే భయంకరమైన వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటి. 2018లో దేశంలో 11.6 లక్షల క్యాన్సర్ కేసులు కొత్తగా నమోదయ్యాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) పేర్కొంది. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినం. ఈ నేపథ్యంలో డబ్ల్యూహెచ్‌వో, ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసర్చ్ ఆన్ క్యాన్సర్(ఐఏఆర్సీ) సంస్థలు క్యాన్సర్ వ్యాధికి సంబంధించి సంయుక్తంగా రెండు నివేదికలను విడుదల చేశాయి. క్యాన్సర్‌పై గ్లోబల్ ఎజెండాను రూపొందించడమే లక్ష్యంగా ఒక నివేదికను రూపొందించగా.. మరో నివేదికలో క్యాన్సర్‌పై పరిశోధనలు, అరికట్టే మార్గాలపై చర్చించారు.

**49 శాతం వాటా ఆ ఆరు క్యాన్సర్లదే**

డబ్ల్యూహెచ్‌ఓ ప్రపంచ క్యాన్సర్ నివేదిక ప్రకారం.. ప్రతి 10 మంది భారతీయుల్లో ఒకరు తన జీవితకాలంలో క్యాన్సర్ బారిన పడుతున్నారని, ప్రతి 15 మందిలో ఒకరు ఈ వ్యాధి కారణంగా మరణిస్తున్నారని పేర్కొంది. 2018లో 11.6 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు నమోదైనట్టు, ఆ ఏడాది ఈ వ్యాధితో 7,84,800 మంది చనిపోయినట్టు నివేదిక వెల్లడించింది. భారతీయుల్లో ఆరు రకాల క్యాన్సర్‌లు ఎక్కువగా కనిపిస్తున్నాయని, వాటిలో రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, ఉదర క్యాన్సర్, పెద్దపేగు క్యాన్సర్ ఉన్నాయని నివేదిక వివరించింది. 2018లో నమోదైన కొత్త క్యాన్సర్ కేసుల్లో 49 శాతం వాటా వీటిదేనని పేర్కొంది. పురుషుల్లో నోటి క్యాన్సర్ కేసులు అత్యధికంగా (92 వేలు) నమోదవ్వగా, మహిళల్లో రొమ్ము క్యాన్సర్ కేసులు(1,62,500) ఎక్కువగా ఉన్నాయి.

**అల్పాదాయ దేశాల్లో 60 శాతం కేసులు**

పొగాకు సంబంధిత ఉత్పత్తులను తీసుకోవడం వల్ల నోరు, గొంతుకు సంబంధించిన క్యాన్సర్ వస్తున్నదని నివేదిక తేల్చింది. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న వర్గాల్లోనే ఈ తరహా క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని పేర్కొంది. మరోవైపు, అధిక బరువు, ఊబకాయం, తగినంత వ్యాయామం లేకపోవడం, జీవనశైలిలో మార్పుల వల్ల రొమ్ము, పెద్దపేగు సంబంధిత క్యాన్సర్ వస్తున్నదని, సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత వర్గాల్లో ఈ తరహా క్యాన్సర్ కనిపిస్తున్నదని నివేదిక వెల్లడించింది. క్యాన్సర్ వ్యాప్తిని అరికట్టడంలో తగిన చర్యలు తీసుకోకపోతే రానున్న 20 ఏండ్లలో అల్పాదాయ దేశాల్లో 60 శాతానికి పైగా క్యాన్సర్ కేసులు నమోదయ్యే ప్రమాదం ఉన్నదని డబ్ల్యూహెచ్‌ఓ హెచ్చరించింది. పొగాకును తీసుకునే 80 శాతం మంది ఈ దేశాల్లోనే నివసిస్తున్నారని, సిగరెట్, బీడీ వంటి వాటిని తాగే పురుషుల్లో 50 శాతం మంది చైనా, భారత్, ఇండోనేషియాలోనే నివసిస్తున్నారని నివేదిక పేర్కొంది.

**ముందుగా గుర్తించడం ముఖ్యం**

దేశంలో నోటి క్యాన్సర్ బారిన పడ్డ 90 శాతం మంది పేద, మధ్యతరగతి వర్గాలవారేనని నివేదిక వెల్లడించింది. క్యాన్సర్ వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించి, తగిన చికిత్స చేసుకోవడంతో 2000-2015 మధ్య అధిక ఆదాయ దేశాల్లో ఈ వ్యాధి వల్ల కలిగే మరణాలు 20శాతం తగ్గాయని, అయితే ఇది అల్ప ఆదాయ దేశాల్లో కేవలం ఐదు శాతంగా ఉన్నదని ఐఏఆర్సీ డైరెక్టర్ ఎలీసబెటి వైడర్‌పాస్ తెలిపారు.



**భారత్‌లో క్యాన్సర్ కేసులు-2018**

| పురుషుల్లో | | మహిళల్లో | |
|---|---|---|---|
| నోటి క్యాన్సర్ | 92,000 | రొమ్ము క్యాన్సర్ | 1,62,500 |
| ఊపిరితిత్తుల క్యాన్సర్ | 49,000 | గర్భాశయ క్యాన్సర్ | 97,000 |
| ఉదర క్యాన్సర్ | 39,000 | అండాశయ క్యాన్సర్ | 36,000 |
| పెద్దపేగు క్యాన్సర్ | 37,000 | నోటి క్యాన్సర్ | 28,000 |
| అన్నవాహిక క్యాన్సర్ | 34,000 | పెద్దపేగు క్యాన్సర్ | 20,000 |

## 'రాజద్రోహం' కేసు దర్యాప్తు ముమ్మరం

కర్ణాటక పాఠశాలలో పోలీసుల విచారణ



నాటకం వేసిన విద్యార్థులను ప్రశ్నిస్తున్న పోలీసులు

**బీదర్, ఫిబ్రవరి 4:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై కర్ణాటకలోని షహీన్ పాఠశాలలో విద్యార్థుల నాటక ప్రదర్శన ఘటనపై యాజమాన్యం, సిబ్బంది మీద నమోదైన రాజద్రోహం కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. గతనెల 21న విద్యార్థులు నాటకం ప్రదర్శించినట్టు ఆరోపణలు ఉన్నాయి. దర్యాప్తులో భాగంగా జనవరి 28న పోలీసులు యూనిఫాం ధరించి పాఠశాలను సందర్శించి విద్యార్థులను ప్రశ్నించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. అయితే, మంగళవారం ఉదయం సాధారణ దుస్తుల్లోనే పాఠశాలను సందర్శించిన పోలీసులు నాటకం కోసం స్క్రిప్ట్ ఎవరు రాశారు? వంటి ప్రశ్నల్ని విద్యార్థులు, సిబ్బందిని అడిగారని అధికారులు తెలిపారు.

## దోషుల ఉరి అమలుకు చొరవ చూపండి

ఢిల్లీ హైకోర్టులో నిర్భయ తల్లిదండ్రుల పిటిషన్

**న్యూఢిల్లీ:** నలుగురు దోషుల ఉరిశిక్ష అమలుకు చొరవ చూపాలని నిర్భయ తల్లిదండ్రులు ఢిల్లీ హైకోర్టును కోరారు. దోషులకు ఉరి అమలుపై ఢిల్లీలోని విచారణ కోర్టు జనవరి 31న నిరవధికంగా స్టే విధించటాన్ని సవాల్ చేస్తూ కేంద్రం దాఖలు చేసిన పిటిషన్‌పై త్వరగా నిర్ణయం తీసుకోవాలంటూ మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. వారి తరపు న్యాయవాది జితేంద్ర షా ఈ మేరకు కోర్టును అభ్యర్థించారు. మరోవైపు విచారణ కోర్టు తీర్పును కేంద్రంతోపాటు ఢిల్లీ ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేశాయి. వీటిపై విచారణ జరిపిన న్యాయమూర్తి సురేష్ కుమార్ కైత్ ఫిబ్రవరి 2న తీర్పును రిజర్వుచేశారు. రిజర్వు చేసిన తీర్పును ఢిల్లీ హైకోర్టు బుధవారం వెల్లడించనున్నట్టు సమాచారం.

## అమెరికా యూనివర్సిటీలో కాల్పులు

**ఇద్దరు మృతి, ఒకరికి గాయాలు**

**టెక్సాస్, ఫిబ్రవరి 4:** అమెరికాలో కాల్పులు కలకలం సృష్టించాయి. టెక్సాస్‌లోని ఏ అండ్ ఎం (అగ్రికల్చర్ అండ్ మెకానికల్) యూనివర్సిటీ క్యాంపస్‌లో ఓ గుర్తుతెలియని దుండగుడు తుపాకీతో కాల్పులు జరుపడంతో ఇద్దరు మరణించారు. ఒకరికి తీవ్రగాయాలు కాగా దవాఖానకు తరలించారు. ఈ ఘటన సోమవారం క్యాంపస్‌లోని ప్రైడ్ రాక్ రెసిడెన్షియల్ హాల్ వద్ద చోటుచేసుకుంది. ఘటన జరిగిన వెంటనే స్పందించిన యూనివర్సిటీ యాజమాన్యం ప్రైడ్ రాక్ రెసిడెన్షియల్ హాల్ వద్ద, దాని పరిసర ప్రాంతాల్లో రాకపోకలను నిలిపివేసింది. తాత్కాలికంగా తరగతులను కూడా రద్దు చేసింది. కాల్పుల ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. అయితే కాల్పులు జరిపిన వ్యక్తి ఎవరన్న విషయం ఇంకా తెలియరాలేదు. 2018 లెక్కల ప్రకారం అమెరికాలోని కాలేజీలు, యూనివర్సిటీల్లో భారత్‌కు చెందిన 1,83,312 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో దాదాపు 1,607 మంది విద్యార్థులు టెక్సాస్‌లోని ఏ అండ్ ఎం యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్నారు.

## 8న కార్టూన్ ఫెస్టివల్

- నమస్తే తెలంగాణ కార్టూనిస్ట్ మృత్యుంజయ్‌కు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు



కార్టూనిస్ట్ మృత్యుంజయ్

**హైదరాబాద్:** కార్టూన్ ఫెస్టివల్-2020ని ఈ నెల ఎనిమిదిన హైదరాబాద్‌లోని ద పార్క్ హోటల్‌లో నిర్వహించనున్నట్టు కార్టూన్‌వాచ్ మంత్లీ ఎడిటర్ త్రయంబక్ శర్మ తెలిపారు. 'కార్టూన్ వాచ్' 24 ఏండ్లుగా కార్టూన్లు మాత్రమే పబ్లిష్ అయ్యే మాగజైన్‌గా నిలిచిందని చెప్పారు. గతంలో కార్టూన్ ఫెస్టివల్‌ను ఢిల్లీ, ముంబై, రాయ్‌పూర్, పుణె, చెన్నైలో నిర్వహించామని, ఈ ఏడాది హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఫెస్టివల్‌లో 2019 సంవత్సరానికిగాను లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులను సీనియర్ కార్టూనిస్ట్ దివంగత మోహన్, సీనియర్ కార్టూనిస్టులు జయదేవ్ బాబు, ఎంఎస్ రామకృష్ణకు ఇవ్వనున్నట్టు తెలిపారు. 2020కి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును నమస్తే తెలంగాణ కార్టూనిస్ట్ మృత్యుంజయ్, సాక్షి కార్టూనిస్ట్ శంకర్, నవతెలంగాణ కార్టూనిస్ట్ నర్సింకు ప్రదానం చేయనున్నట్టు వెల్లడించారు. కార్టూన్ ఫెస్టివల్‌కు ఐఏఎస్, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఎండీ భిజేంద్రకుమార్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, భాషా, సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, తెలంగాణ టుడే ఎడిటర్ కే శ్రీనివాస్‌రెడ్డి, నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, సాక్షి ఎడిటర్ మురళి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

## మూడో టీఎంసీపై కసరత్తు

కాళేశ్వరం లింక్-1లో ఇప్పటికే కొనసాగుతున్న పనులు
లింక్-2 పనుల కోసం త్వరలో టెండర్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో గోదావరిజలాల ప్రవాహమార్గాన్ని మార్చి లక్షల ఎకరాలకు సాగునీటి భరోసా కల్పిస్తున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో మూడో టీఎంసీ మళ్లింపుపై కసరత్తు కొనసాగుతున్నది. ముందుచూపుతో లింక్-1లో గతంలోనే సివిల్ పనులు పూర్తిచేసిన ప్రభుత్వం.. ప్రస్తుతం మోటర్ల బిగింపు పనులను వేగవంతం చేసింది. ఎల్లంపల్లి నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయానికి మూడో టీఎంసీ తరలింపు పనులకు త్వరలో టెండర్లు పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నెలలోనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి.. మార్చిలో సీఎం కేసీఆర్‌తో పనులకు శంకుస్థాపన చేయించాలని యోచిస్తున్నట్టు సమాచారం. కాళేశ్వరం ద్వారా రోజుకు మూడు టీఎంసీల గోదావరిజలాలను మళ్లించాలని ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది. ఈ మేరకు లక్ష్మీబరాజ్ నుంచి ఎల్లంపల్లి జలాశయం వరకు రెండు టీఎంసీల తరలింపు పనులు చేపట్టిన సమయంలోనే ముందుచూపుతో మూడోటీఎంసీ తరలింపునకు సంబంధించిన సివిల్ పనులు కూడా పూర్తిచేసింది. ఇక్కడ మోటర్లబిగింపు పనులు మాత్రమే మిగిలిఉన్నాయి. లక్ష్మీ, సరస్వతి, పార్వతీ పంపుహౌజ్‌లలో ఈ పనుల ప్రక్రియకూడా ముమ్మరంగా కొనసాగుతున్నది. ఎల్లంపల్లి నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయం వరకు పనులు కూడా చేపట్టాలని సీఎం కేసీఆర్ గతంలోనే ఆదేశించారు. దీంతో నీటిపారుదలశాఖ అధికారులు ఆ ప్రక్రియలో నిమగ్నమయ్యారు.

**4-6 ప్యాకేజీలతో పనులు**

ఎల్లంపల్లి నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయం వరకు అదనపు టీఎంసీ తరలింపు పనులకు రూ.11,806 కోట్ల అంచనా వ్యయం అవుతుందని అధికారులు గతంలోనే ప్రతిపాదించగా.. ప్రభుత్వం అనుమతిఇచ్చింది. తాజాగా ఈ పనులకు టెండర్లు పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. 4 నుంచి 6 ప్యాకేజీలతో టెండర్లు పిలువాలని భావిస్తున్నారు. అయితే ఎన్ని ప్యాకేజీలు అనేది రెండు, మూడ్రోజుల్లో నిర్ధారణ అయ్యే అవకాశమున్నది. కాగా, ఎల్లంపల్లి నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయానికి రెండుదశల్లో నీటిని ఎత్తిపోయనున్నారు. కోటిలింగాల సమీపంలో మొదటి, తెగడపల్లి మండల పరిధిలో రెండో పంపుహౌజ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందులోభాగంగా మార్గమధ్యంలో గీకొండ చెరువును కూడా వినియోగించుకొంటారు. ప్రస్తుతం ఈ చెరువు నీటినిల్వ సామర్థ్యం సుమారు 0.04 టీఎంసీలు ఉండగా.. ఆ సామర్థ్యాన్ని అలాగే ఉంచి సిస్టర్న్ (చిన్న రిజర్వాయర్) మాదిరిగా వినియోగిస్తారు. సీఎం శంకుస్థాపన కార్యక్రమాన్ని శ్రీరాజరాజేశ్వర జలాశయం వద్ద చేయాలా? లేక మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలా? అనే అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

## తెలంగాణ బిడ్డకు అరుదైన ఆహ్వానం



మాధురి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బ్యాంకులో ఉన్నతాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. చిత్రలేఖనంలో ప్రతిభ కనబరుస్తున్న తెలంగాణ ఎన్నారై మహిళకు అరుదైన గౌరవం దక్కింది. డిస్కవర్ ద వరల్డ్ థీమ్ పేరుతో అమెరికాలో మార్చి ఆరు నుంచి ఎనిమిది వరకు నిర్వహించే 34వ ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ ర్యాలే (యూఎస్‌ఏ)లో పాల్గొనాల్సిందిగా తెలంగాణ ఎన్నారై మాధురి శ్రీకాంత్‌కు ఆహ్వానం అందింది. సుమారు 65 దేశాల నుంచి చేయితిరిగిన చిత్రకారులు పాల్గొనే ఈ ఉత్సవాల్లో.. చిత్రలేఖనం విభాగంలో మాధురికి మాత్రమే ఈ అవకాశం దక్కింది. నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు పిల్లల తల్లి అయిన మాధురి ట్రస్ట్‌బ్యాంక్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మాధురి పోర్ట్రెయిట్స్, మురల్స్, శాండ్ ఆర్ట్స్, తంజాపూర్ తదితర ఆరు రకాల చిత్రాలను వేయగలరు.

## ఫేస్‌బుక్‌లో అనుష్క ఫొటోతో గాలం

రూ. లక్ష కాజేసిన సైబర్ నేరగాడు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** సినీనటి అనుష్క ఫొటోను ఫేస్‌బుక్ ప్రొఫైల్ పిక్చర్‌గా పెట్టుకొని ఓ సైబర్ నేరగాడు రూ.1.1 లక్షలు కాజేశాడు. అశోక్‌నగర్‌కు చెందిన ఓ యువకుడికి ఆరునెలల క్రితం ఓ సైబర్‌నేరగాడు ఫేస్‌బుక్‌లో సినీనటి అనుష్క ప్రొఫైల్ పిక్‌తో ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపాడు. యువకుడు యాక్సెప్ట్ చేయడంతో సైబర్‌నేరగాడు ఆరునెలలపాటు యువతి పేరుతో చాటింగ్ చేశాడు. అనంతరం తాను తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నానని చెప్పడంతో యువకుడు పలుదఫాల్లో 1.1 లక్షలు పేటీఎం ద్వారా బదిలీ చేశాడు. అనంతరం తాను మోసపోయానని పోలీసులకు ఫిర్యాదుచేశాడు.

## 14 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తిరుపతిలోని శ్రీనివాస మంగాపురంలో ఈ నెల 14 నుంచి 22 వరకు కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 14న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యే ఉత్సవాలు 22న జరిగే ధ్వజావరోహణంతో ముగియనున్నాయి.

**శ్రీవారి హుండీకి రూ. 3.65 కోట్ల ఆదాయం**

సోమవారం నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు తిరుమల శ్రీవారికి రూ.3.65 కోట్లు భక్తులు కానుకగా సమర్పించారని టీటీడీ వెల్లడించింది.

## ఎల్బీనగర్‌లో దవాఖాన ఎండీ ఆత్మహత్య



అజయ్‌కుమార్ (ఫైల్)

**మన్సూరాబాద్:** హైదరాబాద్ ఎల్బీ నగర్‌లోని వైష్ణవి దవాఖాన మేనేజింగ్ డైరెక్టర్ అజయ్‌కుమార్ (38) ఆత్మహత్య చేసుకున్నారు. సోమవారం రాత్రి దవాఖాన సెల్లార్‌లోని తన ఆఫీసులో బలవన్మరణానికి పాల్పడ్డారు. మంగళవారం ఉదయం ఎంతకూ బయటకు రాకపోవడంతో సిబ్బంది గమనిం చి బలవంతంగా తలుపులు తెరిచి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. 'నేను ఎప్పుడు చనిపోయినా నా చావుకు కారకులు వీరే' అంటూ డైరీలో రాసుకొన్న సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని ఏడుగురిపై కేసు నమోదుచేశారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం ఏటిగడ్డ శాఖాపురం గ్రామానికి చెందిన అజయ్‌కుమార్ రూ.10 లక్షలు చెల్లించి ఓ ప్రైవేటు భవనంలో దవాఖానను నెలకొల్పారు. పెద్ద మొత్తంలో డబ్బు వెచ్చించి స్థాపించిన దవాఖానను ఖాళీచేయాలని భవన యజమాని, ఆయన స్నేహితులు వేధిస్తుండటంతో మనోవేదనకు గురై తన ఆత్మహత్యచేసుకున్నట్టు మృతుడి భార్య శ్వేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కరోనాపై అప్రమత్తంగా ప్రభుత్వం

- గాంధీలో వైరస్ నిర్ధారణ, చికిత్సకు ఏర్పాట్లు
- 21 మంది అనుమానితుల పరీక్షల్లో నెగెటివ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/బన్సీలాల్‌పేట్:** ప్రపంచాన్ని భయాందోళనకు గురిచేస్తున్న కరోనా వైరస్ పాజిటివ్ కేసులు ఇప్పటివరకు రాష్ట్రంలో నమోదుకాలేదు. మంగళవారంనాటికి రాష్ట్రంలో 23 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, 21 మందికి వైరస్ లక్షణాలు లేవని తేలింది. మరో ఇద్దరి పరీక్షల నివేదికలు రావాల్సి ఉన్నది. ఈ వైరస్‌పై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తున్నది. గాంధీ, ఫీవర్, ఛాతి దవాఖానల్లో ప్రత్యేకవార్డుల ఏర్పాటుతోపాటు, అనుమానితులకు గాంధీ దవాఖానలో నిర్ధారణ పరీక్షలను నిర్వహిస్తున్నారు. మంగళవారం రాష్ట్రస్థాయి వైద్యాధికారులతో కేంద్ర వైద్యవిభాగం అధికారులు వీడియోకాన్ఫరెన్సు నిర్వహించి సూచనలు చేశారు.

**గాంధీలో ఉన్నతస్థాయి సమీక్ష**

కరోనాకు చికిత్స, వైరస్ నిర్ధారణ పరీక్షలపై మంగళవారం గాంధీ దవాఖానాలో వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి శాంతకుమారి, కమిషనర్ యోగితా రాణా, డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, డీఎంఈ కే రమేశ్‌రెడ్డి, గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ పీ శ్రావణ్‌కుమార్, పలువిభాగాల అధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఏడో అంతస్తులోని కరోనా వార్డులను, రెండో అంతస్తులోని ప్రత్యేకవార్డులను సందర్శించారు.

## మేయర్లకు నేడు శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లకు బుధవారం హరితప్లాజాలో శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్లకు శిక్షణ ఉంటుందని, నిధుల వినియోగం, నిధుల సమకూర్పు తదితర అంశాలను వివరిస్తామని పేర్కొన్నారు.

## బుక్‌లెట్‌లో నీట్ సమాచారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ**: నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్‌టెస్ట్ (నీట్)కు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని త్వరలో బుక్‌లెట్ రూపంలో విడుదల చేస్తామని ఫోరమ్ ఫర్ నీట్ కన్వీనర్ కే లలిత్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 70 పేజీలున్న ఈ బుక్‌లెట్‌లో నీట్ కటాఫ్ మార్కులు, రిజర్వేషన్లవారిగా కళాశాలల్లో సీట్ల కేటాయింపు తదితర వివరాలు ఉంటాయని చెప్పారు. శిక్షణ సంస్థల ఫైనల్ ప్రిపరేషన్ వ్యాసాలు కూడా పొందుపరుస్తామన్నారు. బుక్‌లెట్‌ను వాట్సాప్ ద్వారా ఉచితంగా పంపిణీచేస్తామని చెప్పారు.

## చేపల వ్యాపారి కిడ్నాప్.. హత్య



రమేశ్ (ఫైల్)

**హైదరాబాద్ సిటీబ్యూరో/ బంజారాహిల్స్/ వెంగళ్‌రావునగర్:** చేపలవ్యాపారిని గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్‌చేసి హత్యచేసిన ఘటన ఎర్రగడ్డలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగడ్డ ఏజీ కాలనీకి చెందిన చేపల వ్యాపారి రమేశ్ (55) ఈనెల 1న ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. రమేశ్ మా వద్దే ఉన్నాడు, రూ.90 లక్షలు ఇస్తే వదిలేస్తామంటూ ఆయన కుటుంబసభ్యుల ఫోన్లకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి మెసేజ్‌లు వచ్చాయి. దీంతో కిడ్నాప్ జరిగినట్టు నిర్ధారించుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి జూబ్లీహిల్స్ జవహర్‌నగర్‌లోని ఓ ఇంట్లో సంచిలో మూటకట్టి ఉన్న మృతదేహం రమేశ్‌దిగా గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు పథకం ప్రకారం రమేశ్‌ను కిడ్నాప్‌చేసి హతమార్చినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

## సీఏ పరీక్ష ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ సత్తా

**హైదరాబాద్:** ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా సోమవారం విడుదలచేసిన సీఏ ఫలితాల్లో మొదటి 50 ర్యాంకుల్లో 18 ర్యాంకులను తమ విద్యాసంస్థ విద్యార్థులు సాధించారని మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వయిజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. బీ ఈరేశ్ (ఆలిండియా 28 ర్యాంకు), సీహెచ్ అనురాధ (34వ ర్యాంకు), ఆర్ తనయ్‌నాయుడు (38వ ర్యాంకు), ఆర్ అనూష (40వ ర్యాంకు), షేక్ ఇస్మాయిల్ (41వ ర్యాంకు), కొల్లా వెంకటసాయి, పీ ప్రవంత్ (43వ ర్యాంకు), టీ హరికృష్ణ, పీ ప్రణతిరెడ్డి ((45వ ర్యాంకు), దేవరపల్లి వినయ్, జీ విశ్వనాథ్ (49వ ర్యాంకు), జే రెడ్డిభవాని, కే హరిప్రియ, కే హర్షవర్ధిని, ఎం త్రివేణి, బీ గంగాధర్‌రెడ్డి (50వ ర్యాంకు) కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు.

## వచ్చేఏడాది నైనీలో బొగ్గుఉత్పత్తి

అన్నిప్రాంతాల జీఎంలతో సమీక్షలో సింగరేణి సీఎండీ శ్రీధర్ వెల్లడి

**హైదరాబాద్/మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** వచ్చేఏడాది మార్చిలో ఒడిశాలోని నైనీ బ్లాకు నుంచి ఐదు లక్షల టన్నుల బొగ్గుతో ఉత్పత్తిని ప్రారంభించాలని, ఇందుకు వివిధ స్థాయిల్లో ఉన్న అనుమతుల పనుల్లో వేగం పెంచాలని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో మంగళవారం అన్ని ప్రాంతాల జీఎంలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణి ప్రాంత గనులతోపాటు ఒడిశాలో సింగరేణి సంస్థకు కేటాయించిన నైనీ, న్యూపాత్రపాద బొగ్గు బ్లాకుల నుంచి బొగ్గు ఉత్పత్తికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. నైనీబ్లాకు గని వరకు రైల్వేలైను నిర్మించేందుకు ఈ ప్రాంతంలోని ఇతర కోల్‌ఇండియా కంపెనీలతో కలిసి జాయింట్‌వెంచర్‌గా సింగరేణి ఏర్పడనున్నట్టు సీఎండీ తెలిపారు.

**ఎగ్జిబిషన్‌లో సింగరేణి బృందం**

దక్షిణాఫ్రికా రాజధాని కేప్‌టౌన్‌లో ఈ నెల మూడున మొదలైన ఆరు వరకు జరిగే అతి పెద్ద మైనింగ్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఇండస్ట్రీస్ సదస్సులో సింగరేణి అధికారుల బృందం పాల్గొన్నది.

## రాజధాని ఏర్పాటుపై రాష్ట్రాలకే అధికారం

ఏపీ రాజధానిపై కేంద్రం ప్రకటన

**అమరావతి:** రాజధాని ఏర్పాటుపై రాష్ట్రాలకే అధికారం ఉంటుందని కేంద్రప్రభుత్వం స్పష్టంచేసింది. లోక్‌సభలో మంగళవారం టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ అడిగిన ప్రశ్నకు కేంద్రహోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ ఈ మేరకు లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు.

## స్టేట్ సెక్యూరిటీ కమిషన్ నియామకంపై విధివిధానాలు ఖరారు చేయండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర భద్రతా కమిషన్ (స్టేట్ సెక్యూరిటీ కమిషన్) ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేయాలని రాష్ట్రప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. కమిషన్ ఏర్పాటుపై విధివిధానాలు లేకుండా చైర్మన్ పదవికి రిటైర్డ్ హైకోర్టు జడ్జి పేరును సూచించడం సబబుగా ఉండదని హైకోర్టు పేర్కొన్నది. చీఫ్‌జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం.. కమిషన్ విధివిధానాలు ఖరారు కాకుండా జడ్జి పేరును సూచించలేమని తెలిపిన ధర్మాసనం.. మొదట కమిషన్ విధివిధానాలను ఖరారు చేయాలని స్పష్టంచేసింది. ఈ మేరకు విచారణను వచ్చేనెలకు వాయిదా వేసింది.

## భూవివాదంపై మైనార్టీ కమిషన్ విచారణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిజామాబాద్ జిల్లా కంటేశ్వర్ గ్రామానికి సంబంధించి పార్శి ఆరాంఘర్ గ్రేవ్‌యార్డ్ భూ వివాదంపై మైనార్టీ కమిషన్ చైర్మన్ మహమ్మద్ కమ్రుద్దీన్ మంగళవారం కమిషన్ కార్యాలయంలో బహిరంగ విచారణ చేపట్టారు. విచారణకు కమిషన్ సభ్యుడు గుస్తీ నోరియా, సలహాదారులు పీ పన్నగసాయి, ఫరూఖ్ అలీఖాన్, ఎంఏ ఖదీర్ సిద్దిఖీ, నిజామాబాద్ జిల్లా మైనార్టీ అధికారి రతన్, ఆర్డీవో, తాసిల్దార్, ఫిర్యాదుదారులు హాజరయ్యారు. అసలు పట్టేదారు అయిన ఫిరోజ్జా పేరు నుంచి తార్ల సాయన్న, ఇతరుల పేరిట భూమి మారిందని పిటిషనర్ ఓమిమ్ డెబారా తెలిపారు. విచారణ అనంతరం కేసును 29కి వాయిదా వేస్తున్నట్టు కమ్రుద్దీన్ ప్రకటించారు.

## దుశ్శాసనుల పార్టీ బీజేపీ: మమత



**బోంగావ్/ రణఘాట్:** బీజేపీ దుశ్శాసనుల పార్టీ అని, తుగ్లక్ విధానాలను అమలు చేస్తున్నదని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు. సీఏఏకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వారిపై దేశద్రోహులుగా ముద్ర వేయడాన్ని ఆమె ఖండించారు. ఢిల్లీలోని షాహీన్‌బాగ్ తదితర ప్రాంతాల్లో శాంతియుత నిరసనలు తెలుపుతున్న వారిపై కాల్పులు జరిపి, నిరసనకారులను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని కేంద్రంపై మండిపడ్డారు. మంగళవారం రాష్ట్రంలో జరిగిన సీఏఏ-ఎన్నార్సీ వ్యతిరేకంగా జరిగిన సభల్లో ఆమె మాట్లాడుతూ బలవంతంగా సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీ అమలుకు కేంద్రం పూనుకుంటున్నదని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ రాష్ట్రంలో వీటిని అమలు చేయబోనన్నారు.

## బెంగాల్‌లో శిఖండి పాలన: బీజేపీ



**న్యూఢిల్లీ:** పశ్చిమబెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతాబెనర్జీ 'శిఖండి'లా వ్యవహరిస్తున్నారని బీజేపీ ఎంపీ, ఆ పార్టీ బెంగాల్ శాఖ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో మంగళవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ బెంగాల్‌కు ప్రధాని మోదీ వచ్చినప్పుడు 'గో బ్యాక్' బ్యానర్లు వెలుస్తాయని, కానీ పొరుగు దేశాల నుంచి రోహింగ్యా ముస్లింలు వచ్చినప్పుడు స్వాగతం పలుకుతారని, వారిని ఓటు బ్యాంకుగా పరిగణించడమేనని దీనికి కారణమన్నారు. 'దురదృష్టవశాత్తు అక్కడ (బెంగాల్)లో 'శిఖండి'లు అధికారంలో ఉండటంతో పోలీసులు ఏమీ చేయలేకపోతున్నారు. దీన్ని వ్యతిరేకిస్తున్న నన్ను అప్రతిష్ఠ పాల్జేశారు' అని ఆరోపించారు.

## చీఫ్ జస్టిస్‌దే తుది నిర్ణయం

### కేసుల విచారణ ప్రత్యక్ష ప్రసారంపై సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** జాతి, రాజ్యాంగ ప్రాధాన్యం గల కేసుల విచారణను ప్రత్యక్ష ప్రసారం చేయడంపై చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా (సీజేఐ)దే తుది నిర్ణయం అని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ విషయమై 2018 సెప్టెంబర్ 26న సర్వోన్నత ధర్మాసనం తీర్పు చెప్పిన సంగతి తెలిసిందే. ఈ తీర్పును అమలు చేయాలని కోరుతూ ఇందిరా జైసింగ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్‌లు అరుణ్ మిశ్రా, వినీత్ శరణ్, ఎంఆర్ షాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. దీనిపై తాము ఎటువంటి ఆదేశాలు జారీ చేయబోమని, సుప్రీంకోర్టు అధిపతిగా దీనిపై సీజేఐ నిర్ణయం తీసుకోవడమే సరైందని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

## త్రివిధ దళాల్లో ప్రత్యేక కమాండ్‌లు!

### సీడీఎస్ జనరల్ బిపిన్ రావత్ ప్రతిపాదన



జనరల్ బిపిన్ రావత్, నరవణె, కరమ్‌బీర్‌సింగ్

**న్యూఢిల్లీ:** దేశ గగనతలం, సముద్ర జలాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయడానికి రక్షణ దళాల అధిపతి (సీడీఎస్) జనరల్ బిపిన్ రావత్ కొన్ని ప్రతిపాదనలు చేశారు. గగనతలంలో అన్ని ఏరియల్ ఆపరేషన్లను పర్యవేక్షించేందుకు 'గగనతల భద్రత కమాండ్(ఎయిర్ డిఫెన్స్ కమాండ్)'ను, హిందూ మహా సముద్ర జలాల్లో జరిగే అన్ని రకాల నౌకాదళ ఆపరేషన్లను పర్యవేక్షించేందుకు 'ద్వీపకల్ప కమాండ్(పెనిన్సుల కమాండ్)'ను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. అలాగే సైన్యంలో 'లాజిస్టిక్స్ కమాండ్' అవసరం కూడా ఉన్నదని బిపిన్ రావత్ తెలిపారు.



# ఒకరినొకరు వాడుకున్నారు

- ఇది క్విడ్‌ప్రోకో కేసు
- చిన్మయానంద, న్యాయ విద్యార్థి కేసుపై అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్య



చిన్మయానంద, బాధిత విద్యార్థిని (ఫైల్)

**అలహాబాద్:** కేంద్ర మాజీమంత్రి, బీజేపీ నేత స్వామి చిన్మయానంద, న్యాయ విద్యార్థిని కేసు క్విడ్‌ప్రోకో (స్వార్థ ప్రయోజనాల కోసం పరస్పరం సహకరించుకోవడం) కిందకు వస్తుందని ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ హైకోర్టు తెలిపింది. వారిద్దరు ఒకరినొకరు వాడుకున్నారని, అయితే ఎవరు ఎవరిని దోపిడీ చేశారన్నది చెప్పలేమని పేర్కొంది. చిన్మయానందకు సోమవారం బెయిల్ మంజూరు సందర్భంగా జస్టిస్ రాహుల్ చతుర్వేది కీలక వ్యాఖ్యలు చేశారు. 'విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులు చిన్మయానంద ప్రాపకాన్ని వినియోగించుకున్నారు. ఆయన నుంచి లబ్ధిపొందారు. ఇద్దరూ తమ పరిధులను అతిక్రమించారన్న సంగతి గతంలోనే చెప్పాం. అయితే ఎవరు ఎవరిని వినియోగించుకున్నారన్నది ప్రస్తుతం చెప్పడం కష్టం. వాస్తవానికి ఇద్దరూ ఒకరినొకరు వాడుకున్నారు. చిన్మయానంద తనపై లైంగికదాడికి పాల్పడినట్లు విద్యార్థిని ఆరోపించిన కాలంలో ఆమె లేదా ఆమె తల్లిదండ్రులు ఆయనపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నది రికార్డుల ద్వారా తెలుస్తున్నది. అనంతర కాలంలో మరింత ఎక్కువ పొందాలన్న ఆశతో రహస్యంగా చిత్రీకరించిన వీడియోలతో ఆయనను బ్లాక్‌మెయిల్ చేసేందుకు ఆమె ప్రయత్నించినట్లు కోర్టు గమనించింది. ఈ పరిస్థితుల్లో ఈ అంశం పూర్తిగా క్విడ్ ప్రో కో కిందకు వస్తుందని కోర్టు నిర్ధారణకు వచ్చింది' అని జడ్జి పేర్కొన్నారు.

## ఐఎంఏ స్కాంలో ఇద్దరు ఐపీఎస్‌లపై సీబీఐ కేసు

**న్యూఢిల్లీ:** కర్ణాటక క్యాడర్‌కు చెందిన ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులపై సీబీఐ కేసు నమోదు చేసింది. రూ.నాలుగు వేల కోట్ల మేర మోసం జరిగిన ఐ-మానిటరీ అడ్వయిజరీ (ఐఎంఏ) కుంభకోణంతో ఐపీఎస్ అధికారులు హేమంత్ నింబాల్కర్, అజయ్ హిళోరికి సంబంధమున్నట్టు గుర్తించింది. వీరిద్దరితోపాటు ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఎస్ఐ గౌరీశంకర్, సీఐడీ-ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) డిప్యూటీ ఎస్పీ ఈబీ శ్రీధర, ఐఎంఏ వ్యవస్థాపకుడు మన్సూర్‌ఖాన్, మరో ముగ్గురు సంస్థ డైరెక్టర్లపై సీబీఐ కేసులు నమోదు చేసింది.

## మోదీ ఎందుకు భయపడుతున్నారు: ఒవైసీ



**న్యూఢిల్లీ:** ప్రధాని మోదీ ముస్లిం మహిళలకు తనను తాను సోదరుడినని చెప్పుకుంటారని, ఇప్పుడు వారిని చూసి ఆయన ఎందుకు భయపడుతున్నారని మజ్లిస్ పార్టీ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. ఢిల్లీలోని షాహీన్‌బాగ్‌లో జరుగుతున్న సీఏఏ వ్యతిరేక ఆందోళనలను ప్రధాని విమర్శించిన నేపథ్యంలో ఒవైసీ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే చర్చలో ఆయన పాల్గొంటూ, ఎన్పీఆర్‌కు ఎన్నార్సీతో సంబంధం లేదని, దేశంలో ఎన్నార్సీని అమలు చేయబోమని ప్రధాని మోదీ సభలో స్పష్టం చేయాలని సవాలు చేశారు. పార్లమెంట్ చరిత్రలో మొదటిసారిగా ఓ బిల్లు (సీఏఏ) మతం ప్రాతిపదికన ఆమోదం పొందిందన్నారు. తాము అస్తిత్వం కోసం పోరాడే పరిస్థితిని బీజేపీ ప్రభుత్వం కల్పించిందని, ఒకవేళ తాము ఓడిపోతే తమను తుడిచివేస్తారన్నారు.

# నయా ఢిల్లీ!

దేశ రాజధానికి కొత్తరూపు

- రూ.12 వేల కోట్ల వ్యయంతో సెంట్రల్ విస్టా ఆధునీకరణ
- 2022నాటికి త్రికోణాకృతిలో కొత్త పార్లమెంట్ భవనం
- 70 వేల మంది ఉద్యోగులు పనిచేసేలా కేంద్ర సచివాలయం






**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** దేశ రాజధాని ఢిల్లీ సరికొత్త రూపు సంతరించుకోనుంది. సుమారు రూ.12,000 కోట్ల వ్యయంతో సెంట్రల్ విస్టాను (రాష్ట్రపతి భవన్ నుంచి ఇండియా గేట్ వరకు) ఆధునీకీకరించేందుకు మోదీ సర్కారు బృహత్తర ప్రణాళికను సిద్ధం చేసింది. 2024 ఆగస్టు నాటికి ఆధునికీకరణను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నది. అలాగే పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా నూతన పార్లమెంట్, కేంద్ర సచివాలయ (సెంట్రల్ సెక్రటేరియట్) భవనాలను నిర్మించనున్నది. ప్రస్తుతం ఉపయోగిస్తున్న భవనాలు సుమారు వందేండ్లకు పైబడినవి కావడం, నేటి అవసరాలకు తగ్గట్లుగా లేకపోవడంతో కేంద్రం ఈ ప్రాంతాన్ని ఆధునికీకరించాలని నిర్ణయించింది. గుజరాత్‌కు చెందిన 'హెచ్‌సీపీ డిజైన్, ప్లానింగ్, మేనేజ్‌మెంట్' సంస్థ ఈ ప్రాజెక్టును దక్కించుకున్నది. వచ్చే ఏప్రిల్ నాటికి ముసాయిదా ప్రణాళికను సిద్ధం చేయనున్నది. 1931లో దేశ రాజధాని కలకత్తా నుంచి ఢిల్లీకి మారినప్పుడు నాటి బ్రిటిష్ ఆర్కిటెక్ట్ సర్ ఎడ్విన్ ల్యుటియెన్స్, మరో ఆర్కిటెక్ట్ బేకర్‌తో కలిసి రాజధాని భవనాలకు రూపకల్పన చేశారు. పాశ్చాత్య నిర్మాణ శైలికి భారతీయతను జోడించి వీటిని నిర్మించారు. ఇక ఇప్పుడు ప్రముఖ ఆర్కిటెక్ట్ బిమల్ పటేల్.. సెంట్రల్ విస్టా పునరుద్ధరణ ప్రాజెక్టును తలకెత్తుకున్నారు. గతేడాది ఆయనకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రదానం చేసింది.

**ఆధునీకరణ ఇలా..**

ప్రధానమంత్రి కార్యాలయంతోపాటు, రక్షణ, ఆర్థిక, హోం శాఖల కార్యాలయాలున్న నార్త్, సౌత్ బ్లాకులను మ్యూజియంలుగా మార్చనున్నారు. శాస్త్రిభవన్, ఉద్యోగ్ భవన్, నిర్మాణ్ భవన్, క్రిషి భవన్‌ల స్థానంలో అన్ని శాఖలను ఒకేచోటకు చేర్చుతూ కేంద్ర సచివాలయాన్ని నిర్మించనున్నారు. నూతన నిర్మాణాలు ఇండియా గేట్ కంటే తక్కువ ఎత్తులో ఉండనున్నాయి. జాతీయ మ్యూజియాన్ని పాత సచివాలయానికి తరలించనున్నారు. రాష్ట్రపతి భవన్ అలాగే కొనసాగనుంది. ప్రధాని నివాసాన్ని సౌత్ బ్లాక్‌కు దక్షిణంగా, ఉపరాష్ట్రపతి నివాసాన్ని నార్త్ బ్లాక్ ఉత్తరంగా నిర్మించనున్నారు. అప్పట్లో ఢిల్లీ భూకంప ప్రభావ తీవ్రత తక్కువగా ఉన్న జోన్-2లో ఉండగా, నేడు భూకంప తీవ్రత ఎక్కువగా ఉన్న జోన్-4కు చేరింది. ఈ నేపథ్యంలో భూకంపాలను తట్టుకునేలా నూతన భవనాలను నిర్మించనున్నారు.

**2024నాటికి కేంద్ర సచివాలయం..**

ప్రభుత్వ శాఖల మధ్య మరింత సమన్వయాన్ని ఏర్పరిచేందుకు కేంద్ర సచివాలయం ద్వారా అన్నింటినీ ఒకేచోటకు తీసుకురానున్నారు. సుమారు 70 వేల మంది ఉద్యోగులు పనిచేసే విధంగా సెంట్రల్ విస్టాకు ఇరువైపులా పది భారీ భవనాలను (ఒక్కోటి ఎనిమిది అంతస్తులు) నిర్మించనున్నారు. 2024నాటికి ఇది అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం వివిధ కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. వీటిని సొంత భవనాల్లోకి తరలించడం ద్వారా ఏటా రూ.వెయ్యి కోట్ల వరకు ఆదా అవుతుందని అంచనా. ప్రధాని మోదీ గుజరాత్ సీఎంగా ఉన్న సమయంలో ప్రభుత్వ శాఖలన్నీ ఒకేచోట ఉండేలా 2011లో గాంధీనగర్‌లో సెంట్రల్ సెక్రటేరియట్‌ను నిర్మించారు. దీనిని కూడా బిమల్ పటేల్‌కు చెందిన హెచ్‌సీపీ డిజైన్ సంస్థే నిర్మించినది.

### త్రికోణాకృతిలో పార్లమెంట్

**2022లో** దేశం 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకునే సమయానికి కొత్త పార్లమెంట్‌ను నిర్మించాలని మోదీ ప్రభుత్వం సంకల్పించింది. ప్రస్తుత పార్లమెంట్ భవనం పెరిగిన అవసరాలకు తగ్గట్లు లేకపోవడంతో నూతన భవనాన్ని నిర్మించాలని నిర్ణయించింది. ప్రస్తుత పార్లమెంట్ భవనం పక్కనే త్రికోణాకృతిలో కొత్త భవనాన్ని నిర్మించనున్నారు. లోక్‌సభలో 900 మంది, రాజ్యసభలో 450 మంది కూర్చొనేలా దీన్ని తీర్చిదిద్దనున్నారు. లోక్‌సభనే ఉభయ సభల సమావేశాలకు కూడా ఉపయోగించనున్నారు. నూతన భవనంలో ఎంపీలందరికీ కార్యాలయాలు ఉండనున్నాయి.

> ఇప్పుడున్న భవనాలు 1911-1927 మధ్య నిర్మించినవి. 1947లో అవి మన అధీనంలోకి వచ్చాయి. అయితే అవన్నీ 100 ఏండ్లకు పైబడినవి. అవి ఇప్పుడు బలంగా లేవు. కొన్ని భవనాలు ఢిల్లీ భూకంప ప్రభావ తీవ్రతను తట్టుకునే విధంగా లేవు
>
> -కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి

## బుజ్జగింపుల సర్కారొద్దు



- ఢిల్లీ ఓటర్లకు ప్రధాని మోదీ సూచన

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో బుజ్జగింపులకు ప్రయత్నించే ప్రభుత్వం అవసరం లేదని, పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ), ఆర్టికల్ 370 రద్దు, జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలకు మద్దతు తెలిపే ప్రభుత్వం కావాలని ప్రధాని మోదీ తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని ద్వారకాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ 'శత్రువులు మనపై దాడి చేయడానికి అవకాశం కల్పించే ప్రభుత్వం అక్కరలేదు. బుజ్జగింపులకు ప్రయత్నించే ప్రభుత్వం అవసరం లేదు. ఎవరైతే మన భద్రతా బలగాలను కించపరుస్తున్నారో అలాంటి వారికి ఓటుతో బుద్ధి చెప్పాలి' అని పేర్కొన్నారు. కేజ్రీవాల్ ప్రభుత్వం విద్వేష రాజకీయాలు చేస్తున్నదని, ఈ విషయం ఢిల్లీ వాసులందరికీ తెలుసునని పేర్కొన్నారు. కాబట్టి ఆప్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు.

## 'వీడియో గేమ్' కేంద్రంలో సాయుధుల కాల్పులు

### తొమ్మిది మంది మృతి.. మెక్సికోలో ఘటన

**మెక్సికో సిటీ:** మెక్సికోలోని మికో ఆకెన్ రాష్ట్రం ఉర్వాపన్ నగరంలో దారుణం జరిగింది. నగరంలోని ఓ 'వీడియో గేమ్' కేంద్రంలో సోమవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత నలుగురు సాయుధులు చొరబడి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు బాలలతోపాటు తొమ్మిది మంది మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఆగంతకులు వాస్తవానికి తమ ప్రత్యర్థుల కోసం వచ్చి.. ఆ క్రమంలో విచక్షణారహితంగా కాల్పులు జరిపారన్నారు. శుక్రవారం మున్సిపల్ పోలీసు పెట్రోలింగ్ బృందంపై కాల్పులు జరిగిన చోటే సోమవారం ఘటన జరిగింది. ఈ ప్రాంతంలో డ్రగ్స్ ముఠాల మధ్య ఘర్షణలు నిత్యకృత్యం.

# ఆప్‌కే మళ్లీ అధికారం!

- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 54-60 సీట్లు గెలిచే అవకాశం
- మోదీకి తగ్గని ప్రజాదరణ.. టైమ్స్‌నౌ-ఐపీఎస్‌ఓఎస్ సర్వేలో వెల్లడి



ఆప్ మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, సిసోడియా, గోపాల్‌రాయ్

**న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మరోసారి ఢిల్లీ పీఠం కైవసం చేసుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నెల 8న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీవాసులు ఆప్‌కు మరోసారి అధికారం కట్టబెడతారని టైమ్స్‌నౌ-ఐపీఎస్‌ఓఎస్ సర్వే వెల్లడించింది. అయితే ఆ పార్టీకి గతం కన్నా ప్రాబల్యం తగ్గుతుందని, మొత్తం 70 స్థానాల్లో ఈసారి ఆప్ 54-60, బీజేపీ 10-14 స్థానాలు గెలిచే అవకాశమున్నట్లు సర్వే తెలిపింది. 2015లో జరిగిన ఎన్నికల్లో 67 స్థానాల్లో ఆప్ విజయం సాధించగా బీజేపీ 3 సీట్లను దక్కించుకున్నది. కాంగ్రెస్ పరిస్థితి ఈసారి కూడా గతం మాదిరిగానే ఉంటుందని, 0-2 సీట్లు దక్కవచ్చని సర్వే అంచనా వేసింది. సీఎం కేజ్రీవాల్ 52 శాతం ఓట్లను పొందవచ్చని, ఇది గతం కంటే 2.5 శాతం తక్కువని పేర్కొంది. బీజేపీ ఓట్ల వాటా గతం కంటే 1.7 శాతం పెరిగి 34 శాతం ఉండవచ్చని అంచనా వేసింది. మరోవైపు ప్రధాని మోదీకి ఉన్న ప్రజాదరణ ఏమాత్రం తగ్గలేదు. ఇప్పటికిప్పుడు పార్లమెంట్ ఎన్నికలు జరిగితే ప్రధానిగా ఎవరిని ఎన్నుకుంటారని ప్రశ్నించగా 75 శాతం మంది మోదీవైపు మొగ్గుచూపగా, 8% మాత్రమే రాహుల్ పట్ల ఆసక్తి చూపారు. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) పట్ల ప్రతిపక్షాలు తప్పుగా వ్యవహరిస్తున్నాయని 71% మంది ఢిల్లీవాసులు అభిప్రాయపడినట్లు సర్వే పేర్కొంది. షాహీన్‌బాగ్ ప్రాంతంలో రాకపోకలకు వీలులేకుండా నిరసనకారులు నిరోధించడం అన్యాయమని 36 శాతం మంది చెప్పారని, నిరసనకారులకు 25 శాతం మంది మద్దతివ్వగా, 24 శాతం మంది తటస్థంగా ఉన్నారని సర్వే తెలిపింది.

**ఆప్ మ్యానిఫెస్టో విడుదల**

ఢిల్లీలో 24 గంటలపాటు మార్కెట్ల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేశామని ఆప్ తెలిపింది. నిరంతరం విద్యుత్ సరఫరా చేయడంతోపాటు ఢిల్లీవాసులకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, సురక్షిత నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. ఢిల్లీలోని బడుల్లో 'దేశభక్తి పాఠ్య ప్రణాళిక' అమల్లోకి తెస్తామని వాగ్దానం చేసింది. ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, కార్మికశాఖ మంత్రి గోపాల్‌రాయ్ మంగళవారం పార్టీ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఇంటికే రేషన్ సరుకులను సరఫరా చేయడంతోపాటు ఐదేండ్లలో పది లక్షల మంది వృద్ధులకు ఉచిత తీర్థయాత్ర సౌకర్యం కల్పిస్తామని ఆప్ హామీనిచ్చింది. కాగా, ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ సీఎం అభ్యర్థి ఎవరో బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట లోపు చెప్పాలని కేజ్రీవాల్ సవాల్ చేశారు. సీఎం అభ్యర్థి పేరు వెల్లడించడానికి నిరాకరిస్తూ బీజేపీ నేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా.. ఢిల్లీ ప్రజలను తమ పార్టీకి 'బ్లాంక్ చెక్ (విజయం)' ఇవ్వాలని కోరుతున్నారని ఎద్దేవా చేశారు.

## షాహీన్‌బాగ్ కాల్పుల నిందితుడు ఆప్ సభ్యుడు!

- వెల్లడించిన పోలీసులు.. ఖండించిన నిందితుడి కుటుంబం
- ఆప్ ముసుగు తొలిగిందన్న బీజేపీ



ఆప్ ఆఫీసులో కపిల్ అని పేర్కొంటూ పోలీసులు విడుదల చేసిన చిత్రం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఢిల్లీలోని షాహీన్‌బాగ్‌లో పలువురు మహిళలు చేపడుతున్న నిరసన దీక్ష వేదిక వద్ద కాల్పులకు పాల్పడిన నిందితుడు కపిల్ బైసలా ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్)కి చెందినవాడని పోలీసులు మంగళవారం వెల్లడించారు. కపిల్, అతడి తండ్రి గతేడాది ప్రారంభంలో ఆప్‌లో చేరినట్లు డీసీపీ (క్రైమ్ బ్రాంచ్) రాజేశ్ దేవ్ తెలిపారు. కపిల్ మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, దాని నుంచి వాట్సాప్ డేటాతోపాటు కపిల్, అతడి తండ్రి ఆప్‌లో చేరినప్పటి ఫొటోలను రిట్రీవ్ చేసినట్లు చెప్పారు. ఆప్ నేతలతో కపిల్ దిగిన ఫొటోలను కూడా ఈ సందర్భంగా ఆయన విడుదల చేశారు. పోలీసుల ప్రకటన నేపథ్యంలో ఆప్‌పై బీజేపీ విమర్శలు గుప్పించింది. దేశ భద్రతతో ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆటలాడుతున్నారని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా మండిపడ్డారు. నేటితో ఆప్ ముసుగు తొలిగిపోయిందన్నారు. ఢిల్లీ ప్రజలు ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. అయితే పోలీసుల ప్రకటనను కపిల్ బైసలా కుటుంబ సభ్యులు ఖండించారు. కపిల్ చిన్నాన్న ఫతేశ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. కపిల్‌కు గానీ, తమ కుటుంబానికి గానీ ఏ పార్టీతో సంబంధం లేదని చెప్పారు. కపిల్ తండ్రి 2008లో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నుంచి పోటీచేసి ఓడిపోయారని, అప్పటి నుంచి తాము ఏపార్టీలోనూ లేమని పేర్కొన్నారు.

# తండ్రికి కరోనా కాటు.. కొడుకుపై మృత్యువు వేటు!

- చైనాలో కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసిన 'కరోనా' వైరస్.. 426కు చేరిన మృతులు
- చైనీయులకు ఇదివరకు జారీచేసిన వీసాల్ని రద్దు చేసిన భారత్



ఆకలితో అలమటించి మరణించిన యాన్‌చెంగ్

**బీజింగ్:** ప్రాణాంతక 'కరోనా' వైరస్ సృష్టిస్తున్న కల్లోలంతో చైనాలోని కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. 'కరోనా' లక్షణాలు కనిపించడంతో ఓ తండ్రి నిర్బంధ చికిత్స కేంద్రంలోకి వెళ్లగా.. నిస్సహాయ స్థితిలో అతడి కుమారుడు ఆకలితో అలమటించి మృత్యుఒడిలోకి చేరిన హృదయ విదారక ఘటన చైనాలోని హోంగన్ కౌంటీలో చోటుచేసుకున్నది. యాన్ జియోవెన్‌కు యాన్‌చెంగ్ అనే 17 ఏండ్ల కొడుకున్నాడు. పుట్టుకతోనే సెరబ్రల్ పాల్సీ వ్యాధి రావడంతో యాన్‌చెంగ్.. కదలలేడు, మాట్లాడలేడు, తనకు తానుగా తినలేడు, ఏ పని చేసుకోలేడు. కేవలం చక్రాల కుర్చీకే పరిమితమయ్యాడు. ఇదివరకే భార్య చనిపోవడంతో కొడుకును జియోవెన్ అల్లారుముద్దుగా పెంచుతున్నాడు. ఇటీవల జియోవెన్ 'కరోనా' వెలుగు చూసిన వుహాన్‌లో పర్యటించాడు. దీంతో అతన్ని గతనెల 22న అధికారులు నిర్బంధంలోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల్లో అతడికి కరోనా సోకినట్లు నిర్ధారించిన వైద్యులు అతన్ని దవాఖానలోని ఐసోలేషన్ వార్డ్‌లో ఉంచారు. తండ్రికి దూరమైన యాన్‌చెంగ్ ఇంట్లో ఒంటరిగా ఉండాల్సి వచ్చింది. అయితే, కొడుకు పరిస్థితిని వివరిస్తూ, అతనికి ఎవరైనా ఆహారం పెట్టాలని, సాయం చేయాలని అభ్యర్థిస్తూ జియోవెన్ సోషల్‌మీడియాలో ఓ పోస్ట్ పెట్టాడు. తన కుమారుడి ఆకలి తీర్చండంటూ బంధువులు, స్థానికులను అభ్యర్థించాడు. అయితే అప్పటికే చాలా ఆలస్యమైంది. తండ్రి దవాఖానకు వెళ్లినప్పటి నుంచి ఆహారం లేక జనవరి 29నే యాన్‌చెంగ్ కన్నుమూశాడు. యాన్ మృతికి గల కారణాన్ని అధికారులు ఇంకా ధ్రువీకరించినప్పటికీ ఆకలితో అలమటించే అతడు చనిపోయినట్టు స్థానిక మీడియా పేర్కొంది. ఈ ఘటనపై విమర్శలు వెల్లువెత్తడంతో స్థానిక కమ్యూనిస్ట్ పార్టీ సెక్రటరీ, హోంగన్ కౌంటీ మేయర్‌ను ఉన్నతాధికారులు విధుల నుంచి తొలగించారు. మరోవైపు, చైనాలో 'కరోనా' నానాటికీ తీవ్రమవుతున్నది. వైరస్‌తో మరణించిన వారి సంఖ్య సోమవారం నాటికి 426కు చేరింది. సోమవారం ఒక్కరోజే 64 మంది మృత్యువాత పడ్డారు. 20,438 మందికి ఈ వైరస్ సోకినట్టు నిర్ధారణ అయింది.

**జారీ చేసిన వీసాలు రద్దు**

కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు భారత్ మరిన్ని చర్యల్ని తీసుకుంటున్నది. చైనీయులకు, గత రెండు వారాల్లో ఆ దేశంలో పర్యటించిన ఇతర దేశస్థులకు ఇప్పటికే జారీ చేసిన వీసాలను రద్దు చేస్తున్నట్టు మంగళవారం కేంద్రం ప్రకటించింది. మరోవైపు, కరోనా సోకి తమ దేశంలో ఓ వ్యక్తి మరణించాడని హాంకాంగ్ అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, ఢిల్లీ-హాంకాంగ్ మధ్య నడుస్తున్న తమ విమాన సర్వీసుని ఫిబ్రవరి 8 నుంచి రద్దు చేస్తున్నట్టు ఎయిరిండియా ప్రకటించింది.

**టికెట్ రద్దు చేసుకుంటే పైసలు వాపస్..**

టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులు తమ ప్రయాణాన్ని రద్దు చేసుకుంటే టికెట్‌కు అయిన మొత్తాన్ని ఎలాంటి చార్జీలు లేకుండా తిరిగి ఇస్తామని ప్రముఖ విమానయాన సంస్థ గో ఏయిర్ ప్రకటించింది. ఈ ప్రకటన సింగపూర్, బ్యాంకాక్, పుకెట్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులకు వర్తిస్తుందని తెలిపింది. అదేవిధంగా ఫిబ్రవరి 29 లోపు పైన పేర్కొన్న మూడు దేశాల నుంచి భారత్ రావడానికి గో ఏయిర్‌లో టికెట్ బుక్ చేసుకున్న వారికి కూడా వర్తిస్తుందని పేర్కొంది.



వుహాన్‌లో తాత్కాలిక దవాఖానగా మారిన ఓ కన్వెన్షన్ సెంటర్

### వెయ్యి పడకల దవాఖాన ప్రారంభం

కరోనా వైరస్ బాధితుల కోసం చైనాలోని వుహాన్ నగరంలో కేవలం పది రోజుల్లో నిర్మించిన దవాఖాన ప్రారంభమైంది. వైరస్ ప్రభావిత మొదటి బ్యాచ్ రోగులను అధికారులు సోమవారం దవాఖానలోని ప్రత్యేక వార్డుల్లో చేర్చి చికిత్సనందించారు. మంగళవారం మరో విడత రోగుల్ని దవాఖాన వార్డుల్లో చేర్చారు. 1000 పడకల సామర్థ్యం కలిగిన ఈ దవాఖానలో 1,400 మంది వైద్యులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. 6 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ దవాఖానలో 30 ఇంటెన్సివ్ కేర్ యూనిట్లను ఏర్పాటు చేశారు. దవాఖానలోని వైద్యులు బయటి వైద్య నిపుణులతో మాట్లాడేందుకు వీడియో సమాచార వ్యవస్థను కూడా అందుబాటులో ఉంచారు.

# ఎన్నార్సీ ఆలోచనలేదు

మొదటిపేజీ తరువాయి...

ఎన్నార్సీ ప్రక్రియను చొరబాటుదారులతో ప్రభావితమైన ప్రాంతాల్లో 'ప్రాధాన్యాన్ని బట్టి' అమలు చేస్తుందని చెప్పారు. చొరబాటుదారుల కారణంగా దేశ అంతర్గత భద్రతకు ముప్పు వాటిల్లిందని, వారి వల్ల సామాజిక అసమతుల్యత చోటు చేసుకుంటున్నదని, జీవనోపాధి అవకాశాలపై ఒత్తిడి పెరుగుతున్నదని రాష్ట్రపతి ఆ సందర్భంగా చెప్పారు. మరో ప్రశ్నకు మంత్రి నిత్యానంద్ బదులిస్తూ, పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) గత జనవరి 20 నుంచి అమలులోకి వచ్చిందని చెప్పారు. ఈ చట్టం పరిధిలోకి వచ్చేవారు.. సంబంధిత నిబంధనలను ప్రభుత్వం నోటిఫై చేసిన తరువాత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. చట్టం అమలులోకి వచ్చిన తరువాత నిర్బంధ కేంద్రాలలో ఉన్న శరణార్థులను విడుదల చేయాలని కేంద్రం ఎటువంటి ఆదేశాలు చేయలేదని నిత్యానంద్ చెప్పారు.

**ఎన్పీఆర్‌కు ఆధార్ కూడా స్వచ్ఛందమే**

జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) కోసం వివరాలు సేకరించే సమయంలో పౌరుల నుంచి ఎటువంటి పత్రాలు కోరబోమని నిత్యానంద్‌రాయ్ చెప్పారు. ఎన్పీఆర్ కోసం ఆధార్ నంబర్‌ను ఇవ్వాలా వద్దా అన్నది కూడా పౌరులకే వదిలేశామని తెలిపారు. ఎన్పీఆర్‌కు సంబంధించి అనుమానాలున్న రాష్ట్రాలతో కేంద్రం సంప్రదింపులు జరుపుతున్నదని చెప్పారు. ఎన్పీఆర్ ప్రక్రియ సందర్భంగా ప్రతి కుటుంబ, వ్యక్తుల వివరాలను నవీకరిస్తామని, ఇప్పటివరకూ నమోదుకాని వారి వివరాలు సేకరిస్తామని చెప్పారు. ఈ వివరాలు సేకరించేందుకు వచ్చే సిబ్బంది, సూపర్‌వైజర్ల కోసం నిబంధనలు రూపొందించామని తెలిపారు. ప్రజలు తమ పూర్తి విచక్షణ, నమ్మకంతో సమాచారాన్ని అందించాలని మంత్రి చెప్పారు. ఎవరి పౌరసత్వంపైనైనా అనుమానాలు వ్యక్తమైనా, వాటిని ధ్రువీకరించుకునే ప్రయత్నం చేయబోమని కూడా తెలిపారు. జనాభా లెక్కల సేకరణతోపాటే ఎన్పీఆర్‌ను కూడా దేశమంతటా చేపట్టనున్నామని నిత్యానంద్ చెప్పారు. ఈ ప్రక్రియ వచ్చే ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి జనాభా వివరాలు సేకరించే సమయంలోనే ఎన్పీఆర్ నవీకరణ కూడా జరుగుతుందని వివరించారు. గ్రామాలు లేదా గ్రామీణ ప్రాంతాలు లేదా పట్టణం లేదా వార్డు లేదా వార్డులోని ఒక నిర్దిష్ట ప్రాంతం లేదా పట్టణ ప్రాంతంలో నివసించే పౌరుల వివరాలు జనాభా పట్టిక (ఎన్పీఆర్)లో ఉంటాయని మంత్రి చెప్పారు. ఎన్పీఆర్‌ను తొలుత 2010లో రూపొందించారని, ఆ వివరాలను 2015లో నవీకరించారని తెలిపారు.



ఢిల్లీలో బీజేపీ తమ ఎన్నికల ప్రచారాన్నంతా షహీన్‌బాగ్ నిరసనోద్యమం చుట్టూ తిప్పుతున్నది. ఎందుకంటే వారికి ఢిల్లీ ప్రజల సమస్యలు పట్టవు, తెలియవు. నన్ను హిందూ వ్యతిరేకిగా ముద్రవేస్తున్నారు. నేను హిందువును, హనుమాన్ భక్తున్ని.

**అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి**

ఢిల్లీ ప్రజల వాస్తవ సమస్యలు తెలియవని మమ్ములను విమర్శిస్తున్నారు. మా ఎన్నికల ఎజెండానే ప్రజా సమస్యలు. ఆయుష్మాన్ భారత్, ఉచిత వైద్యం, పీఎం ఆవాస్ యోజన లాంటి పథకాలు ఏమయ్యాయని కేజ్రీవాల్‌ను నిలదీస్తున్నాం. పథకాలను అమలుచేయకుండా రాజకీయాలు చేస్తున్నది ఆయనే.

**మనోజ్ తివారీ, ఢిల్లీ బీజేపీ నేత**



**చరిత్రలో నేడు**



1900

**పనామా కాలువ ఒప్పందంపై సంతకాలు చేసిన అమెరికా, యూకే.**

1936

**చార్లీ చాప్లిన్ 'మాడర్న్ టైమ్స్' విడుదల.**





1945

**డగ్లస్ మ్యాక్ ఆర్థర్ నేతృత్వంలో ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో ప్రవేశించిన అమెరికా సైన్యం.**

**చైనాలో కరోనా వైరస్ వ్యాపించిన నేపథ్యంలో వూహాన్‌లో ఉన్న 180 మంది నేపాలీలను త్వరలో వెనుకకు తీసుకురానున్నారు. వారికి కరోనా వైరస్ వ్యాపించిందీ లేనిదీ తెలుసుకోవడానికి పరీక్షలు జరిపించాల్సి ఉంటుంది. రెండువారాల పాటు ప్రత్యేక శిబిరాల్లో చేర్చి వ్యాధి లేదని నిర్ధారణ అయిన తర్వాతనే పంపించాలె. దేశంలోకి వస్తున్న వారందరిని పరీక్షించడం మంచిది. ఇటువంటి పరిస్థితుల్లో తక్కువ వ్యవధిలో భారత్‌తో సరిహద్దును మూసివేయడం ఒక పెద్ద సవాలు. భారత్‌లో కూడా కరోనా వైరస్ సోకినట్టు తెలుస్తున్నది. అవసరమైతే సరిహద్దు మూసివేత తప్పదు.**

**ది హిమాలయన్ టైమ్స్**

**చైనా నుంచి కరోనా వైరస్ వ్యాపించకుండా హాంకాంగ్ సరిహద్దు నుంచి రాకపోకలను నియంత్రించాలె. ఈ చర్యలను ఇప్పటికే చేపడితే బాగుండేది. ప్రధాన భూభాగం (చైనా) నుంచి వచ్చేవారిని పరీక్షించి, రెండు వారాల పాటు పర్యవేక్షణలో పెట్టాలె. దవాఖాన ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు రెండు వేల మంది ఉద్యోగులు సమ్మె తలపెట్టారు. ఆరోగ్య పరిరక్షణలో వీరి పాత్ర కీలకమైనది. వీరి సమస్యలను పరిష్కరించవలసిందే. అయితే ఇటువంటి కీలక సమయంలో సమ్మె చేయడం సమర్థనీయం కాదు.**

**సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్**



# మహాజాతర

ఆదివాసీ కుంభమేళా మేడారం జాతర ప్రారంభ వేడుకలకు సకల ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ రోజు నుంచి ఎనిమిదో తేదీ వరకు సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు మేడారం సకల సౌకర్యాలతో ముస్తాబైంది. వనదేవతల వారంగా భావించే బుధవారం రోజున మేడారం, కన్నెపల్లి, కొండాయి, పూనుగొండ్లలో వనదేవతల పూజా కార్యక్రమాలు నిర్వహించటంతో జాతర మొదలవుతుంది. గిరిజనుల ఆరాధ్యదైవం పగిడిద్దరాజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలోని యాపలగడ్డ నుంచి ఎనభై కిలోమీటర్ల దూరంలో ఉన్న మేడారానికి సోమవారం బయల్దేరాడు. పగిడిద్దరాజు మూడురోజుల పాటు ప్రయాణించి, మేడారానికి ఈ రోజు రాత్రి 9 గంటలలోపు మేడారం గద్దెలకు చేరుకోవటంతో, జాతర లాంఛనంగా ప్రారంభమవుతుంది. యాపలగడ్డ గ్రామానికి చెందిన ఆరెం వంశీయులైన గిరిజనులు పగిడిద్దరాజును గుడి నుంచి గద్దెపైకి చేర్చి పూజలు చేస్తారు. నేడు సారలమ్మ, రేపు సమ్మక్క మేడారం చేరుకొని గద్దెలపై ఆసీనులవుతారు. గద్దెలపై ఆసీనులైన సమ్మక్క, సారలమ్మ మూడోరోజు (ఏడో తేదీన) భక్తులకు దర్శనమిస్తారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆదివాసీ దేవతలను దర్శించుకుంటారు. వనదేవతలను తమ ఆడపడుచులుగా భావిస్తూ పసుపు కుంకుమలు, చీరె సారెలు కానుకలుగా పెడుతారు. కోరిన కోర్కెలు తీర్చిన వన దేవతలకు భక్తులు తమ (తూకం) ఎత్తు బంగారాన్ని (బెల్లం) సమర్పించుకుంటారు. దేశంలో అలహాబాద్ కుంభమేళా తర్వాత అంతస్థాయిలో లక్షలాది జన సందోహంతో జరిగే మేడారం జాతర దేశంలోనే విశిష్టమైనది.

ఆదివాసుల మేడారం జాతరకు సుదీర్ఘ చరిత్ర ఉన్నది. కాకతీయుల కాలంలో అధికపన్ను, దోపిడీ హింసల నేపథ్యంలో సమ్మక్క, సారలమ్మ, జంపన్న అసువులు బాసారని చరిత్ర కథనం చెబుతున్నా, అంతకుముందునుంచే ఈ జాతర ఉన్నదన్న వాదన కూడా ఉన్నది. 1889కి ముందునుంచే మేడారం జాతరను నిర్వహించినట్లు ఆధారాలున్నాయి. నిజాం ప్రభుత్వం కూడా సమ్మక్క, సారలమ్మ జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తున్నది. ఆధునిక చరిత్రలోకి వస్తే 1944లో మేడారం జాతర ఘనంగా నిర్వహించిన దాఖలాలున్నాయి. మొదటిసారి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1958లో మేడారం జాతరను రెవెన్యూ పరిధిలోకి తెచ్చి నిర్వహణాకార్యక్రమాలను చేపట్టింది. 1967లో దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకొచ్చి తగిన ఏర్పాట్లు చేయటం ప్రారంభించింది. ఆధునికాభివృద్ధి నేపథ్యంలో అడవుల నరికివేతలు, అడవితల్లి బిడ్డలుగా నివాసాలను కోల్పోతున్న పరిస్థితుల్లోంచి ఆదివాసీ పోరాటాలు ఉధృతం కావటం, ఇంద్రవెల్లి ఘటనలు నేపథ్యంగా కావచ్చు, ఏదేమైనా 1986లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మేడారం జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించటం గమనార్హం. నానాటికీ పెరుగుతున్న భక్తుల సంఖ్యను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం 1990 నుంచి మేడారంలో వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించింది. ఇక తెలంగాణ ఆవిర్భావం తర్వాత ప్రజల సాంస్కృతిక జీవనంలో భాగంగా ఉన్న పండుగలకు పెద్దపీట వేసింది రాష్ట్ర ప్రభుత్వం. బతుకమ్మ లాంటి పండుగను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తూ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తున్నది. మేడారం జాతరను కూడా జాతీయ పండుగగా గుర్తించాలని డిమాండ్ చేస్తూనే సకల సౌకర్యాలను కల్పిస్తున్నది.

> **ఏటా పెరుగుతున్న భక్తుల రద్దీతో పర్యావరణ సమస్య తలెత్తే ప్రమాదాన్ని గుర్తించి ఈ సారి ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి గొప్ప సానుకూల నిర్ణయాన్ని చేసింది. మేడారం జాతర దట్టమైన అడవి మధ్యలో ఏజెన్సీ ప్రాంతంలో నిర్వహించబడుతున్న కారణంగా అక్కడ భక్తుల సౌకర్యాల పేర శాశ్వత నిర్మాణాలు చేపట్టడం కుదరదు. అలాంటి నిర్మాణాలేవైనా పర్యావరణానికీ, అడవుల పరిరక్షణకు హానికరం. కాబట్టి దీన్ని దృష్టిలో పెట్టుకొనే ప్రభుత్వం సకల చర్యలూ తీసుకోవటం ఆహ్వానించదగినది.**

చరిత్రలో చూస్తే 'రహదారులన్నీ రోమ్‌కే' అన్న నానుడి కనిపిస్తుంది. అదేమో కానీ ఇవ్వాళ సరిహద్దు రాష్ర్టాల నుంచి అన్ని రహదారులు మేడారానికి దారితీస్తున్నాయి. రెండేండ్లకోసారి జరిగే ఈ జాతరకు తెలంగాణ నలుమూల నుంచే కాకుండా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఏపీ రాష్ర్టాల నుంచి లక్షలాదిగా ఆదివాసులు తండోపతండాలుగా రోజుల తరబడి నడిచి మేడారం చేరుకుంటారు. ఎడ్లబండ్లు, కాలినడకన బారులుతీరి అడవి బాటలు, రహదారులన్నీ మేడారానికి జనప్రవాహమవుతాయి. కోటి నలభై లక్షలకుపైగా వస్తారనేది అంచనా. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. 75 కోట్ల రూపాయలతో రోడ్ల నిర్మాణం చేయటంతో పాటు స్నానఘట్టాలు, సకల వసతులకు ఏర్పాట్లు చేసింది. రాష్ట్రం నలుమూలల నుంచీ బస్సులు, ప్రత్యేక రైళ్లను నడుపుతున్నది. హైదరాబాద్, వరంగల్ నుంచి హెలికాప్టర్ సౌకర్యాన్ని కల్పించి మేడారం జాతర ప్రాముఖ్యాన్ని తెలంగాణ ప్రభుత్వం చాటిచెప్పింది. అలాగే ఏటా పెరుగుతున్న భక్తుల రద్దీతో పర్యావరణ సమస్య తలెత్తే ప్రమాదాన్ని గుర్తించి ఈ సారి ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి గొప్ప సానుకూల నిర్ణయాన్ని చేసింది. మేడారం జాతర దట్టమైన అడవి మధ్యలో ఏజెన్సీ ప్రాంతంలో నిర్వహించబడుతున్న కారణంగా అక్కడ భక్తుల సౌకర్యాల పేర శాశ్వత నిర్మాణాలు చేపట్టడం కుదరదు. అలాంటి నిర్మాణాలేవైనా పర్యావరణానికీ, అడవుల పరిరక్షణకు హానికరం. కాబట్టి దీన్ని దృష్టిలో పెట్టుకొనే ప్రభుత్వం సకల చర్యలూ తీసుకోవటం ఆహ్వానించదగినది.

ఆర్థికం



**వనం జ్వాలా నరసింహారావు**

# ప్రైవేట్ భాగస్వామ్యం దిశగా..

2018-2030ల మధ్య రైల్వేలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.50 లక్షల కోట్లు అవసరమని నిర్మలా సీతారామన్ చెప్పు, ఏడాదికి రూ.1.5 నుంచి 1.6 లక్షల కోట్లు మాత్రమే రైల్వేలు ఖర్చుచేస్తున్న నేపథ్యంలో మంజూరైన ప్రాజెక్టులు సైతం పూర్తిచేయడానికి దశాబ్దాల కాలం పడుతుందని అంటూ పీపీపీ విధానాన్ని సూచించారు.

స్వాతంత్ర్యం పొందిన కొత్తలో భారత్ వ్యవసాయాధారిత దేశం మాత్రమే. పారిశ్రామికంగా వెనుకబడిన దేశం. త్వరితగతిన పారిశ్రామికీకరణ జరుగాలని, ఆర్థికంగా దేశం పరిపుష్టం కావాలని, ఆర్థి క స్వావలంబన చేకూరాలనీ, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవ్వాలనీ జాతి యావత్తూ కోరుకుంటున్న రోజులవి. తదనుగుణంగానే 1948 లో ప్రకటించిన ప్రథమ పారిశ్రామిక విధానంలో విస్తృత వ్యూహం రూపొందించడం జరిగింది. మంత్రిమండలి తీర్మానం ద్వారా 1950లో ప్రణాళికా సంఘం ఏర్పాటైంది. 1951లో పారిశ్రామిక చట్టం రూపుదిద్దుకున్నది.

ఈ రెండింటి ద్వారా పారిశ్రామికాభివృద్ధిని వేగంగా, నియంత్రణ విధానంలో చేపట్టడానికి ప్రభుత్వానికి సాధికారత చేకూరింది. నెహ్రూ మదిలో మెదిలిన ఆర్థిక విధానం అమెరికా తరహా పెట్టుబడిదారీ, సోవియట్ తరహా సామ్యవాదం కాకుండా మిశ్రమ ఆర్థిక విధానంగా ఉండేది. నెహ్రూ జాతీయ పారిశ్రామిక విధానానికి అనుగుణంగా రూపుదిద్దుకున్న 1956-60 నాటి రెండో పంచవర్ష ప్రణాళిక, 1956 నాటి పారిశ్రామిక విధాన తీర్మానం, ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటుకు,అభివృద్ధికి బీజం నాటాయి. దరిమిలా ప్రభుత్వ శాఖల్లో చోటుచేసుకున్న అలసత్వాన్ని, రెడ్ టేపిజాన్ని, కార్యనిర్వహణ పట్ల నెలకొన్న నిరాసక్తతను అధిగమించడానికి, పౌరులకు ప్రభుత్వపరంగా కన్నా మెరుగైన సేవలందించడమనే ఆశయంతో ప్రభుత్వరంగ సంస్థలు నెలకొన్నాయి. అందులో దేశవ్యాప్త ఆర్టీసీ సంస్థలు కూడా ఉన్నాయి. భారత్ పెట్రోలియం, ఓన్జీసీ, బీహెచ్ఈఎల్, బీఈఎల్, నేషనల్ బిల్డింగ్స్ కన్‌స్ట్రక్షన్, ఎన్ఎండీసీ, షిప్పింగ్ కార్పొరేషన్, హెచ్ఎంటీ, ప్రగాటూల్స్ లాంటి సంస్థలున్నాయి. లక్ష్యాలను సాధించడంలో విఫలమైనందున కొన్ని సీపీఎస్‌యూలను మూసివేయడమో, పునర్వ్యవస్థీకరించడమో జరిగింది. 50 శాతానికి పైగా ప్రభుత్వ భాగస్వామ్య వాటాతో, ప్రభుత్వమే యజమానిగా ఉన్న కంపెనీలను ప్రభుత్వరంగ సంస్థ అంటారు. ప్రజలు పన్నుల ద్వారా చెల్లించే సొమ్మే ఈ సంస్థలకు ఆధారం.

దివంగత బ్రిటిష్ ప్రధాని మార్గరెట్ థాచర్ ప్రభుత్వరంగ సంస్కరణలకు యావత్ ప్రపంచంలోనే ఆద్యురాలు. ఇటీవలి కాలంలో ప్రధాని మోదీని భారత థాచర్‌గా పిలుస్తున్నారు. సరైన సేవలను ప్రజలకు అందించడంలో ప్రభుత్వరంగ సంస్థలు విఫలమయ్యాయనేది థాచర్ వాదన. వాస్తవానికి ఈ విమర్శ ఒక్క బ్రిటన్‌కే పరిమితం కాదు. భారత దేశంతో సహా యావత్ ప్రపంచంలో చోటుచేసుకున్న వాస్తవం. ప్రభుత్వరంగ సంస్థలు పేలవమైన సేవలు అందించడానికి కారణం వీటి సిబ్బంది ప్రజా ప్రయోజనాల కన్నా సొంత ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడమే. తమ సేవలు ఎలాగున్నా ప్రజలు అంగీకరించాలనే విధంగా ప్రభుత్వరంగ సిబ్బంది వైఖరి ఉంటుంది. తాము అందిస్తున్న సేవలపై తమకే గుత్తాధిపత్యం ఉన్నట్లు కూడా వారు ప్రవర్తించడం శోచనీయం. ట్రేడ్ యూనియన్ల ఆధిపత్యం కూడా ప్రభుత్వరంగ సంస్థల వైఫల్యానికి ప్రధాన కారణమని థాచర్ వాదన. యూనియన్ నాయకుల బ్లాక్‌మెయిల్ పద్ధతులు తరచూ ప్రభుత్వరంగ సంస్థల పనికి అవరోధం గా మారాయనేది ఆరోపణ. సమ్మెలకు దిగమని వారు సిబ్బందిని ప్రేరేపిస్తుంటే ప్రజలకు తరచూ ఇబ్బందులు కలగడమే కాకుండా ప్రభుత్వరంగ సంస్థలు నష్టాల ఊబిలో కూరుకుపోయాయని థాచర్ విమర్శించారు. థాచర్ సూచనల్లో ప్రధానమైనది ప్రైవేట్ రంగంలో అనుసరిస్తున్న విధానాలను ప్రభుత్వరంగ సంస్థల్లో కూడా ప్రవేశపెట్టాలనేది.

దాదాపు నాలుగు దశాబ్దాల కిందట విదేశీ పెట్టుబడులకు భారత ఆర్థికవ్యవస్థ ద్వారాలు తెరుచుకుంటున్న సమయంలో భారతీయ, విదేశీ కంపెనీల మధ్య ఒక ఏడాదిలోనే పలు జాయింట్ వెంచర్లు ఏర్పాటయ్యాయి. అవి విఫలం కావడంతో ఐదేండ్ల లోపే అవి విడిపోవడం మొదలైంది. ప్రభుత్వరంగ సంస్థల, జాయింట్ వెంచర్ల అనుభవం నేపథ్యంలో ఇతర దేశాల మాదిరిగానే భారతదేశంలో కూడా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం ఆలోచన బలపడుతూ వస్తున్నది. ఈ విధానాన్ని సమర్థించేవారు పీపీపీ విధానం వల్ల వనరులు, టెక్నాలజీ, నైపుణ్యం మెనేజ్‌మెంట్ విధానాలు, వ్యయ సామర్థ్యం తదితర రూపాల్లో ఒకదాని నుంచి మరొకటి లాభపడుతాయని అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అమలవుతున్నదే. ఈ విధానంలో ప్రభుత్వ సేవలకు అవసరమైన నిధులను ప్రభుత్వం పూర్తిగా కాని, పాక్షికంగా కాని సమకూర్చితే, ప్రైవేటురంగ భాగస్వామ్యంతో అవి అమలవుతాయి. సామాజిక బాధ్యతలో భాగంగా పలు కార్పొరేట్ సంస్థలు భారత్‌తో సహా చాలా ప్రజాస్వామిక, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పౌరసేవలను అందిస్తున్నాయి. కొన్ని సంస్థల నిబద్ధత, సామర్థ్యం చూసిన ప్రభుత్వం తామందిస్తున్న, సేవలలో వాటికి మరింత భాగస్వామ్యం కల్పించడానికి సిద్ధమయింది. దీంతో ప్రైవేట్ సంస్థతో ఒక అర్థవంతమైన పద్ధతిలో చేతులు కలుపడం ద్వారా ప్రభుత్వం పౌర సేవలను అందించడం వీలవుతుంది. ప్రైవేట్ నైపుణ్యం కూడా పనికొస్తుంది.

> పీపీపీ పద్ధతిలో ఎఫ్‌సీఐ, కేంద్ర గిడ్డంగుల సంస్థ సంయుక్తంగా గోదాముల నిర్మాణం చేయడానికి, పీపీపీ భాగస్వామ్యంతో కిసాన్ రైలు ఆపరేట్ చేయడానికి ఆర్థికమంత్రి పచ్చ జెండా ఊపారు. అదనంగా ప్రైవేటీకరణకు కూడా కేంద్ర ప్రభుత్వ సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఎల్ఐసీ ప్రైవేటీకరణకు నిర్ణయం తీసుకున్నది కేంద్రం. అంటే కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులలో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యాన్ని చేపట్టడానికి చాలా ప్రాధాన్యం ఇస్తున్నారనేగా!

అలాంటి ఏర్పాట్లనే ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యాలుగా వ్యవహరిస్తున్నారు. అయినప్పటికీ సేవలను అందించే బాధ్యత ప్రభుత్వం పైనే ఉంటుంది. ప్రైవేట్ సంస్థ మౌలిక సదుపాయాలు, నాయకత్వం, సిబ్బందికి తగు శిక్షణ, టెక్నాలజీ అభివృద్ధి, తదితర సంబంధిత విషయాల్లో పెట్టుబడి పెట్టి ప్రభుత్వ యంత్రాంగాన్ని సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా సేవలను అందిస్తుంది. దీనివల్ల ప్రభుత్వంపై అదనంగా ఎలాంటి ఆర్థికభారం పడదు. ప్రభుత్వం ప్రధాన సేవలను అందించే బాధ్యతను తనవద్ద ఉంచుకుంటూనే సంబంధిత సేవకు బడ్జెట్‌లో కేటాయించిన పెట్టుబడి, నిర్వహణ వ్యయం పరిమితిలోనే పీపీపీ సాయం పొందడం ద్వారా దాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గతేడాది బడ్జెట్‌ను సమర్పిస్తూ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యానికి సంబంధించి రెండు ప్రస్తావనలు చేశారు. భారతీయ రైల్వేలకు సంబంధించి ముంబై మరికొన్ని చిన్న నగరాల్లో చేపట్టాల్సిన భారీ పనులను ఉదాహరణలుగా పేర్కొంటూ ఢిల్లీ మీరట్ మార్గంలో ప్రతిపాదించిన ర్యాపిడ్ రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (ఆర్ఆర్‌టీఎస్) లాంటి స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ) ద్వారా సబర్బన్ రైల్వేలలో మరింతగా పెట్టుబడులు పెట్టడానికి ప్రోత్సహించడం జరుగుతుందని నిర్మలా సీతారామన్ చెప్పారు. ఆ మేరకు మరిన్ని ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యాలను (పీపీపీ)లు ప్రోత్సహించడం ద్వారా మెట్రో రైల్వే పథకాల్లో పెట్టుబడులను పెంచడానికి ప్రతిపాదనలు చేయడంతో పాటు మంజూరైన పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు.

2018-2030ల మధ్య రైల్వేలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.50 లక్షల కోట్లు అవసరమని ఆమె చెప్పు, ఏడాదికి రూ.1.5 నుంచి 1.6 లక్షల కోట్లు మాత్రమే రైల్వేలు ఖర్చుచేస్తున్న నేపథ్యంలో మంజూరైన ప్రాజెక్టులు సైతం పూర్తిచేయడానికి దశాబ్దాల కాలం పడుతుందని అంటూ పీపీపీ విధానాన్ని సూచించారు. రైల్వేలో అభివృద్ధిని వేగవంతం చేయడానికి, రైలు మార్గాల నిర్మాణాన్ని పూర్తిచేయడానికి రోలింగ్ స్టాక్ (బోగీలు, ర్యాక్‌లు) తయారీకి, ప్రయాణికులు, సరుకు రవాణా సేవలు అందించడానికి పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యాన్ని ఉపయోగించుకోవడం జరుగుతుందని నిర్మలా సీతారామన్ తెలియజేశారు.

ఇక ఈ ఏడాది కేంద్ర బడ్జెట్లో నిర్మలా సీతారామన్ పీపీపీకి సంబంధించి అనేక ప్రతిపాదనలు చేశారు. ప్రతి జిల్లాలోని ప్రభుత్వ దవాఖానకు అనుబంధంగా పీపీపీ విధానంలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించారు. పీపీపీ పద్ధతిలో ఎఫ్‌సీఐ, కేంద్ర గిడ్డంగుల సంస్థ సంయుక్తంగా గోదాముల నిర్మాణం చేయడానికి, పీపీపీ భాగస్వామ్యంతో కిసాన్ రైలు ఆపరేట్ చేయడానికి ఆర్థికమంత్రి పచ్చ జెండా ఊపారు. అదనంగా ప్రైవేటీకరణకు కూడా కేంద్ర ప్రభుత్వ సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఎల్ఐసీ ప్రైవేటీకరణకు నిర్ణయం తీసుకున్నది కేంద్రం. అంటే కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులలో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యాన్ని చేపట్టడానికి చాలా ప్రాధాన్యం ఇస్తున్నారనేగా! రైల్వేల ప్రైవేటీకరణ కూడా జరుగుతుందంటున్నారు. కాకపోతే ఎల్ఐసీ లాంటి విజయవంతంగా నడుస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం హర్షించదగిన విషయం కాదేమో!

ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం అంటే ప్రైవేటీకరణ కానేకాదు. ప్రభుత్వ బాధ్యతను తగ్గించడమనేది కూడా ఎంతమాత్రం కాదు. ప్రభుత్వ సేవలకు అనుబంధంగా, అదనంగా ప్రైవేట్ సేవలను ఉపయోగించుకోవడం. ప్రభుత్వరంగ సంస్థల వైఫల్యానికి ప్రత్యామ్నాయం ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం కావచ్చు! అది ఏయే రంగాల్లో అనేది ప్రభుత్వ ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది.

**(వ్యాసకర్త: ముఖ్యమంత్రి ముఖ్య ప్రజా సంబంధాల అధికారి)**

# పంట మార్పిడి మేలు

వ్యవసాయం



**సి.పార్థసారథి, ఐఏఎస్**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సాగునీటి లభ్యత బాగా పెరిగింది. ఏండ్లతరబడి ఎదురుచూస్తున్న సాగునీటి కలను ప్రభుత్వం నిజం చేస్తున్నది. ఈ ప్రాజెక్టుల ద్వారా అందుబాటులోకి వచ్చిన ప్రతి నీటి చుక్కను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. అయితే కేవలం వరి పంటనే పండిస్తే భవిష్యత్తులో గిట్టుబాటు ధరలు అందకపోవచ్చు. అందుకే బంగారు భవిష్యత్తు ఉన్న ఆయిల్‌పాం సాగువైపు మొగ్గుచూపాలి.

వంటనూనెల పరంగా వినియోగంలో ప్రపంచంలో భారత్‌ది 5వ స్థానం. ప్రపంచనూనెల ఉత్పత్తిలో నాలుగుశాతం, వినియోగంలో 12 శాతం, వాణిజ్యంలో 21 శాతం మన దేశానిదే. ఉత్పత్తిపరంగా ఈ శాతం పెద్దదే. అయితే వినియోగ అవసరాల కోసం 70 శాతం దిగుబడి చేసుకోవాల్సి వస్తున్నది. ప్రస్తుతం సాలీనా కోటి 40 లక్షల టన్నుల వంట నూనెలు దిగుమతి చేసుకుంటున్నాం. సంవత్సరానికి 2.5 నుంచి 2.6 కోట్ల టన్నుల నూనె గింజలు ఉత్పత్తి అయితే, కోటి ఏడు వేల ఐదువందల కిలోల నూనెలు లభ్యమవుతున్నాయి. మలేషియా, ఇండోనేషియా, అర్జెంటీనా, బ్రెజిల్ దేశాల నుంచి ప్రధానంగా దిగుమతి చేసుకుంటున్నాం. ఏటా జనాభా పెరిగిపోతున్నది. అట్లనే పెరుగుతున్న ఆదాయాలు, కొనుగోలుశక్తి నేపథ్యంలో వంటనూనెలకు డిమాండ్ భారీగా ఉన్నది. సంప్రదాయ నూనెగింజలు సాగుచేయడం ద్వారా ఈ సమస్యను అధిగమించలేకపోతున్నాం. ఫలితంగా దిగుమతుల భారం రోజురోజుకూ పెరుగుతున్నది. దీనికితోడు పట్టణీకరణ, పారిశ్రామికీకరణ వల్ల నూనెగింజల పంటల సాగువిస్తీర్ణం పెంచడం వీలు కావడం లేదు.

ఈ నేపథ్యంలో వంటనూనెల సమస్యను తగ్గించే తరుణోపాయం ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం పెంచడం. తద్వారా ప్రతి నీటిబొట్టుకు అధిక దిగుబడి, రైతుల ఆదాయాలు రెట్టింపయ్యే మార్గమవుతుంది. తక్కువ విస్తీర్ణంలో అంటే ఏడాదికి హెక్టారుకు 4 నుంచి 6 టన్నుల పామాయిల్ సాధ్యమవుతుంది. ఆయిల్‌పాం అభివృద్ధి పథకం కింద దేశంలోని 18 రాష్ర్టాలలో 20 లక్షల హెక్టార్లు ఆయిల్‌పాం సాగు పరిధిలోకి తీసుకొని రావాలని సూచించింది. ఇప్పటివరకు 3.45 లక్షల హెక్టార్లు మాత్రమే సాగులోకి వచ్చింది. ఈశాన్య రాష్ర్టాల్లో ఆయిల్‌పాం సాగుకు మంచి భవిష్యత్తు ఉన్నది. ఏడాదికి హెక్టారుకు 20 నుంచి 30 టన్నులు సాధిస్తున్నారు. కర్ణాటక రైతులు 50 టన్నులు కూడా సాధించగలిగారు. కాబట్టి రాష్ట్రంలో కూడా గోదావరి, కృష్ణ నదీపరీవాహక ప్రాంతాల్లో సంవత్సరమంతా నీటి సౌకర్యం ఉన్న ప్రాంతంలో ఆయిల్‌పాంను సాగు చేసుకోవచ్చు. కేంద్రం ఇప్పటికే రాష్ట్రంలోని 18 జిల్లాల్లోని 206 మండలాలు ఆయిల్‌పాం సాగుకు అనుకూలంగా ఉన్నాయని తేల్చింది. రాష్ట్రంలో 3 లక్షల హెక్టార్ల సాగు చేసుకునే వీలున్నది. ఇందులోభాగంగా 18 వేల హెక్టార్లలో విస్తీర్ణం పెంచగలిగాం.

రాష్ట్రాభివృద్ధిలో ఉద్యానరంగానిది ప్రధాన పాత్ర. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలో 40.5 శాతం ఉద్యానరంగానిదే. రాష్ట్రంలో 12.40 లక్షల ఎకరాల్లో ఉద్యానపంటలు సాగుచేయబడుతున్నాయి. 71.52 లక్షల టన్నుల దిగుబడిని ఇస్తున్నాయి. 4.42 లక్షల ఎకరాల్లో పండ్లు, 3.52 లక్షల ఎకరాల్లో కూరగాయలు, 3.90 లక్షల ఎకరాల్లో సుగంధ ద్రవ్య పంటలు సాగుచేయబడుతున్నాయి. పలు ప్రాముఖ్యం కలిగిన ఉద్యాన పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కూరగాయల కొరత తీర్చేందుకు ఉత్పాదకత పెంచాలి. సంవత్సరమంతా కూరగాయలు పండాలంటే వాతావరణ నియంత్రణ కావాలి. అందుకు ఉపయోగపడే హరితగృహాలను భారీగా రాష్ట్రంలో ప్రోత్సహించారు. 90 శాతం సబ్సిడీతో 1210 ఎకరాల్లో హరితగృహాల్లో కూరగాయల సాగు జరుగుతున్నది. సాగునీటి కొరతను తీర్చడంతో పాటు నీళ్లు, ఎరువుల వినియోగ సామర్థ్యం పెంచేందుకుగాను బిందు, తుంపరసేద్యాలను భారీగా ప్రోత్సహించింది. రాష్ట్రంలో నికరసాగు విస్తీర్ణం 51.20 లక్షల ఎకరాలుంటే, 18.59 లక్షల ఎకరాలకు సూక్ష్మ నీటి సేద్యం అమల్లో ఉన్నది. రాష్ట్రావిర్భావానికి ముందు 11.99 లక్షల ఎకరాలకు మాత్రమే ఉంటే, తెలంగాణ ఏర్పడిన తర్వాత 1816 కోట్ల రూపాయలతో 6.60 లక్షల ఎకరాలలో బిందు, తుంపరసేద్యాన్ని ఏర్పాటుచేశారు. నాబార్డ్ సహాయంతో అమలుచేసిన సూక్ష్మసేద్యం పథకంతో ఒక రైతుకు సరాసరిన రెండు లక్షల అదనపు ఆదాయం సమకూరింది. ఆధునిక పరిశోధనల ఫలితంగా అధిక దిగుబడిని ఇచ్చే హైబ్రిడ్స్ అందుబాటులోకి వచ్చాయి. ఉత్పత్తి, ప్రాసెసింగ్, విలువల జోడింపు, ఉప ఉత్పత్తుల అభివృద్ధిలో టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిం ది. ఇటీవల వెలుగులోకి వచ్చిన జీనోమ్ సీక్వెన్సింగ్, స్మార్ట్ ఫార్మింగ్, డిజిటల్ టెక్నాలజీ, కొత యంత్రాల నేపథ్యంలో దేశంలో ఆయిల్‌పాం సాగు పెంచాలి. దిగుబడిని తద్వారా రైతులకు ఆదాయాన్ని పెంచుకోవచ్చు. ఈ నేపథ్యంలో రాష్ట్రం త్వరలో హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఆయిల్‌పాం జాతీయ సదస్సుతో మన రాష్ట్ర రైతులు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనలు, టెక్నాలజీలను తెలుసుకునే అవకాశం ఉన్నది.

కొత్త పంటలను రాష్ట్రంలో అమలుచేశారు. దీనిద్వారా రైతులకు అదనపు ఆదాయం చేకూరింది. అందుకే ప్రజలు నిత్యం వాడే ఆపిల్‌ను రాష్ట్రంలో సాగు చేసేందుకు పరిశోధనలు జరిగాయి. ఆసిఫాబాద్‌లో ఆపిల్ తోటల సాగు సాధ్యమని తేలింది. మన ప్రాంతంలో అతి తక్కువ ఉష్ణోగ్రత ఉండదు. కాబట్టి HRM-99 రకాన్ని సీసీఎంబీ సహాయంతో పరిచయం చేయడం జరిగింది. ప్రస్తుతం తోట మూడవ సంవత్సరంలో ఉన్నది. పూత వచ్చింది. రాష్ట్రంలో ఇతర రాష్ర్టాలు విడుదల చేసిన రకాలను రైతులు సాగుచేస్తున్నారు. మన ప్రాంతంలో వీటిని సాగుచేయడానికి అనుకూలత అంతగా లేదు. అందుకే ఉత్తమమైన పరిశోధనలతో విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఆరు పంటలలో ఏడు కొత్తరకాలను విడుదల చేశారు. క్షేత్రస్థాయిలో రైతుల పొలాల్లో వీటి దిగుబడి బాగున్నది. స్వల్పకాలంలో వచ్చే రకాలు, సంవత్సరమంతా సాగుచేసుకునే రకాలతోపాటు, అధిక జిగురునిచ్చి, కూరగాయగా వాడే గోరుచిక్కుడు, కొత్తిమీర, ధనియాలను ఇచ్చేరకం కూడా విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసింది. భవిష్యత్తులో అన్ని పంటలలో నాణ్యమైన అధిక దిగుబడిని ఇస్తూ స్వల్పకాలిక రకాలను రైతులకు తెచ్చే ప్రయత్నం చేస్తాం.

> కొత్త పంటలను రాష్ట్రంలో అమలుచేశారు. దీనిద్వారా రైతులకు అదనపు ఆదాయం చేకూరింది. అందుకే ప్రజలు నిత్యం వాడే ఆపిల్ ను రాష్ట్రంలో సాగు చేసేందుకు పరిశోధనలు జరిగాయి. ఆసిఫాబాద్‌లో ఆపిల్ తోటల సాగు సాధ్యమని తేలింది. మన ప్రాంతంలో అతి తక్కువ ఉష్ణోగ్రత ఉండదు. కాబట్టి HRM-99 రకాన్ని సీసీఎంబీ సహాయంతో పరిచయం చేయడం జరిగింది. ప్రస్తుతం తోట మూడవ సంవత్సరంలో ఉన్నది. పూత వచ్చింది. రాష్ట్రంలో ఇతర రాష్ర్టాలు విడుదల చేసిన రకాలను రైతులు సాగుచేస్తున్నారు.

మిగతా పంటలతో పోలిస్తే ఏడాదంతా ఆదాయాన్ని పనిదినాలను కల్పించే అవకాశం ఆయిల్‌పాంకు ఉన్నది. 30 ఏండ్ల తోట కాలం ఉండే ఈ సాగులో మొదటి మూడేండ్లు అంతరపంటగా ఎటువంటి కూరగాయలైనా, మెట్ట పంటలను కూడా పండించుకోవచ్చు. దీనిద్వారా అదనపు ఆదాయం వస్తుంది. ఆ తర్వాత ఆకుకూరలు కూడా సాగు చేసుకోవచ్చు. దీనికితోడు దీర్ఘకాలిక తోట పంట కాబట్టి తోట చుట్టూ ఎర్రచందనం లేదా వెదురును సాగుచేసుకొని మరింత ఆదాయం పొందే వీలున్నది. కోట్లాది రూపాయల మేర విదేశాల నుంచి నూనెగింజలు దిగుమతి చేసుకునే బదులు దేశీయంగా ఆయిల్‌పాం పంటల సాగువైపు రైతులను మళ్లించాలి. అందుకు అనుగుణంగా వారిని ప్రోత్సహించాలి.

**(వ్యాసకర్త: రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ముఖ్య కార్యదర్శి)**

**జనగళం**

## కంకవనంలో కుంభమేళా

**మాఘశుద్ధ పౌర్ణమి శుభ ఘడియలు**
దారులన్నీ మేడారం వైపు జోరుగా పరుగులు
కంకవనం తెరదీసే ఆదివాసీల కుంభమేళ
జంపన్న వాగులో పుణ్యతానాల మునకలు
అడవి పల్లె ఆసాంతం భక్తి నురగల పొంగులు
కోటి మొక్కులు, పోటెత్తే భక్తి పారవశ్యాలు
గెరిల్లా యుద్ధయోధులే వనదేవతల రూపాలు
కోర్కెలు తీర్చుటకే కొలువుదీరిన వేళలు!

తల్లి రాకకే తండ్లాడే తన్మయత్వపు తనువులు
చిలుకలగుట్టకేసి తదేక చూపుల పూజలు
జంతు బలులు, ఎదురుకోళ్ల స్వాగతాలు
పసుపుకుంకుమల భరణి గద్దెకు చేరటాలు
నిలువెత్తు బంగారం, సారెచీరల చదివింపులు
కానుకలు చెల్లించి కరుణించమని విన్నపాలు
సమ్మక్క సారలమ్మల దీవెనలు సంపదగా గైకొని
తన్మయత్వంలో తడిసి మురిసిన మనసులు!

తల్లుల వన ప్రవేశంతో జాతరకు తలుపు మూసి
జనారణ్యమె కరిగి, తరిగి తృప్తితో వెనుదిరిగి
పోయొస్తాం సమ్మక్క సారలమ్మంటు దీవెనలడిగి
రెండేండ్లకు మళ్లొస్తామని అనుమతులు కోరి
అశేష జనమంతా దివ్య ఆశీస్సులు నింపుకొని
కంకవన కమనీయతల్లి గుండెల్లో నిలుపుకొని
మేడారం గద్దెను మదిగదిన భద్రపరచుకొని
జనమంతా వెనుదిరిగె మూటముల్లె సర్దుకొని!

**– డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, 99497 00037**

**(మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా కవితాక్షరసుమాల సమర్పణ)**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com



జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం మంగళ వారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే భక్తులు ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. మేడారం జాతర దృష్ట్యా ఇక్కడ రద్దీ బాగా పెరిగింది. స్వామి వారిని దాదాపు 30 వేల మంది భక్తులు దర్శించుకోగా, ఆలయానికి రూ.5 లక్షలకుపైగా ఆదాయం సమకూరిందని ఈవో కృష్ణ ప్రసాద్ తెలిపారు. - మల్యాల



నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలకు భక్తులు పోటెత్తారు. మంగళ వారం తెల్లవారుజామున అగ్ని గుండాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అగ్ని గుండాల నుంచి భక్తులు 'ఓం నమఃశివాయ' అంటూ నడిచారు. విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, నకిరేకల్, నల్లగొండ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. - నార్కట్‌పల్లి



మొక్కులు చెల్లించుకునేందుకు నిలువెత్తు బంగారం(బెల్లం)తో సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్దకు తరలివస్తున్న భక్తులు





జంపన్నను సంపెంగ వాగు వద్దకు తీసుకొస్తున్న పూజారులు

# మహాజాతర షురూ



పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజును తీసుకెళ్తున్న పూజారులు, భక్తులు



మంగళ వారం రాత్రి మేడారంలోని సమ్మక్క-సారలమ్మల గద్దెల వద్ద భక్తజనం

మొదటిపేజీ తరువాయి...

సారలమ్మను మేడారం గద్దెపై ప్రతిష్ఠించుకునే ముందు కన్నెపల్లి ఆడబిడ్డలు మేడారంలోని సారలమ్మ గద్దెకు అలుకుపూత చేసి, ముగ్గులేసి సిద్ధం చేస్తారు. బుధవారం మధ్యాహ్నం మేడారానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండాయి నుంచి గోవిందరాజుల ప్రధాన వడ్డె దబ్బగట్ల గోవర్ధన్ నేతృత్వంలోని వడ్డెలు గోవిందరాజులును గద్దెకు తీసుకొస్తారు. మేడారానికి సారలమ్మ రాక, గోవిందరాజులు రాక దాదాపుగా ఒకే సమయం కావడం విశేషం.

**పూనుగొండ్ల నుంచి బయలుదేరిన పగిడిద్దరాజు**

మేడారానికి 70 కిలోమీటర్ల దూరంలోని పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు బయలుదేరారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు (పడిగె రూపంలో)ను తీసుకొని ప్రధాన వడ్డె మురళీధర్‌తోపాటు వడ్డెలు, వారి కుటుంబ సభ్యులు మేడారం బయలుదేరారు. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో బయలుదేరిన పగిడిద్దరాజు రాత్రి ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం లక్ష్మీపురంలో బస చేశారు. బుధవారం తెల్లవారుజామున ప్రత్యేక కోయ సంప్రదాయాలతో పూజలు చేసి సాయంత్రం వరకు మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకుంటారు.

**జాతరకు విస్తృతస్థాయిలో ఏర్పాట్లు: మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి**

**నిర్మల్ టౌన్:** ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో సమ్మక్క-సారలమ్మ జాతరకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేశామని దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. నిర్మల్‌లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా సౌకర్యాలు కల్పించామన్నారు. సమ్మక్క-సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసినా స్పందించట్లేదని ఆరోపించారు.

**భక్తులకు అసౌకర్యం కలుగొద్దు : సీఎస్ సోమేశ్‌కుమార్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్ నుంచి డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు వికాస్‌రాజ్, రజత్‌కుమార్, ఐజీ నాగిరెడ్డి, గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ క్రిస్టినా జడ్‌చోంగ్తు, కలెక్టర్ కన్నన్‌తో కలిసి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతరలో నిరంతర విద్యుత్, మంచినీటి సరఫరా, పూర్తిస్థాయిలో టాయ్‌లెట్ల వినియోగం, బస్సుల ఏర్పాట్లు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్, పార్కింగ్ లాట్స్ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నా రు. కాగా, మేడారం జాతరకు రావాలని సీఎస్, డీజీపీలకు గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ డాక్టర్ క్రిస్టినా జెడ్‌చోంగ్తు ఆహ్వాన పత్రికను అందజేశారు.

**అసాధారణ ఏర్పాట్లు**

మేడారం జాతర చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. సీఎం కేసీఆర్ స్వయంగా మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ తదితర ఉన్నతాధికారులను మేడారం పంపి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం ఆర్టీసీ 4వేల బస్సులను నడుపుతున్నది. సీఎం కేసీఆర్ చొరవతో దక్షిణ మధ్య రైల్వే ఇరువై ప్రత్యేక రైళ్లను సికింద్రాబాద్, ఖమ్మం, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్ష, చంద్రాపూర్ వంటి ప్రాంతాల నుంచి నడుపుతున్నది. అటు పర్యాటక శాఖ తరపున హెలికాప్టర్లను నడుపుతుండటం విశేషం.



గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



జంపన్నవాగులో స్నానమాచరిస్తున్న భక్తులు



బాన్సువాడలో చిన్న రాంపూర్ రైతులకు పట్టాపాస్‌బుక్ పత్రాలను అందజేస్తున్న స్పీకర్ పోచారం

## అటవీ భూములు కబ్జా చేస్తే సహించం

- స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి
- రైతులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాపత్రాల పంపిణీ

**బాన్సువాడ, నమస్తే తెలంగాణ:** అటవీ భూములు కబ్జాచేస్తే సహించేదిలేదని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం చిన్నరాంపూర్ గ్రామానికి చెందిన 84 మంది రైతులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాదారు పాసుపుస్తకాలకు సంబంధించిన పత్రాలను మంగళవారం స్పీకర్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంతోకాలంగా అటవీ, రెవెన్యూ అధికారుల మధ్య ఉన్న సమస్యలను బాన్సువాడ ఆర్డీవో రాజేశ్వర్, అధికారులు పరిష్కరించినట్టు తెలిపారు. ఈ పట్టా భూములకు రైతుబంధు, రైతుబీమా పథకాలు వర్తిస్తాయన్నారు.

## ఎస్బీఐలో డిజిటల్ సేవలు

ఎస్బీఐ మేనేజింగ్ డైరెక్టర్ చల్లా శ్రీనివాసులు శెట్టి

**వనపర్తిక్రీడలు:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతాదారులకు డిజిటల్ సేవలను అందిస్తున్నామని అఖిల భారత ఎస్బీఐ మేనేజింగ్ డైరెక్టర్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్ సమీపంలో ఎస్బీఐ నూతన బ్రాంచిని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో మొత్తం 16 బ్రాంచీలకు గాను పదింటిలో వ్యవసాయ శాఖకు సంబంధించిన రుణాలిచ్చేలా ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలోని అన్ని బ్రాంచీలను అత్యున్నతంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టామన్నారు. యోనో యాప్ ద్వారా ఖాతాదారులకు 24/7 సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అనంతరం వివిధ రకాల బ్యాంక్ రుణాల చెక్కులను అందజేయడంతోపాటు డిపాజిటర్లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ ఓం ప్రకాశ్‌మిశ్రా, రీజనల్ మేనేజర్ జేవీ నాగరాజు, వనపర్తి ఎస్బీఐ బ్రాంచి మేనేజర్ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో ఎస్బీఐ నూతన బ్రాంచీని ప్రారంభిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ చల్లా శ్రీనివాసులు శెట్టి



జగిత్యాల జిల్లా ధర్మపురిలో మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

## మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి ఈశ్వర్

**ధర్మపురి, నమస్తేతెలంగాణ:** రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధే సర్కార్ ధ్యేయమని ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సెర్ప్ ద్వారా నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై జగిత్యాల జిల్లా ధర్మపురిలో అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహి ళా సంఘాలకు రుణాల వడ్డీ మాఫీ కోసం ప్రభుత్వం ఇటీవలే రూ.617 కోట్లు ఇచ్చిందని గుర్తుచేశారు. సంఘాల్లో సభ్యులుగా ఉన్న ఒక్కో మహిళకు సెర్ప్ ద్వారా ప్రస్తుతం రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామన్నారు. ఈ రుణాలను ఎంతోమంది సభ్యులు సద్వినియోగం చేసుకొంటున్నారని తెలిపారు. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి ద్వారా ఒక్క జగిత్యాల జిల్లా మహిళలకే ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.300 కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చినట్టు తెలిపారు. బ్యాంకు లింకేజీలో రాష్ట్రంలోనే జగిత్యాలజిల్లా మూడో స్థానంలో, రికవరీలో ప్రథమ స్థానంలో ఉండటం అభినందనీయమన్నారు.



రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ మంగళ వారం మొక్క నాటారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు కొన్ని కోట్ల మొక్కలు నాటే విధంగా ఎంతో మందిని భాగస్వాములను చేస్తూ గ్రీన్ ఇండియా చాలెంజ్ విజయవంతం కావడానికి కారణమైన ఎంపీ సంతోష్ కుమార్ కృషిని అభినందించారు. - హుజూరాబాద్



పాతగుట్టలో స్వస్తివాచనం నిర్వహిస్తున్న అర్చకులు. పాల్గొన్న ఈవో గీత, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి

## పాతగుట్టలో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

**యాదాద్రిభువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తేతెలంగాణ:** యాదాద్రి అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవ సంరంభానికి మంగళవారం ఉదయం శ్రీకారం చుట్టారు. ఉదయం 9.30 గంటలకు స్వస్తివాచన ఘట్టాన్ని ప్రారంభించారు. ఆలయాన్ని విశేష పుష్పాలతో అలంకరించారు. స్వామి, అమ్మవార్ల విగ్రహాలను ఆలయం ముఖమండపంలో ప్రత్యేక పీఠంపై ప్రతిష్ఠించి పూజలు చేశారు. అగ్నిదేవుడికి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి ఆలయ ఈవో ఎన్ గీత, అనువంశిక ధర్మకర్త బీ నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## బాలిక అపహరణ

**కొండమల్లేపల్లి:** నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలకేంద్రానికి చెందిన బాలిక(14)ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలిక తల్లి స్థానిక ప్రైవేటు పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్నది. బాలిక మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నది. సోమవారం ఉదయం తల్లి పనికి వెళ్లగా బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్నది. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి కిడ్నాప్ చేశారు. బాలిక తల్లి ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇంటికి రాగా కూతురు కనిపించకపోవడం, కాపలాగా ఉన్న కుక్క అపస్మారక స్థితిలో ఉండటంతో విషయాన్ని బంధువులు, స్థానికులకు తెలిపింది. వారంతా బాలిక కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.

## ఆకతాయి వేధింపులకు బాలిక బలి

**దామరచర్ల:** ప్రేమపేరుతో ఆకతాయి వేధింపులకు గురిచేస్తుండటంతో మనస్తాపానికి గురైన బాలిక ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన నల్లగొండ జిల్లా దామరచర్లలో మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్లకు చెందిన శిరీష(17) మండలంలోని బొత్తలపాలెం మోడల్ స్కూల్‌లో సీనియర్ ఇంటర్ చదువుతున్నది. అదే గ్రామానికి చెందిన యువకుడు నిమ్మల సతీశ్ ఆమెను ప్రేమ పేరుతో తరచూ వేధించేవాడు. విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పగా వారు పలుమార్లు అతడిని హెచ్చరించారు. అయినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. మంగళవారం ఉదయం శిరీష మోడల్ స్కూల్‌కు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చింది. తల్లిదండ్రులు కూలి పనికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరెతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సాయంత్రం తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా కూతురు ఫ్యాన్‌కు విగత జీవిగా వేలాడుతూ కనిపించడంతో కన్నీరుమున్నీరయ్యారు. తమ కూతురికి వివాహం నిశ్చయమైందని, మరో రెండు నెలల్లో వివాహం జరుగాల్సి ఉన్నదన్నారు. నిమ్మల సతీష్ వేధింపులతోనే తమ కూతురు ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై నర్సింహారావు తెలిపారు.



శిరీష(ఫైల్)

## డివిడెండ్ చెల్లింపులపైనే టీడీఎస్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** మ్యూచువల్ ఫండ్స్ డివిడెండ్ చెల్లింపులపై మాత్రమే 10 శాతం టీడీఎస్ వర్తిస్తుందని, రెడెంప్షన్ ఆఫ్ యూనిట్స్‌పై కాదని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) మంగళవారం తెలిపింది. ఆయా సంస్థలు, మ్యూచువల్ ఫండ్స్ తమ వాటాదారులకు ఇస్తున్న డివిడెండ్‌పై చెల్లించే డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ (డీడీటీ)ను రద్దు చేస్తున్నట్లు ఇటీవలి బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆ కంపెనీలు, మ్యూచువల్ ఫండ్స్ తమ వాటాదారుకు ఇచ్చే డివిడెండ్/ఆదాయం ఏటా రూ.5,000 దాటితే దానిపై 10 శాతం టీడీఎస్ (ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్) వేస్తామని ప్రతిపాదించారు. దీనిపై పన్ను చెల్లింపుదారుల్లో కొంత అయోమయం నెలకొనడంతో సీబీడీటీ స్పందించింది. యూనిట్ల ఉపసంహరణపై పొందే మూలధన లాభాలపై 10 శాతం టీడీఎస్ ఉండదని స్పష్టత ఇచ్చింది.



ఎక్స్‌పీరియన్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్

## హైదరాబాద్‌లో ఎక్స్‌పీరియన్ డెవలప్ సెంటర్

ప్రారంభించిన జయేశ్ రంజన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 4:** ప్రముఖ డాటా అనలిటిక్స్‌లో ఒకటైన ఎక్స్‌పీరియన్..హైదరాబాద్‌లో తన కొత్త డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆరంభించింది. ఈ కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రెసిడెంట్ అలెక్స్ లింట్నెర్ మాట్లాడుతూ.. భాగ్యనగరంలో ఐడీసీని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉన్నదని,35 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో ప్రస్తుతం 200 మంది ఇంజినీర్లు పనిచేస్తుండగా, 2024 నాటికి ఈ సంఖ్యను 2,500కి పెంచుకోనున్నట్లు చెప్పారు. ఐటీ నిపుణులను అత్యధిక మందిని ఆకట్టుకుంటున్న హైదరాబాద్ పరిశోధన కేంద్రంగా మారిందని, దీంతో ఇక్కడే దేశీయ, అంతర్జాతీయ సంస్థలు తమ కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నాయన్నారు. మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్య, అత్యుత్తమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులతోపాటు సులభతర వాణిజ్య విధానం అమలులో ఐడీసీకి హైదరాబాద్ ఆదర్శవంతంగా నిలిస్తున్నదని ఆయన వ్యాఖ్యానించారు.


**తెలంగాణ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్**
**(తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ)**

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటిఫికేషన్ -39**

09 పనుల కొరకు టెండరు నం.లు T 200 నుండి T208/2019-20, తేది: 03-02-2020 కొరకు సివిల్ పనుల కొరకు టెండర్లు కోరబడుచున్నవి. వరుసగా టెండరు నంబర్లు, పనులుగల జిల్లాలు & మొత్తం ECV (రూ.లక్షలలో) దిగువ విధంగా ఉన్నాయి: T 200-నిజామాబాద్-1-34.40; T201 & T 208-హైదరాబాద్-2-339.39; T 202- మేడ్చల్-1- 60.53; T203, T 204, T 205, T 206 & T 207-రంగారెడ్డి -5-69.35; ఆన్‌లైన్‌లో షెడ్యూల్ లభ్యత: 04-02-2020 నుండి .టెండరు నంబర్లు T200, T201, T202, T203, T204, T205, T206 & T 207ల కొరకు బిడ్ దాఖలుకు ఆఖరి తేదీ/సమయం: 11-02-2020/ సా. 5.00గం. (STN). టెండరు నం. T 208 కొరకు బిడ్ దాఖలుకు ఆఖరి తేదీ/సమయం : 18-02-2020/ సా. 5.00గం. తదుపరి వివరాలను వెబ్‌సైట్ www.tender.telangana.gov.inలో చూడవచ్చును.

సం/- మేనేజింగ్ డైరెక్టర్

DIPR RO. No. 642-PP/CL/Advt/1/2019-20, Dt: 04/02/2020



**ది సింగరేణి కాలరీస్ కంపెని లిమిటెడ్**
(ప్రభుత్వ సంస్థ)
రిజిస్టర్డ్ ఆఫీసు: కొత్తగూడెం కాలరీస్ - 507 101

**ప్రకటన**

భారత అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి లేఖ FNO:8-55/2014-FC తేదీ 12.04.2019 ప్రకారం ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కొత్తగూడెం ఏరియా లో కిష్టారం ఉపరితల గనికి గాను 285.44 Ha భూమిని కేటాయించుటకు 2వ మరియు తుదిదశ అనుమతిలో విధించిన నిబంధనల తెలుగు తర్జుమా ప్రతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య అటవీ సంరక్షణ అధికారి ఆదేశాల మేరకు ప్రకటించడం అయినది.

1. మళ్లించిన అటవీ భూమి యొక్క చట్టపరమైన స్థితి మారదు. 2. ప్రాజెక్టు కోసం అవసరమైన అటవీయేతర భూమిని అప్పగించిన తర్వాత అటవీ భూమిని యూజర్ ఏజెన్సీకి అప్పగించబడును. 3. డంపింగ్ యార్డ్ కొరకు కావలసిన 71.71 హెక్టార్ల అటవీ భూమి యూజర్ ఏజెన్సీకి అప్పగించిన తేదీ నుండి గరిష్టంగా 10 సంవత్సరాల లోపల పూర్వస్థితికి తెచ్చి అటవీ శాఖకు, తిరిగి అప్పగించుటకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవలెను. 4. పరిహారిక అటవీకరణ:- పరిహారిక అటవీకరణ నేల మరియు తేమ పరిరక్షణ కొరకు ఈ క్రింద గుర్తించబడిన అటవీ భూమిలో యూజర్ ఏజెన్సీ ఖర్చుతో అటవీ విభాగం సంరక్షణ చర్యలు చేపట్టవలెను.

| క్ర. సంఖ్య | అటవీ భూమి పేరు మరియు మండలం | బీటు యొక్క పేరు | కంపార్ట్‌మెంటు సంఖ్య | పరి హారిక అటవీకరణ కొరకు ప్రతిపాదించిన పరిమాణము (హెక్టార్లలో) |
| --- | --- | --- | --- | --- |
| 1 | గుబ్బ గూర్తి, ఖమ్మం డివిజన్ | మల్లుపల్లి | 51, 52 & 53 | 227.00 |
| 2 | అన్నపురెడ్డిపల్లి, కొత్తగూడెం డివిజన్ | నామవరం | 148 & 149 | 282.00 |
| 3 | లంకపల్లి, సత్తుపల్లి డివిజన్ | లంకపల్లి | 175 | 62.00 |
| | | | మొత్తం | 571.00 |

సాధ్యమైనంతవరకు స్థానిక స్వదేశీ మొక్కలు మాత్రమే నాటవలెను మరియు ఒకే రకమైన మొక్కలు లేకుండా చూడవలెను. 5. ఎఫ్.ఆర్.ఏ. 2006 యొక్క పూర్తి అమలు జరిగేలా చూడవలెను మరియు సంబంధిత జిల్లా కలెక్టర్ నుండి అధికార ధృవపత్రం పొందవలెను. 6. అటవీ జంతువుల నిర్వహణ ప్రణాళిక ఆమోదించిన విధముగా Adhoc CAMPA ఖాతాలో జమ చేసిన నిధుల నుండి రాష్ట్ర అటవీశాఖ అమలు చేయునట్లు రాష్ట్ర ప్రభుత్వం చూడవలెను. 7. యూజర్ ఏజెన్సీ మళ్లించిన అటవీ భూమిలో పరిమిత చెట్లను నరికి వేయవలెను. చెట్లను నరికి వేయబడిన కార్యక్రమాన్ని రాష్ట్ర అటవీ శాఖ పర్యవేక్షణలోనే జరుగవలెను. 8. యూజర్ ఏజెన్సీ పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 యొక్క నిబంధనల ప్రకారం పర్యావరణ అనుమతులు పొందవలెను. 9. యూజర్ ఏజెన్సీ స్వయంగా కానీ / రాష్ట్ర అటవీ శాఖ ద్వారా కానీ ప్రాజెక్టు వారి నిధులు కేటాయించి సేఫ్టీ జోన్ (భద్రత మండలం) యొక్క ఫెన్సింగ్ కాపాడుటు/చెట్లు నాటుట చేపట్ట వలెను. (7.5 మీటర్ల స్ట్రిప్ మైనింగ్ లీజు/ మైనింగ్ క్లస్టర్‌లో ఉంచాలి. ఆమోదించబడిన మైనింగ్ ప్రణాళికలో పేర్కొన్న ఇతర ప్రాంతాలు మరియు ప్రాజెక్టు వ్యయంతో వర్తించవలెను). 10. పక్షుల గూళ్ళు ఉన్న చెట్లను ఈ ప్రాజెక్టు కోసం తీసివేయవలసి వస్తే రాష్ట్ర అటవీశాఖ పక్షుల కోసం ప్రత్యామ్నాయ ఆవాసాలను/గూళ్ళు యూజర్ ఏజెన్సీ ఏర్పాటుచేసే విధంగా చూడాలి. పై పక్షుల పర్యావరణహిత పదార్థాలతో తయారైన ఆవాసాలను/గూళ్ళు మరియు ప్రాజెక్టు దగ్గర ప్రాంతంలో గల ఆవాసాల్లో ఏర్పాటు చేయవలెను. 11. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర R&R పాలసీ ప్రకారం యూజర్ ఏజెన్సీ R&R ప్లాన్‌ను అమలు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించుకోవలెను. జాతీయ R&R విధానానికి అనుగుణంగా ప్రభుత్వం, ప్రారంభానికి ముందు భారత ప్రభుత్వం ప్రాజెక్టు పని మరియు చెప్పిన R&R ప్రణాళికను MOEF & CC యొక్క రాష్ట్ర ప్రభుత్వం/ప్రాంతీయ కార్యాలయం పర్యవేక్షణ కోసం సూచికలతో పాటు పరిశీలించదగిన మైలురాళ్ళు పర్యవేక్షిస్తుంది. పని అమలు చేయడానికి ముందు 12 కుటుంబాల పునరావాసం రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించాలి. 12. ఈ ప్రాజెక్టు కొరకు మళ్లించబడిన అటవీ భూమి యొక్క కాలపరిమితిని గనులు మరియు ఖనిజాలు (అభివృద్ధి & నియంత్రణ) చట్టం 1957 కింద మంజూరు చేయబడి లీజుకు లోబడి నిర్ణయించబడుతుంది. 13. డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ యొక్క ఆదేశాల మేరకు ఆమోదించబడిన ఖనిజాల ప్రణాళిక ప్రకారం మైనింగ్ మరియు పునరుద్ధరణను చర్యలు చేపట్టాలి. 14. అటవీ భూమిలో కార్మిక శిబిరం ఏర్పాటు చేయకూడదు. 15. అటవీ భూమికి ఎటువంటి నష్టం మరియు ఒత్తిడి పడకుండా యూజర్ ఏజెన్సీ పని స్థలంలో పనిచేయుచున్న కార్మిక మరియు సిబ్బందికి వంటచెరుకు లేదా వేరే ఇంధనం ఏర్పాటు చేయవలెను. 16. డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్ యొక్క ఆదేశాల మేరకు మళ్లించిన అటవీ భూమి ఖనిజాల లీజ్ భద్రత ప్రాంతము సరిహద్దు భూమిపై నిర్ధారించవలెను. 17. రాష్ట్ర అటవీ శాఖ క్షీణించిన అడవులను పునరుద్ధరించడానికి ఖాళీ ప్రదేశంలో చెట్లు నాటడం నేల మరియు తేమ పరిరక్షణ కార్యకలాపాలను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారిస్తుంది. (సాంద్రత 0.4 కన్నా తక్కువ ప్రదేశంలో కాంపా ఖాతాలో నిధులను జమ చేయ వలెను). 18. మైనింగ్ లీజు హద్దు నుండి 5 కిలోమీటర్ల లోపల ఉన్న గ్రామ చెరువులు మరియు ఇతర నీటి వనరులపై siltation (బురద, ఒండ్రుమట్టి) యొక్క ప్రభావం తగ్గించుటకు రాష్ట్ర అటవీశాఖను సంప్రదించి గ్రామ చెరువులు మరియు ఇతర నీటి బావులలో యూజర్ ఏజెన్సీ వారి ఖర్చులతో de-silting (బురద, ఒండ్రుమట్టి తీయుట) పనులు చేపట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవలెను. 19. మంజూరు చేసిన అటవీ భూమిని ఏ పనికైతే ఉద్దేశించబడినదో దానికి మాత్రమే వాడాలి. 20. డైవర్షన్ (మళ్లించిన) కొరకు ప్రతిపాదించిన అటవీ భూమిని కేంద్ర ప్రభుత్వం వారి ముందస్తు అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితులలోనూ ఇతర ఏజెన్సీకి/శాఖలకు/వ్యక్తులకు బదిలీ చేయకూడదు. 21. మైనింగ్ లీజు యొక్క లేఅవుట్ ప్రణాళికలో ఏదైనా మార్పు అవసరం ఉంటే అధ్యాయం 1 యొక్క పేరా 1:21 హ్యాండ్ బుక్, మార్గదర్శకాల అటవీ (పరిరక్షణ) చట్టం 1980 మరియు మంత్రిత్వ శాఖ లేఖ నెంబర్ 5-2/2017-FC తేదీ 28.03.2019 ప్రకారం చేయవలెను. 22. ఆమోదించిన పథకాలు/ప్రణాళిక ప్రకారం చుట్టుపక్కల ప్రాంతంలోని అడవులపై ప్రతికూల ప్రభావం తగ్గించుటకు సంబంధిత డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ పర్యవేక్షిస్తూ తగు చర్యలు తీసుకోవలెను. 23. యూజర్ ఏజెన్సీ మరియు రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని కోర్టు ఆదేశాలు, నిబంధనలు, నియమాలు మరియు సూచనలను అన్ని వేళల పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవలెను. 24. ఈ షరతులలో దేనినైనా ఉల్లంఘిస్తే అటవీ (పరిరక్షణ) చట్టం, 1980 యొక్క ఉల్లంఘన భావించి పేరా 1.21అధ్యాయం 1 యొక్క హ్యాండ్ బుక్ మార్గదర్శకాల అటవీ (పరిరక్షణ) చట్టం 1980 మరియు మంత్రిత్వశాఖ లేఖ 5-2/2017-FC తేదీ 28.03.2019 ప్రకారం చర్య తీసుకోబడును. 25. అటవీ మరియు అటవీ జంతువుల సంరక్షణ, రక్షణ మరియు అభివృద్ధి కొరకు కేంద్ర ప్రభుత్వ అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారు సమయానుసారముగా ఇతర షరతులను విధించవచ్చును. రాష్ట్ర ప్రభుత్వం పైన పేర్కొన్న అన్ని షరతులు యూజర్ ఏజెన్సీ అమలు చేసే లాగా చూడవలెను.

ఇట్లు
శ్రవణ్ కుమార్ వర్మ
PR/2019-20/KGMEST/TSA/111 డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ (ఎఫ్. సి.)


917 పాయింట్లు పుంజుకున్న సెన్సెక్స్ | 272 పాయింట్లు ఎగిసిన నిఫ్టీ

గత రెండు రోజుల్లో రూ.3.57 లక్షల కోట్లు ఎగబాకిన మదుపరుల సంపద

# ఉరిమిన ఉత్సాహం

భారీ లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు

పెద్ద ఎత్తున పెట్టుబడులతో ముందుకొచ్చిన మదుపరులు

వీడిన బడ్జెట్ అసంతృప్తి, కరోనా వైరస్ భయాలు



**ముంబై, ఫిబ్రవరి 4:**

దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ భారీ లాభాలను సంతరించుకున్నాయి. మంగళవారం ట్రేడింగ్‌లో మదుపరులు కొనుగోళ్లతో రెచ్చిపోయారు. ముఖ్యంగా విదేశీ మదుపరులు భారతీయ స్టాక్స్‌పై అమితాసక్తిని ప్రదర్శించారు. బడ్జెట్ రోజున లాభాల స్వీకరణకు దిగిన మదుపరులంతా.. తిరిగి పెట్టుబడుల వైపు మళ్లారు. దీంతో బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్‌ఈ) సూచీ సెన్సెక్స్ 917.07 పాయింట్లు లేదా 2.30 శాతం ఎగబాకి మరోసారి 40 వేల మార్కును అధిగమించి 40,789.38 వద్ద ముగిసింది. గతేడాది సెప్టెంబర్ 23 నుంచి సెన్సెక్స్ ఒక్కరోజులో ఈ స్థాయిలో పెరుగడం ఇదే తొలిసారి. ఒకానొక దశలో 40,818.94 పాయింట్లను తాకడం విశేషం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ సైతం 271.75 పాయింట్లు లేదా 2.32 శాతం ఎగిసి 11,979.65 వద్ద నిలిచింది. నిజానికి దేశ ఆర్థిక వ్యవస్థపై ఏర్పడిన ఆందోళనల మధ్య మదుపరులు స్టాక్ పెట్టుబడులపట్ల ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. దీనివల్లే సూచీలు పడుతూలేస్తూ పయనిస్తున్నాయి. ఈ సమయంలో బడ్జెట్ నిరాశాజనకంగా ఉండటం, చైనాలో కరోనా వైరస్ వ్యాప్తి చెందడం, ఇది ప్రపంచ దేశాలకు విస్తరించడం.. పరిస్థితిని మరింత దిగజార్చాయి. అయితే మదుపరులు ఈ విపత్కర పరిస్థితి నుంచి బయటపడ్డ సంకేతాలు కనిపిస్తున్నాయి. వరుసగా రెండు రోజుల లాభాలు, మంగళవారం భారీ లాభాలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. కాగా, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, మెటల్, ఆయిల్, గ్యాస్, విద్యుత్, నిర్మాణ, ఆర్థిక రంగాల్లో ర్యాలీ కనిపించింది. టైటాన్ షేర్ విలువ అత్యధికంగా 7.97 శాతం పుంజుకున్నది. ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్ షేర్ల విలువ ఆకర్షణీయంగా పెరిగింది. అయితే బజాజ్ ఆటో, హిందుస్థాన్ యునిలివర్స్ (హెచ్‌యూఎల్) షేర్లు మాత్రం మదుపరులను ఆకట్టుకోలేక చతికిలపడ్డాయి. ఫలితంగా నష్టాలను మూటగట్టుకున్నాయి. మిడ్-క్యాప్ 1.37 శాతం, స్మాల్-క్యాప్ సూచీ 1.29 శాతం చొప్పున లాభాలను అందుకున్నాయి.

### రూ.3.57 లక్షల కోట్లు జూమ్

స్టాక్ మార్కెట్ల లాభాలు మదుపరుల సంపదను అమాంతం పెంచేశాయి. మంగళవారం సెన్సెక్స్ 917 పాయింట్లు పెరుగడంతో గడిచిన రెండు రోజుల్లో మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.57 లక్షల కోట్లు ఎగబాకింది. సోమవారం ట్రేడింగ్‌లో సూచీ 136.78 పాయింట్లు పెరిగిన విషయం తెలిసిందే. బడ్జెట్ రోజున 988 పాయింట్లు నష్టపోయిన నేపథ్యంలో వరుస లాభాలు మార్కెట్‌పై కొత్త అంచనాలకు తెరలేపుతున్నాయి. శనివారం ఒక్కరోజే రూ.3.46 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరైపోయిన సంగతి విదితమే. కాగా, సోమ, మంగళవారాల్లో ఆయా సంస్థల మార్కెట్ విలువ రూ.3,57,044.43 కోట్లు ఎగిసి రూ.1,56,61,769.40 కోట్లకు చేరింది. మంగళవారం ట్రేడింగ్‌లో బీఎస్‌ఈలో 1,618 షేర్లు లాభాల్లో ముగియగా, 885 షేర్లు నష్టాల్లో ముగిశాయి. 181 షేర్లు మాత్రం యథాతథంగా ఉన్నాయి.

### 13 పైసలు బలపడిన రూపాయి

డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ మంగళవారం 13 పైసలు బలపడింది. 71.25 వద్ద ముగిసింది. ఒకానొక దశలోనైతే 71.09 స్థాయికి రూపాయి మారకం విలువ చేరడం గమనార్హం. దేశీయ స్టాక్ మార్కెట్లలో భారీ లాభాలు, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గడం కలిసొచ్చిందని ఫారెక్స్ మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. నిజానికి ద్రవ్యలోటు లక్ష్యాలు పెరుగడం, కరోనా వైరస్ వ్యాప్తి ఫారెక్స్ మార్కెట్‌ను భయపెడుతూనే ఉన్నాయని, అయినప్పటికీ స్థానిక కరెన్సీకి మద్దతు లభించడం ఆహ్వానించదగ్గ పరిణామంగా పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్రవ్యసమీక్ష, ద్రవ్యోల్బణంపై దాని ప్రకటన, వృద్ధిరేటు అంచనాలు ప్రస్తుతం మార్కెట్లను ఎక్కువగా ప్రభావితం చేసే అంశాలన్నారు.

### లాభాలకు కారణాలివే..

**గ్లోబల్ మార్కెట్లలో జోష్**

కరోనా వైరస్ భయాలతో విలవిలలాడిన అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు కోలుకోవడం.. భారతీయ స్టాక్ మార్కెట్ల లాభాలకు బాటలు వేసింది. చైనా, హాంకాంగ్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, అమెరికా, ఐరోపా స్టాక్ మార్కెట్లు పుంజుకున్నాయి. చైనా రిజర్వ్ బ్యాంక్.. వైరస్ భయాలతో కుంటుపడిన ఆ దేశ వ్యాపార, పారిశ్రామిక రంగాలకు ఊతమిచ్చేలా రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తుండటం మదుపరులను ఆకట్టుకున్నది.

**కోలుకున్న తయారీ రంగం**

గత నెల తయారీ రంగం కార్యకలాపాలు పుంజుకోవడం కూడా స్టాక్ మార్కెట్ల లాభాలకు కారణమైంది. కీలకమైన ఉత్పాదక రంగం మళ్లీ గాడిలో పడిందన్న సంకేతాలు జనవరి ఐహెచ్‌ఎస్ మార్కిట్ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పీఎంఐతో వచ్చాయి. గతేడాది డిసెంబర్‌లో ఈ సూచీ 52.7 శాతంగా ఉండగా, జనవరిలో 55.3 శాతానికి పెరిగింది.

**తగ్గిన ముడి చమురు ధరలు**

అంతర్జాతీయ మార్కెట్‌లో తగ్గిన ముడి చమురు ధరలు కూడా స్టాక్ మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయి. సోమవారం 13 నెలల కనిష్ఠానికి క్రూడాయిల్ ధరలు దిగొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర ఉదయం ట్రేడింగ్‌లో 1.82 డాలర్లు పడిపోయి 54.80 డాలర్లకు చేరింది. గతేడాది జనవరి నుంచి ఇదే అత్యంత కనిష్ఠం. దేశ ఇంధన అవసరాలను 80 శాతం దిగుమతులే తీరుస్తున్న నేపథ్యంలో ధరల పతనం మార్కెట్లకు కలిసొచ్చింది.

**వీడిన బడ్జెట్ ఆందోళనలు**

బడ్జెట్ ఆందోళనల నుంచి మదుపరులు తేరుకోవడం కూడా దేశీయ స్టాక్ మార్కెట్ల లాభాలకు దోహదం చేసింది. ఇటీవలి బడ్జెట్ ప్రకటనలు, ప్రతిపాదనలు మదుపరులను తీవ్ర నిరుత్సాహంలోకి నెట్టిన సంగతీ విదితమే. అయితే కొనసాగిన విదేశీ మదుపరుల పెట్టుబడులతో సోమవారం నుంచి మార్కెట్ మళ్లీ లాభాలను సంతరించుకోగా.. మంగళవారం భారీ లాభాల దిశగా పయనించింది. దేశీయ మదుపరుల్లోనూ ధైర్యం వచ్చింది.

**ఆకట్టుకున్న బడా సంస్థల షేర్లు**

బడా కంపెనీల షేర్లు మదుపరులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, హీరో మోటోకార్ప్, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, టైటాన్ వంటి ప్రముఖ సంస్థల షేర్ల విలువ మంగళవారం ట్రేడింగ్‌లో పెరిగింది. దీంతో మిగతా షేర్లపైనా ఈ సానుకూల ప్రభావం కనిపించింది.

# నష్టాల్లోకి ఎయిర్‌టెల్

క్యూ3లో రూ.1,035 కోట్ల నష్టం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** టెలికం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ నష్టాల పరంపర కొనసాగుతున్నది. డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.1,035 కోట్ల నష్టం వచ్చినట్లు ప్రకటించింది. ఏడాది క్రితం ఇది రూ.86 కోట్ల లాభాన్ని గడించింది. గత త్రైమాసికంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 8.5 శాతం ఎగబాకి రూ.21,947 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. గతేడాది చివర్లో చార్జీలు పెరుగడం మంచి పరిణామమని, దీంతో టెలికం సంస్థలు ఆర్థికంగా నిలదిక్కుకోవడానికి దోహదం చేయనున్నదని, మరోదఫా ధరలు పెంచాల్సిన అవసరం ఉన్నదని భారతీ ఎయిర్‌టెల్ ఇండియా ఎండీ, సీఈవో గోపాల్ విఠల్ తెలిపారు. టెలికం రంగంలో వస్తున్న టెక్నాలజీ మార్పులకు అనుగుణంగా నూతన టెక్నాలజీని ఆపాదించుకోవాలంటే మరిన్ని పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉన్నదని, దీంతో ధరలు మరో దఫా పెంచకతప్పదని ఆయన సంకేతాలిచ్చారు. గత త్రైమాసికంలో భారత్‌లో టెలికం సేవలు అందించడం ద్వారా రూ.15,797 కోట్ల ఆదాయం ఆదాయం సమకూరింది. 2018-19 ఏడాది ఇదే సమయంలో వచ్చిన ఆదాయంతో పోలిస్తే ఏడు శాతం అధికం. సెప్టెంబర్ 30తో ముగిసిన త్రైమాసికంలో సంస్థ రూ.23,045 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. పాత బకాయిలు చెల్లించాలని సుప్రీం కోర్టు ఆదేశాలతో సంస్థ ఒకేసారి రూ.28,450 కోట్లను కేంద్రానికి చెల్లించింది. ఇందుకోసం తీసుకున్న రుణాలపై వడ్డీల రూపంలో అధికంగా చెల్లించడంతో లాభాల్లో గండిపడిందని విఠల్ చెప్పారు. మొబైల్ డాటా వాడకంలో వృద్ధి 73 శాతం నమోదవగా, వీరిలో 4జీ డాటా వినియోగదారులు 60.6 శాతం ఎగిసి 12.38 కోట్లకు చేరుకున్నారు. గత త్రైమాసికంలో కొత్తగా 2.1 కోట్ల మంది 4జీ సబ్‌స్క్రైబర్లు ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌ను ఎంచుకున్నారు. ఒక్కో వినియోగదారుడు నుంచి సరాసరి ఆదాయం రూ.128 నుంచి రూ.135కి పెరిగినట్లు ఆయన చెప్పారు.

## పీఎన్‌బీ నష్టం రూ.492 కోట్లు

**ప్రభుత్వరంగ** సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) ఆర్థిక ఫలితాలకు మొండి బకాయిల సెగ గట్టిగానే తగిలింది. ఎన్‌పీఏలను పూడ్చుకోవడానికి అధికంగా నిధులు కేటాయించడంతో గత త్రైమాసికానికిగాను రూ.492. 28 కోట్ల నష్టం సంభవించినట్లు బ్యాంక్ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో బ్యాంక్ రూ.246.51 కోట్ల లాభాన్ని గడించింది. సెప్టెంబర్ త్రైమాసికంలోనూ రూ.507.05 కోట్ల లాభాన్ని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.14,854.24 కోట్ల నుంచి రూ.15,967.49 కోట్లకు ఎగబాకినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.4,445.36 కోట్ల నిధులను వెచ్చించింది. 2018-19 ఏడాది ఇదే సమయంలో కేటాయించిన రూ.2,565.77 కోట్లతో పోలిస్తే ఇంచుమించు రెండు రెట్ల వరకు పెరుగడం వల్లనే లాభాల్లో గండిపడిందని బ్యాంక్ వర్గాల వెల్లడించాయి. సమీకృత విషయానికి వస్తే రూ. 16,211. 24 కోట్ల ఆదాయంపై రూ.501.93 కోట్ల నష్టం వచ్చింది. ఐదు అనుబంధ సంస్థలు కలుపుకొని పీఎన్‌బీ ఆర్థిక ఫలితాలను విడుదల చేసింది. గత త్రైమాసికంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ(ఎన్‌పీఏ) 16.30 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ కూడా 8.22 శాతం నుంచి 7.18 శాతానికి దిగొచ్చాయి. స్థూల నిరర్థక ఆస్తుల విలువ రూ.76,809.20 కోట్లుగా ఉండగా, నికర ఎన్‌పీఏ రూ. 30,518.92 కోట్లుగా ఉన్నాయి. ఢిల్లీ కేంద్రస్థానంగా ఆర్థిక సేవలు అందిస్తున్న బ్యాంక్ రూ.11,335.90 కోట్ల నష్టాన్ని ప్రకటించింది.

## టీవీఎస్ లాభాల్లో క్షీణత

ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటర్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.157 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో వచ్చిన రూ.197.79 కోట్ల లాభంతో పోలిస్తే 21 శాతం క్షీణించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ. 5,123.50 కోట్ల నుంచి రూ.4,779. 32 కోట్లకు పడిపోయింది. డిసెంబర్ 2018 త్రైమాసికంలో 9.5 లక్షల వాహనాలను విక్రయించిన సంస్థ..గత త్రైమాసికంలో మాత్రం 7.73 లక్షల యూనిట్ల అమ్మకాలు జరిపింది. వీటిలో 3.25 లక్షల మోటార్‌సైకిళ్లు ఉండగా, 2.8 లక్షల యూనిట్ల స్కూటర్లు ఉన్నాయి.



## మార్కెట్లోకి పోకో ఎక్స్2

ప్రారంభ ధర రూ.15,999

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** దేశీయ మొబైల్ మార్కెట్లోకి పోకో ఎక్స్2 మొబైల్‌ను విడుదల చేస్తున్నట్లు పోకో ఇండియా ప్రకటించింది. మూడు రకాల్లో లభించనున్న ఈ స్మార్ట్‌ఫోన్ ప్రారంభ ధరను రూ.15,999గా నిర్ణయించింది. 6.67 అంగుళాల టచ్‌స్క్రీన్ కలిగిన ఈ స్మార్ట్‌ఫోన్‌లో 64+8+2+2 మెగాపిక్సెల్ కెమెరా, ముందుభాగంలో 20+2 మెగాపిక్సెల్ కెమెరాలు, ఆక్టాకోర్ క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ ఆపరేటింగ్ సిస్టమ్, 4500 ఎంఏహెచ్ బ్యాటరీ, 6జీబీ ర్యామ్, 256 జీబీ వరకు మెమరీ కలిగిన ఈ స్మార్ట్‌ఫోన్లు రూ.15,999 నుంచి రూ.19,999 లోపు లభించనున్నాయి. వీటిలో 6జీబీ+64జీబీ, 6జీబీ+128జీబీ, 8జీబీ+256జీబీ మెమొరీలో ఉన్నాయి. ఈ నెల 11 నుంచి ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌లో మాత్రమే ఈ మొబైళ్లు లభించనున్నాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

పన్ను భయాలు

## రూపుమాపడం అసాధ్యమే!

బడ్జెట్‌పై ఆస్కి, ఫిక్కీ విశ్లేషణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పన్ను భయాలను రూపుమాపుతానని ప్రధాని నరేంద్ర మోదీ గతంలో అన్నారని, కానీ ప్రస్తుతం అది సాధ్యమయ్యేలా కనబడటం లేదని ఆస్కి, ఫిక్కీ నిపుణుల కమిటీ అభిప్రాయపడింది. మంగళవారం బంజారాహిల్స్‌లోని ఆస్కి ఆడిటోరియంలో ఫిక్కీ, ఆస్కీలు కలిసి '2020-21 బడ్జెట్ పై విశ్లేషణ'ను నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న నిపుణులు, మేధావులు మాట్లాడుతూ.. బడ్జెట్‌లో కొత్తగా ప్రతిపాదించిన పన్ను విధానంలో వ్యక్తిగతంగా పన్నులు చెల్లించేవారికి పెద్దగా ప్రయోజనం లేకుండా చేశారని అభిప్రాయపడ్డారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రుణలభ్యతను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశంలో అతిపెద్ద లిటిగేటర్ ట్యాక్స్ డిపార్టుమెంట్‌గా నిపుణుల బృంద సభ్యులు అభివర్ణించారు. ఈ విభాగానికి ప్రతిఏటా టార్గెట్లను నిర్దేశించడం వల్ల లేనిపోని సమస్యల్ని సృష్టిస్తున్నారని తెలిపారు. పన్నులను కట్టనివారిని వదిలేసి పన్నులను సక్రమంగా కట్టేవారి మీద పడుతున్నారని చెప్పారు. ప్రతి సంస్థకో సంఘం ఉన్నట్లే.. పన్నులు చెల్లించేవారు సంఘంగా ఏర్పడాలన్నారు.

**అంబుడ్స్‌మన్‌ను నియమించాలి..**

అమెరికా, యూకే వంటి దేశాల్లో పోలీసు కంప్లయింట్ కమిషన్ ఉన్నట్లే.. ఆదాయ పన్ను విభాగంలో ప్రత్యేకంగా అంబుడ్స్‌మన్ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని నిపుణుల బృందం అభిప్రాయపడింది. అప్పుడే ఆదాయ పన్ను అధికారుల వేధింపులు గణనీయంగా తగ్గుతాయని విశ్లేషించారు. మనదేశంలో 67 ఏండ్లు దాటినవారు కాకుండా 25 నుంచి 45 ఏండ్ల యువకులు భారత నూతన విద్యావిధానాన్ని రూపొందించాలని సూచించారు.

## గతి నష్టం 5 లక్షలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 4:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ. 5.15 లక్షల కన్సాలిడేటెడ్ నష్టాన్ని నమోదు చేసుకున్నది గతి లిమిటెడ్. 2018-19 ఏడాది ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.4.21 కోట్ల నష్టాన్ని చవిచూసింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.483.05 కోట్ల నుంచి రూ.447.70 కోట్లకు పడిపోయినట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది.


సార్వత్రిక బడ్జెట్‌పై భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కరచాలనం చేస్తున్న సీఐఐ ప్రెసిడెంట్ విక్రమ్ కిర్లోస్కర్. చిత్రంలో డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ




## ఎల్ఐసీని ప్రైవేటుపరం కానివ్వం!

వాటా విక్రయాన్ని నిరసిస్తూ లక్ష మంది ఉద్యోగుల ఆందోళన

**న్యూఢిల్లీ/ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ :** ఎల్ఐసీ ను కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా లక్షమంది ఉద్యోగులు నిరసన బాటపట్టారు. మంగళవారం సైఫాబాద్‌లోని సౌత్ సెంట్రల్ జోనల్ కార్యాలయం ముందు ఉద్యోగులు భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు రమేశ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాలను విడనాడాలని, కోట్లలో లాభాలు వస్తున్న కంపెనీలో ప్రైవేట్ పెట్టుబడులకు అనుమతివ్వడాన్ని తప్పుపడుతున్నట్లు చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఎల్ఐసీ వెన్నుముకలాంటిదని, ఇలాంటి సంస్థను ప్రైవేట్ పరం చేయడాని నిరసిస్తూ త్వరలో పార్లమెంట్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. రూ.32 లక్షల కోట్ల నికర ఆస్తులు కలిగి ఉన్న జీవిత బీమా సంస్థను నిర్వీర్యం చేయడానికి కుట్ర జరుగుతుందని వారు ఆరోపించారు. ఎల్ఐసీలో 1.25 లక్షల మంది ఉద్యోగులు, 30 కోట్ల మంది పాలసీ హోల్డర్లు అందరూ కలిసి ఈ కుట్రను తిప్పికొట్టాలని ఆయన కోరారు. కేంద్రప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకపోతే దేశ రాజధానిలో భారీ ప్రదర్శనతో ఛలో పార్లమెంట్ కార్యక్రమానికి పిలుపునిస్తామని వారు హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
బుధవారం 5 ఫిబ్రవరి 2020 WWW. NTNEWS.COM /nt.zindagi

మేడారం.. రెండేండ్లకోసారి జరిగే జాతర.
అడవి తల్లులను చూసేందుకు కోట్లాది జనాలతో
ఆ కీకారణ్యం మహానగరంగా మారుతుంది.
నిన్నా మొన్నటివరకు ఒకెత్తు.
ఇయ్యాల్టి నుంచి మరోఎత్తు.
ఈ నాలుగు రోజులే జాతరకు వైభవాన్ని తీసుకొస్తాయి.
ఈ నాలుగు రోజులే సమ్మక్క-సారలమ్మ జాతరను
ప్రపంచానికి తీసుకెళ్తాయి.

ఈ నాలుగు రోజులంతా ఉద్వేగం.. ఉత్కంఠభరితమే.
ఎదుర్కోళ్లు.. ఎత్తు బంగారాలు.. జంతు బలులు..
జలాకాలాటలు.. కేశఖండనలు.. గుడారాలు..
గుంపు భోజనాలు.. శివసత్తుల పూనకాలతో వనమంతా
మార్మోగుతుంది.
కోటిన్నర మంది తల్లిచెంతకు తరలివచ్చే మేడారం
జాతరలో గూడెపు సంప్రదాయాలు.. ఆచార వ్యవహారాలు
ప్రతిబింబిస్తాయి. నేటి నుంచి 8వరకు
అత్యంత గొప్పంగా నిర్వహించే నాలుగురోజుల
ఆదివాసీ పూజావిధానం ప్రత్యేకత ఏమిటో
తెలుసుకుందాం.



# వనదేవతల సాక్షిగా.. ఆ నాలుగు రోజులు!

**మొదటి రోజు సారలమ్మ రాక**

సమ్మక్క కూతురైన సారలమ్మ నివాసం కన్నెపల్లి. మేడారం గద్దెలకు మూడుకిలోమీటర్ల దూరంలోని ఈ గ్రామంలో చిన్న దేవాలయంలో సారలమ్మ కొలువై ఉంది. ఫిబ్రవరి 5వ తేదీ ఉదయం పూజారులు రెండుగంటలపాటు గోప్యంగా పూజాధికారాలు నిర్వహిస్తారు. కడుపు పండాలని కోరుకునేవారు, అవివాహితులు, దీర్ఘకాలిక రుగ్మతలతో బాధపడుతున్న వారు వందలాదిమంది జంపన్నవాగులో స్నానం చేసి తడిబట్టలతో గుడి ఎదుట సాష్టాంగ నమస్కారాలతో తల్లికి వరం పడుతారు. దేవతారూపాన్ని చేతబట్టుకుని బయటకు వచ్చిన పూజారులు సాష్టాంగనమస్కారాలతో వరంపడుతూ పడుకున్నవారిపైనుంచి నడిచివెళ్తారు. సారలమ్మే తమపైనుంచి వెళ్తున్న అనుభూతితో భక్తులు తరించిపోతారు. ఉత్సవకమిటీ, ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం తమ హోదాలను మరిచి సారలమ్మను మోస్తున్న పూజారిని తమపైనుంచి నడిపించుకుంటారు. గ్రామ మహిళలు మంగళహారతులిచ్చి, కొబ్బరికాయలతో పూజలు చేసి, సారలమ్మను మేడారానికి సాగనంపుతారు. తల్లిని తాకాలనే ఉత్సాహంతో ఎగబడే భక్తుల్ని నిలువరించేందుకు, తొక్కిసలాట జరగకుండా చూసేందుకు వందల సంఖ్యలో రోప్ పార్టీ, పోలీసులు వలయంగా ఏర్పడి రక్షణ కల్పిస్తారు. జిల్లా ఉన్నతాధికారులు స్వయంగా ఈ రక్షణ ఏర్పాట్లలో పాల్గొంటారు. అక్కడినుంచి సారలమ్మను తీసుకుని బయల్దేరిన పూజారులు జంపన్నవాగు గుండానేరుగా మేడారంలోని గద్దెల వద్దకు తీసుకొస్తారు. సారలమ్మ జంపన్నవాగు దాటుతున్న క్షణాన వాగులో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు రెండుచేతులు పైకెత్తి అమ్మవారికి స్వాగతం పలుకుతారు. భక్తిపారవశ్యంలో ఓలలాడుతారు. తడిబట్టలతో శివసత్తులు పూనకాలతో ఊగిపోతారు. కొండాయినుంచి గోవిందరాజు, పూనుగొండ నుంచి పగిడిద్దరాజు అప్పటికే సమ్మక్క సన్నిధికి చేరుకోగా, సారలమ్మతో సహా ఈ ముగ్గురికి పూజారులు పూజలు నిర్వహిస్తారు. పూజల అనంతరం దేవతలను వారివారి గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. గద్దెపై ఆసీనురాలైన సారలమ్మ తల్లి సమ్మక్కకు ఆహ్వానం పలికేందుకు సిద్ధమై భక్తులకు దర్శనమిస్తుంది.

**రెండో రోజు సమ్మక్క..**

జాతర రెండో రోజు అధికార లాంఛనాలతో సమ్మక్కకు స్వాగతం లభిస్తుంది. పోలీసు అధికారుల తుపాకీ కాల్పుల గౌరవవందనం, ఎదురుకోళ్ల ఘట్టంతో భక్తులు సమ్మక్కను ఆహ్వానిస్తారు. రెండవరోజైన ఫిబ్రవరి6న ఉదయమే పూజారులు వనానికి వెళ్లి వెదురుకర్రలు తెచ్చి గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. అనంతరం సమ్మక్క పూజామందిరం నుంచి వడరాలు, పసిడికుండలను తెచ్చి గద్దెలపై నెలకొల్పుతారు. పోలీసు భద్రత మధ్య పూజారులు సమ్మక్క ఆలయానికి చేరుకుంటారు. మేడారానికి ఈశాన్యాన చిలుకలగుట్టపై నారచెట్టుకింద ఉన్న కుంకుమభరిణ రూపంలోని సమ్మక్కను తెచ్చేందుకు పూజారులు బయల్దేరుతారు. ఈ సమయంలో ఉద్విగ్న వాతావరణం నెలకొంటుంది. జాతర మొత్తానికి ప్రధాన దేవత అయిన సమ్మక్క రాక కోసం ఎదురుచూస్తున్న లక్షలాదిమంది భక్తులు చిలుకలగుట్ట సమీపంలో పోగవుతారు. తల్లిని కనులారా చూడాలని తపించిపోతారు. ప్రాణాలకు తెగించి సాహసానికి ఒడిగడతారు. ఎలాగైనా మహిమాన్విత కుంకుమభరిణెను తాకేందుకు ప్రయత్నిస్తారు. ఎత్తయిన ప్రదేశాలు, చెట్ల చిటారుకొమ్మలెక్కి తల్లిరాకకోసం ఎదురుచూస్తారు.



ప్రధాన పూజారి ఒక్కరే చిన్న కాలిబాటన నడుచుకుంటూ చిలుకలగుట్టపైకి వెళ్తాడు. అక్కడ రహస్య ప్రదేశంలో నిక్షిప్తమై ఉన్న సమ్మక్క వద్ద సుమారు మూడుగంటలపాటు అతిరహస్యంగా పూజలు నిర్వహిస్తారు. పూజారిపై దేవత పూనగా కుంకుమభరిణె తీసుకుని అతివేగంగా కిందకు దిగుతాడు. గుట్ట ప్రారంభంలో అక్కడ వందల మంది పోలీసులు రక్షణగా నిలబడతారు. సమ్మక్క ఆగమన సూచకంగా జిల్లా ఎస్పీ గాల్లోకి మూడుసార్లు కాల్పులు జరిపి స్వాగతిస్తారు. అంతే.. తుపాకీ శబ్దం విన్న మరుక్షణమే భక్తజనం ఉద్రూతలూగుతుంది. సమ్మక్కకు స్వాగతం చెబుతూ జాతర అంతా బలులు ప్రారంభమవుతాయి. అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న భక్తుల్లో దేవుడు పూనిన శివసత్తులు ఊగిపోతారు. నలుదిశలూ పిక్కటిల్లే జయజయధ్వానాలతో మేడారం దద్దరిల్లుతుంది. గద్దెల వద్దే సమ్మక్కకు ఎదురుకోళ్లతో స్వాగతంపలుకుతారు. కోళ్లను అక్కడికక్కడే బలి ఇస్తారు. దేవతను పట్టుకున్న పూజారిని తాకేందుకు ప్రయత్నించే భక్తులను నివారించడం పోలీసులకు పెద్ద సవాలుగా మారుతుంది. వందలాదిమంది పోలీసులు రోప్‌పార్టీగా ఏర్పడి జనాన్ని నివారించేందుకు శక్తికి మించి శ్రమిస్తారు. మొదట పాముపుట్ట వద్ద, తర్వాత సమ్మక్క గుడిలో ప్రత్యేక పూజల తర్వాత దేవతను కట్టుదిట్టమైన భద్రత మధ్య గద్దెపైకి చేర్చుతారు. మాఘశుద్ధ పౌర్ణమి ఘడియలు ప్రవేశించగా లాంఛనంగా జాతర ప్రారంభమవుతుంది. తల్లీ బిడ్డలను దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాదిమంది భక్తులు బారులు తీరుతారు.

**మూడో రోజు దర్శనం..**

గద్దెలపై ఆసీనులైన సమ్మక్క, సారలమ్మలు మూడో రోజు అశేష జనావళికి దర్శనమిస్తారు. జంపన్నవాగులో పుణ్యస్నానాల అనంతరం భక్తులు తల్లులను దర్శించుకుంటారు. కోర్కెలు తీర్చమని కోరుతూ కానుకలు, మొక్కులు సమర్పించుకుంటారు. నిలువుదోపిడీ ఇస్తారు. తలనీలాలు, తులాభారాలు జరిపిస్తారు. ఆడపడుచులుగా భావించిన తల్లులకు మహిళలు ఒడిబియ్యం పోసి కొలుచుకుంటారు. చీరసారెలు పెట్టి పూజిస్తారు. కట్టలు తెంచుకున్న భక్తితో ఉరకలెత్తుతున్న భక్తజనంతో మేడారం పరిసరాలు కిటకిటలాడతాయి. ఈ రోజంతా భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దర్శనానికి వచ్చిన లక్షలాదిమందితో గద్దెల ప్రాంగణాలు జన సముద్రమవుతాయి.

**నాలుగో రోజు వనప్రవేశం..**

సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన బిడ్డలకు దర్శనమిచ్చిన సమ్మక్క, సారలమ్మలు నాలుగో రోజు తిరిగి వనప్రవేశం చేస్తారు. దీంతో జాతర ముగిసిపోతుంది. దేవతలను గద్దెలకు చేర్చేక్రమంలో పోలీసులు ఏవిధమైన రక్షణ కల్పిస్తారో, అంతే కట్టుదిట్టమైన రక్షణ మధ్య దేవతలను సాగనంపుతారు. దేవతలు వనప్రవేశం చేసిన అనంతరం గుండెలనిండా నింపుకున్న దైవత్వంతో భక్తులు తిరుగుప్రయాణమవుతారు. మరిచిపోని మధురానుభూతలను నెమరేసుకుంటూ ఇళ్లకు పయనమవుతారు. దీంతో అప్పటివరకు జన సంద్రంగా ఉన్న మేడారం ఒక్కసారిగా నిర్మానుష్యమవుతుంది.

...✍ నూర శ్రీనివాస్, గుజ్జ సారేశ్వర్‌రావు

## రవివర్మ చిత్రాల ఫొటోగ్రాఫర్



**ప్రముఖ నటి సుహాసినీ మణిరత్నం స్థాపించిన 'నామ్' స్వచ్ఛంద సంస్థ క్యాలెండర్ ఫొటోలు ఇప్పుడు చాలామందిని ఆకట్టుకుంటున్నాయి. రవివర్మ చిత్రలేఖనాలను ప్రస్తుత సౌత్ ఇండియా నటీమణులతో ఆ క్యాలెండర్ కోసం రిక్రియేషన్ ఫొటోషూట్ చేశారు. ఆ ఫొటోలు తీసింది చెన్నైకి చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ 'వెంకట్ రామ్'.**



రవివర్మ పెయింటింగ్స్‌ను అచ్చంగా ఫొటోషూట్ చేసిన ఘనత 'వెంకట్‌రామ్'కు దక్కింది. చెన్నయ్‌లో ఆయన కమర్షియల్, సెలబ్రిటీ ఫొటోగ్రాఫర్. 25 సంవత్సరాల నుంచి ఆయన ఫొటోగ్రఫీ రంగంలో ఉన్నారు. చెన్నయ్‌లోని జార్జిటౌన్‌లో ఆయన చారిత్రాత్మక కట్టడాలను చూస్తూ పెరిగారు. ఒక రకంగా అవే ఆయనను ఫొటోగ్రఫీపై ఆసక్తిని పెంచాయి. ఈ రంగంలోకి వచ్చిన తర్వాత ఆయన ఆ కట్టడాలను ఊహించుకొని పని చేశారు. అనుభవం సాధించారు. ప్రస్తుతం పబ్లిషింగ్ కంపెనీలకు, మ్యాగజైన్లకు ఆయన పని చేస్తున్నారు. వందకు పైగా చిత్రాలకు ప్రమోషనల్ ఫొటోషూట్‌లు చేశారు. ఆయన ఫొటోలు తీయడంలో పరిపూర్ణత కోసం కృషి చేస్తాడు. ప్రతి ఫ్రేమ్‌ను కంపోజ్ చేయడంలో శ్రద్ధ వహిస్తాడు. అనేక దిగ్గజ కంపెనీల కోసం ఫొటోగ్రఫీ అందించాడు. వాటిలో రిబాక్, క్యాడ్‌బరీ, పెప్సీ, మిరిండా, కోకొకోలా, ఎయిర్‌టెల్, శామ్‌సంగ్ ఇట్లా ఎన్నో కంపెనీలకు ప్రమోషన్ వర్క్ నిర్వహించారు. కన్నాతిల్, ముథమిట్టల్, గజిని, శివాజీ, విశ్వరూపం లాంటి సినిమాలకూ పని చేశారు. ఎప్పటికప్పుడూ మారుతున్న ట్రెండ్‌ను, రోజూ వారి కొత్త ప్రపంచాన్ని గుర్తించడంలో వెంకట్ రామ్ ఆసక్తి చూపుతారు. ప్రపంచాన్ని అందంగా చూసినప్పుడే అందమైన ఫొటోలను తీయగలరు.. అలాంటి పనిలో వెంకట్ రామ్ ఎంతోప్రతిభావంతుడు.

## బాదం తింటే ఆరోగ్యం బాగుంటుంది!

**బాదం తింటే మంచిదని అందరికీ తెలుసు. అయితే బాదం పప్పుల్ని నేరుగా తినాలా? నానబెట్టుకు తినాలా అనే విషయంలో చాలా మందికి కొన్ని అపోహలున్నాయి. అందులోని పోషకాలు, ఎలా తింటే మంచిదో తెలుసుకోండి.**



- నానబెట్టిన బాదంపప్పులు జీర్ణశక్తికి అవసరమైన ఎంజైమ్‌లను విడుదల చేస్తాయి. లైపేజ్ అనే ఎంజైమ్ విడుదల వల్ల కొవ్వు కరిగిపోతుంది. బాదంలోని విటమిన్-ఇ ఫ్రీరాడికల్స్ నుంచి చర్మకణాలను రక్షించడంతో వృద్ధాప్యాన్ని అడ్డుకుంటుంది.
- వీటిలోని మోనో అన్‌శాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు ఆకలిని తగ్గించి పొట్టనిండిన అనుభూతిని కలిగిస్తాయి. ఇలా బరువు నియంత్రణకు తోడ్పడుతాయి.
- నానబెట్టిన బాదంలో విటమిన్ బి 17 సమృద్ధిగా ఉంటుంది. ఇది క్యాన్సర్ కణాలతోనూ పోరాడుతుంది. ఇందులోని ఫ్లేవనాయిడ్లు కంతుల పెరుగుదలనూ అడ్డుకుంటాయి. బీపీని తగ్గిస్తాయి. ఫోలిక్ ఆమ్లం పుట్టబోయే శిశువు ఎదుగుదలకు తోడ్పడుతుంది.
- పిల్లలకు రోజూ రెండు లేదా మూడు బాదం గింజల్ని రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే తినిపిస్తే వారిలో జ్ఞాపకశక్తి పెరిగే అవకాశం ఉంటుంది. అల్జీమర్స్ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో బాదం గింజలు బాగా పనిచేస్తాయి. నానబెట్టిన నీటిని పారబోయకుండా తాగితే మంచిది. దీని ద్వారా రోగనిరోధక శక్తి పెరిగే అవకాశం ఉన్నది.
- అతి ఎప్పటికైనా అనర్థాన్ని తీసుకొస్తుంది. అలాగే బాదం కూడా పరిమితికి మించి తినొద్దంటున్నారు వైద్యులు. అధికంగా బాదం తీసుకుంటే అతిసారం, తలతిరగడం, మూత్రపిండాల్లో రాళ్లు, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది.

## వంటింటి చిట్కాలు

- వడలు మెత్తగా, మృదువుగా ఉండాలంటే.. మినుప పప్పు గ్రైండ్ చేసిన తర్వాత పదినిమిషాల పాటు ఫ్రిజ్‌లో ఉంచితే సరి.
- కూరల్లో పసుపు వాసన అధికంగా రాకుండా ఉండాలంటే.. పోపులో ఉల్లిముక్కలువేగిన తర్వాత పసుపు పూయాలి.
- ఉదయం టిఫిన్‌కు వడ చేయాలనుకుంటే.. అర్ధరాత్రి తర్వాత మినుపపప్పు నానబెట్టుకుంటే పిండి మెదుపు వస్తుంది.
- ప్రతిసారి వేడి చేయడంకంటే.. ఫ్లాస్క్‌లో పోసి పెట్టుకోవడం మంచిది. ఎక్కువసేపు వేడిగా ఉంటుంది.
- పప్పు కూర రుచిగా ఉండాలంటే.. కందిపప్పు ఉడికించేటప్పుడు టమాటా, పచ్చిమిర్చి, పసుపుతో పాటు, ఒక చిన్న ఉల్లిగడ్డ వేసుకుంటే బాగుంటుంది.

## మొక్కల మొదళ్లలో చీమలా?

**మొక్కల కుండీల్లో చీమలు చేరడం సహజం. కానీ అలాగే చూస్తూ ఊరుకుంటే చీమలు పుట్టలు పెడతాయి. మొక్కల పాదులో తేమను లేకుండా చేస్తాయి. తద్వారా మొక్కలు ఎండిపోయే అవకాశం ఉంటుంది. ఈ సమస్యకు పరిష్కారం ఏంటంటే..**



- పసుపునీటి మిశ్రమాన్ని మొక్కల మొదల్లలో చీమలు గూళ్లు తయారు చేసుకునే స్థలంలో పోయాలి. ఇలా ఉదయం సాయంత్రం పోస్తే చాలు చీమలు మకాం మారుస్తాయి.
- మొక్కలకు పురుగు పడితే వేప గాని ఆవాల చూర్ణాన్ని నీళ్లలో కలిపి మొక్కలపై చిలకరించితే చాలు తక్షణమే పురుగు చనిపోతుంది.
- వాడిన టీపొడిని పడేస్తుంటాం. దాన్ని మందార మొక్కల కుదుళ్ల దగ్గర వేస్తే మొక్క బలపడుతుంది. ఎక్కువ పూలు పూచే అవకాశం ఉంటుంది.
- తులసి మొక్కకు పురుగు పడితే మొక్క మొదళ్లలో ఒక ఉల్లిగడ్డ గుచ్చాలి.
- మొక్కల పాదుల్లో నీరు నిలిచినప్పుడు ఈగలు, దోమలు వాలుతుంటాయి. ఉల్లిపాయలు కడిగిన నీటిని మొక్కలకు పోస్తే దోమలు రావు.
- గడువు ముగిసిన ట్యాబ్లెట్లు, టానిక్‌లు మొక్కలకు వేస్తే ఏపుగా పెరుగుతాయి.

## సొట్టబుగ్గలు ఇలా మీ సొంతం



- సెల్ఫీలు, ఫొటోలు తీసుకునేటప్పుడు టెంపరరీగా సొట్టబుగ్గలు కావాలంటే వేలితో కానీ, పెన్సిల్‌తో కానీ బుగ్గ మీద ఓ అయిదు నిమిషాలు నొక్కి ఉంచితే బుగ్గలు టెంపరరీగా సొట్టపడతాయి.
- మేకప్ వేసుకునేటప్పుడు ఓ చిన్న చిట్కా పాటించినా బుగ్గలమీద సొట్ట ఉన్నట్లు కనిపిస్తుంది. దానికోసం నవ్వేటప్పుడు మడతపడే చోట మన స్కిన్ రంగు కంటే కాస్త తక్కువ రంగు ఫౌండేషన్‌ను గుండ్రంగా అప్లై చేయాలి.
- లిప్ స్టిక్ వేసుకోవడం చాలా తేలికైన పని కానీ చాలామంది పెదవులు లిప్‌స్టిక్ వేసుకున్నప్పటికీ ఎండిపోయినట్లుగా కనిపిస్తాయి. దీన్ని నివారించాలంటే ముందుగా పెదవులపై ఉన్న పొడితత్వాన్ని పోగొట్టాలి. ఇందుకు వారానికి రెండు సార్లు తేనె, పంచదార కలిపిన మిశ్రమాన్ని పెదవులకు రాసి రబ్ చేస్తే సాఫ్ట్‌గా తయారవుతాయి.
- రోజ్‌వాటర్, గ్లిజరిన్ సమపాళ్లలో తీసుకొని దానిలో దూది ముంచి పెదాలకు రాసి పదిహేను నిమిషాలు ఆరనిచ్చి కడిగేయాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి నెల రోజులు చేస్తే చాలు పెదాలు మృదువుగా మారిపోతాయి.
- అరటిపండు, పాలు, తేనె కలిపి మెత్తగా చేయాలి. దీనిలో కాస్త రోజ్ వాటర్ కూడా కలపాలి. దీంతో ముఖం, మెడ, కాళ్లు, చేతులకు రుద్ది కడిగేయాలి. వారానికోసారి ఇలా చేస్తే చర్మానికి ఎండ తగిలినా చర్మం పాడవదు.

# పరిశ్రమ అభివృద్ధిపై భేటీ


నాగార్జున, తలసాని శ్రీనివాస్ యాదవ్, చిరంజీవి


నాగార్జున, శ్రీనివాస్ యాదవ్, రామ్మోహన్ రావు తదితరులు

**ము**ఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం సీనియర్ హీరోలు చిరంజీవి, నాగార్జునలతో భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో చలనచిత్ర పరిశ్రమకు సంబంధించిన పలు అంశాలను చర్చించారు. ఆన్‌లైన్ టికెటింగ్ విధానం అమలుతో పాటు టికెట్ల ధరల సరళీకృత విధానంపై ముచ్చటించారు. శంషాబాద్ సమీపంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని హీరోలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. 24 విభాగాల కార్మికులు, సాంకేతిక నిపుణుల నైపుణ్యాన్ని మరింత పెంపొందించేందుకు శిక్షణకేంద్రాన్ని ఏర్పాటుచేయాల్సిన ఆవశ్యకత గురించి చర్చించారు. సినీ కార్మికులు, కళాకారుల కోసం కల్చరల్ సెంటర్ ఏర్పాటుకు జూబ్లీహిల్స్‌లో రెండు ఎకరాల స్థలం కేటాయించాలని ప్రతిపాదించారు. సినీ అవార్డుల ప్రదానం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సినీ కార్మికులకు వర్తింపచేయాలని చర్చించారు. సినిమా షూటింగ్‌కు ముందే ఎఫ్‌డీసీలో రిజిస్టర్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ నెల రెండవ వారంలో సినీ రంగ ప్రముఖులు, సంబంధిత అధికారులతో సమావేశమై అనేక సమస్యలపై కూలంకషంగా చర్చించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎఫ్‌డీసీ చైర్మన్ రామ్మోహన్‌రావు, నిర్మాత నిరంజన్‌రెడ్డి, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్


అఖిల్

**అ**ఖిల్ అక్కినేని కథానాయకుడిగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రానికి 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. పూజాహెగ్డే కథానాయిక. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్ పతాకంపై బన్నీ వాసు, వాసు వర్మ నిర్మిస్తున్నారు. 'యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. కథానుగుణంగా టైటిల్ కుదిరింది. అఖిల్ పాత్ర చిత్రణ గత చిత్రాల కంటే భిన్నంగా నవ్యరీతిలో సాగుతుంది. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకుల్ని ఆకట్టుకునే అన్ని అంశాలుంటాయి' అని చిత్రబృందం తెలిపింది. ఈ సినిమాలో అఖిల్ ప్రవాస భారతీయుడిగా కనిపిస్తాడని, స్వదేశానికి వచ్చిన అతను ఓ ముద్దుగుమ్మలో ప్రేమలో పడితే ఏం జరిగింది? పెళ్లి విషయంలో పరస్పర విరుద్ధ భావాలు ఉన్న ఈ జంట ప్రయాణం ఎలా సాగిందన్నదే చిత్ర ఇతివృత్తమని సమాచారం. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను ఈ నెల 8న విడుదల చేయబోతున్నారు. ఆమని, మురళీ శర్మ, జయప్రకాష్, ప్రగతి, సుడిగాలి సుధీర్, గెటప్ శ్రీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ప్రదీప్ ఎమ్ వర్మ, సంగీతం: గోపీ సుందర్, దర్శకత్వం: బొమ్మరిల్లు భాస్కర్.


సునీల్ నారంగ్, శేఖర్ కమ్ముల, నాగచైతన్య

ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల మంగళ వారం జన్మదిన వేడుకల్ని జరుపుకున్నారు. ప్రస్తుతం ఆయన నాగచైతన్య, సాయిపల్లవి జంటగా 'లవ్‌స్టోరీ' చిత్రాన్ని రూపొందిస్తున్న విషయం తెలిసిందే. ఏమిగోస్ క్రియేషన్స్, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ పతాకాలపై నారాయణ్‌దాస్ కె నారంగ్, పి.రామ్మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిజామాబాద్, ఆర్మూర్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుగుతున్నది. షూటింగ్ లొకేషన్‌లోనే యూనిట్ సభ్యుల సమక్షంలో శేఖర్ కమ్ముల పుట్టిన రోజు వేడుకల్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకానాయికలు నాగచైతన్య, సాయిపల్లవి, నిర్మాత సునీల్ నారంగ్, భరత్ నారంగ్, అభిషేక్ నామా తదితరులు శేఖర్‌కమ్ములకు శుభాకాంక్షలందజేశారు. 'లవ్‌స్టోరీ' వేసవిలో ప్రేక్షకులముందుకు రానుంది. 'ఫిదా' వంటి అపూర్వ విజయం తర్వాత శేఖర్ కమ్ముల తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.

# ప్రతి ఒక్కరికి సవాలు


రాశీఖన్నా

**న**టనలో తాను ఎలాంటి శిక్షణ తీసుకోలేదని, పాత్రోచితమైన అభినయాన్ని ప్రదర్శించడానికి వందశాతం కృషి చేస్తానని చెబుతున్నది పంజాబీ ముద్దుగుమ్మ రాశీఖన్నా. 'కెరీర్ తొలినాళ్లలో సెట్స్‌లో స్వేచ్ఛగా ఉండేదాన్ని కాదు. మొహమాటం ఎక్కువగా ఉండేది. క్రమంగా నటనలో పరిణితి వచ్చింది. ఇప్పుడు దర్శకులు కోరుకున్న దానికంటే ఉత్తమమైన అభినయాన్ని కనబరచాలని ప్రయత్నిస్తున్నా' అని చెప్పింది రాశీఖన్నా. నటనాపరంగా కామెడీని పండించడం చాలా కష్టమని..ప్రతీ నాయికకు అదొక సవాలు వంటిదని పేర్కొంది. 'ఎమోషనల్ సన్నివేశాల్లో కంటే కామెడీ ద్వారా మెప్పించడం చాలా కష్టం. అయితే 'సుప్రీమ్' 'ప్రతిరోజు పండగే' చిత్రాలు నాలోని హాస్యాన్ని వెలికితీశాయి. నేను కామెడీ పాత్రల్ని కూడా సమర్థవంతంగా పోషించగలనని ఆ సినిమాలు నిరూపించాయి' అని చెప్పింది. గ్లామర్ పాత్రల గురించి మాట్లాడుతూ 'దర్శకులు గ్లామర్ కోణంలో నాయికల పాత్రల్ని డిజైన్ చేసినప్పుడు మేమేమి చేయగలం? విభిన్నమైన పాత్రల్ని సృష్టించే బాధ్యత దర్శకులదే. మంచి క్యారెక్టర్స్ వస్తే నా శాయశక్తుల న్యాయం చేయాలని తపిస్తాను' అని రాశీఖన్నా తెలిపింది.

# బోల్డ్‌నెస్‌కు అర్థమదే!

తన సినిమాలోని పాత్రలన్నీ నిజజీవితాల్లో నుంచి పుట్టినవేనని చెప్పింది శేషసింధురావు. ఆమె దర్శకురాలిగా పరిచయమైన చిత్రం 'చూసీచూడంగానే'. శివ కందుకూరి హీరోగా నటించారు. రాజ్ కందుకూరి నిర్మాత. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకువచ్చింది. మంగళ వారం హైదరాబాద్‌లో శేషసింధురావు పాత్రికేయులతో ముచ్చటించింది.


శేషసింధు రావు

స్నేహితుల లైఫ్‌లోని సంఘటనల్ని స్ఫూర్తిగా తీసుకొని ఈ కథ రాసుకున్నా. అమ్మాయిల్లో ఉండే చిన్న చిన్న భయాలు, లోపాల్ని కథానాయిక పాత్ర ద్వారా చెప్పిన విధానం బాగుందని అంటున్నారు.

**విభిన్నమైన జోనర్స్‌లో..**

స్ట్రాంగ్, బోల్డ్ అమ్మాయిలు అనగానే చాలా సినిమాల్లో మందు, సిగరెట్‌తాగే అలవాటున్న వారిగా చూపిస్తుంటారు. అది సరికాదు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కలిగి ఉండి స్వీయనిర్ణయాలు తీసుకోవడమే కాకుండా తమ భావాల్ని ధైర్యంగా వెల్లడించడమే బోల్డ్‌నెస్‌గా నమ్ముతాను. ఈ సినిమాలో కథానాయిక పాత్రను ఆ ధోరణితోనే చూపించాను. మహిళను కావడంతో సినిమాను తీయగలిగే సామర్థ్యముందా అని చాలా మంది ప్రశ్నించారు. కొందరు తమ మాట వినాలనే అభిప్రాయాల్ని వ్యక్తపరిచారు. అలాంటి ప్రశ్నలేవి అడగకుండా రాజ్ కందుకూరి సృజనాత్మకపరంగా నాకు పూర్తిస్వేచ్ఛనిస్తూ ఈ సినిమా చేశారు. తొలి సిట్టింగ్‌లోనే కథకు ఓకే చెప్పారు. గౌరవం లేని చోట నేను పనిచేయను. పరిశ్రమలో కించపరిచే సంఘటనలు నాకెప్పుడూ ఎదురవ్వలేదు. దర్శకురాలిగా విభిన్నమైన జోనర్స్‌లో సినిమాలు చేయాలన్నది నా అభిమతం.

**సి**నిమా చూసిన వారంతా బాగుందంటున్నారు. ఇండస్ట్రీ ప్రముఖులు ఫోన్ చేసి అభినందిస్తున్నారు. సినిమాల్ని అభిమానించే కుటుంబం మాది. మా సిస్టర్స్ ఇద్దరూ చిత్రసీమలోనే ఉన్నారు. కృష్ణం వందేజగద్గురుమ్, కుమారి 21ఎఫ్‌తో పాటు మరో మూడు సినిమాలకు పనిచేశాను. క్రిష్, సుకుమార్ వద్ద సినిమా రూపకల్పనలో మెళకువలను నేర్చుకున్నాను. సున్నితమైన కథాంశంతో తెరకెక్కిన ప్రేమకథా చిత్రమిది. క్యారెక్టరైజేషన్సను నమ్మి నా శైలిలో కొత్తగా తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేశాను. రొటీన్ ప్రేమకథలకు భిన్నంగా ఉందని చెబుతున్నారు. యువతరాన్ని ఆకట్టుకుంటున్నది. నా జీవితంతో పాటు

# మా స్నేహమే అఛీవ్‌మెంట్

**'నా**తో పాటు సుధీర్, రాంప్రసాద్ నటిస్తున్నారనే ధైర్యంతోనే ఈ సినిమా చేశాను. ముగ్గురం స్నేహితుల కలిసి చేసిన సినిమా అనే ఆనందం ఎక్కువగా ఉంది' అని అన్నారు గెటప్ శీను. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'త్రీ మంకీస్'. అనిల్‌కుమార్.జి దర్శకుడు. నగేష్.జి నిర్మించారు. ఈ నెల 7న విడుదలకానుంది. మంగళవారం హైదరాబాద్‌లో గెటప్‌శీను పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'కష్టసుఖాల్లో అనుక్షణం తోడుండే ముగ్గురు మిత్రుల కథ ఇది. పరిణితి లేమితో వారు చేసిన ఓ తప్పు ఎలాంటి అనర్థాలకు దారితీసింది. ఆ సమస్య ఏమిటి? దానికి సృష్టికర్తలెవరూ? ఆ అవరోధాన్ని వారు ఎలా దాటారన్నదే ఈ చిత్ర కథ. వినోదంతో పాటు సెంటిమెంట్ కలబోతగా ఉంటుంది. తొలిసారి నేను, సుధీర్, రాంప్రసాద్ కలిసి రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'నమో వెంకటేశాయ'లో కనిపించాం. ఆ తర్వాత మళ్లీ మేము ఒకే ఫ్రేమ్‌లో కనిపించే చిత్రమిది. మా స్నేహాన్ని బుల్లితెరపైనే కాకుండా వెండితెరపై కొనసాగించడం అఛీవ్‌మెంట్‌లా భావిస్తున్నా. దర్శకుడవ్వాలనే ప్రయత్నాల్లో ఉన్న యువకుడిగా నా పాత్ర కొత్తగా ఉంటుంది. హాస్యనటులుగా మమ్మల్ని కొత్త పంథాలో ఆవిష్కరిస్తుంది. చిరంజీవిని స్ఫూర్తిగా తీసుకొని ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాను. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'ఇస్మార్ట్‌శంకర్' నటుడిగా నాకు మంచి బ్రేక్ నిచ్చింది. ప్రస్తుతం విజయ్ దేవరకొండ 'ఫైటర్'తో పాటు బెల్లంకొండ శ్రీనివాస్ సినిమా, అఖిల్ కొత్త చిత్రం, సప్తగిరితో మరో సినిమా చేస్తున్నాను' అని తెలిపారు.


గెటప్ శీను


శరత్‌మరార్, శేఖర్‌చంద్ర, ప్రియాంక, నందు, కార్తికేయ, విశ్వక్‌సేన్, సాహిత్

# నేపథ్యం కాదు ప్రతిభ ముఖ్యం

**'కం**టెంట్ బాగుంటే సినీ పరిశ్రమ ప్రోత్సాహం ఉంటుందని ఈ సినిమా ప్రచార చిత్రాలు నిరూపించాయి. నటుడిగా అందరిని మెప్పించాలనే నా కల ఈ సినిమాతో తీరుతుందనే నమ్మకముంది. వంద శాతం బ్లాక్‌బస్టర్ సినిమా ఇది' అని అన్నారు నందు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'సవారి'. సాహిత్ మోత్కూరి దర్శకుడు. సంతోష్ , నిషాంక్‌రెడ్డి నిర్మించారు. ప్రియాంకశర్మ కథానాయిక. ఈ నెల 7న విడుదలకానుంది. సోమవారం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుక జరిగింది. బిగ్ సీడీని హీరోలు కార్తికేయ, విశ్వక్‌సేన్ ఆవిష్కరించారు. కార్తికేయ మాట్లాడుతూ 'నటుడిగా నందు ప్రయాణం స్ఫూర్తిదాయకం. పదేళ్లుగా ఎన్ని అవరోధాలు ఎదురైనా పోరాటం చేస్తూనే ముందుకు సాగుతున్నాడు. అదే అతనిలో నాకు ఇష్టం' అని అన్నారు. నందు మాట్లాడుతూ 'ఇండస్ట్రీలో స్థిరపడాలంటే నేపథ్యం కంటే ప్రతిభ ఉండటం ముఖ్యం. నాలోను మంచి నటుడు ఉన్నాడని ఈ సినిమా రుజువు చేస్తుంది. మంచి కథ, కథనాలతో దర్శకుడు సాహిత్ ఈ సినిమాను రూపొందించారు' అని తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ 'నందు అభినయం, తెలంగాణ యాసలో అతడు చెప్పే సంభాషణలు ప్రధానాకర్షణగా నిలుస్తాయి. నవ్యమైన ఇతివృత్తంతో రూపొందించాం. కొత్త ప్రతిభను ప్రోత్సహిస్తూ రూపొందించిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకముంది' అని అన్నారు.

# వాస్తవ ఘటనలతో..


వరుణ్, దివ్యారావు

**వ**రుణ్, దివ్యరావు జంటగా నటిస్తున్న చిత్రం 'డిగ్రీ కాలేజ్'. నరసింహనంది దర్శకుడు. ఈ నెల 7న విడుదలవుతుంది. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. సీనియర్ రాజకీయ నాయకుడు పొన్నాల లక్ష్మయ్య, తమ్మారెడ్డి భరద్వాజ, సి.కల్యాణ్ ట్రైలర్‌ను ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ 'నిజ జీవితానికి దగ్గరగా ఉండే కథాంశమిది. ఓ అబ్బాయి, అమ్మాయి జీవితంలో జరిగిన యథార్థ సంఘటనను స్ఫూర్తిగా తీసుకొని ఈ కథ రాసుకున్నా. మోతాదుకు మించి సన్నివేశాలు ఉన్నా.. ప్రతీ సీన్‌కు బలమైన కారణం ఉంటుంది. ఈ సినిమాకు రెండో భాగం కూడా ఉంది' అన్నారు. 'యథార్థమైన ప్రేమకథ. యువతరానికి కనెక్ట్ అవుతుంది' అని హీరో వరుణ్ తెలిపారు. ఈ సినిమా ఒక ఎమోషనల్ జర్నీ అని కథానాయిక దివ్యారావు చెప్పింది.



నమస్తే తెలంగాణ
# యువ
[ కరీంనగర్ ]
బుధవారం 5 ఫిబ్రవరి 2020

### వాట్సప్ మెసేజ్

నీ విజయాన్ని నీకంటే
చిన్నవాళ్లతో పంచుకో..
వాళ్లు నిన్ను స్ఫూర్తిగా
తీసుకొని పైకొస్తారు.
నీ ఓటమిని నీకంటే
పెద్దవాళ్లతో పంచుకో..
వాళ్లు నీకు ఓటమి
పాఠాలు నేర్పిస్తారు!

### ఏం డైలాగ్ గురూ..

ఇంటర్వ్యూలో
ఫెయిల్ అయితే
ఆ వెధవ నవ్వు
ఎందుకు?
సక్సెస్‌లో ఏ వెధవ
అయినా నవ్వు
తాడు ఫెయిల్యూ
ర్‌లో నవ్వేవాడే
హీరో


సినిమా: చిరునవ్వుతో

### నవ్వుకొందాం

సికింద్రాబాద్ నుంచి బయల్దేరిన మెట్రో
ట్రెయిన్‌లో ఇసుకేస్తే రాలనంత జనం.
నిలబడే చోటు కూడా లేదు.
అటూ ఇటూ చూశాడు ప్రసాద్.
వెంటనే మొబైల్ తీసి మాట్లాడుతున్నట్లు
చెవి దగ్గర పెట్టాడు. దగ్గుతూ ఓ మాట
అన్నాడో లేదో ఆ కంపార్ట్‌మెంట్ అంతా
ఖాళీ. ఇంతకూ అతనేమన్నాడంటే...
'అవున్రా.. నిన్ననే చైనా నుంచి
ఫ్లయిట్‌లో హైదరాబాద్ వచ్చాను'

### మంచిమాట

ఏదైనా రాయందే ఈ
క్షణాన్ని పోనీయను.
కలాన్ని పిండేయందే
కాలాన్ని కదలనీయను..
అవసరమైనప్పుడు అగ్గి
పుల్లతో చీకటికొవ్వును
కరిగించందే కొత్తపొ
ద్దును రానీయను.


- డా.సి. నారాయణరెడ్డి

### టెక్నాలెడ్జ్

## గూగుల్ వీడియో కమ్యూనిటీ యాప్



ఇటీవలి కాలంలో అత్యంత పాపులర్ అయిన యాప్స్‌లో 'టిక్‌టాక్' ఒకటి. ప్రపంచ వ్యాప్తంగా దీనిని ఎక్కువ మంది వాడుతున్న నేపథ్యంలో అలాంటి యాప్‌లు చాలానే వస్తున్నాయి. అచ్చం అలాంటి యాప్‌ను తీసుకొచ్చే సంస్థల్లో ఇప్పుడు గూగుల్ కూడా చేరిపోయింది. తాజాగా షార్ట్ - ఫార్మ్ వీడియో 'టాంగి' యాప్‌ను ప్రారంభించింది. ఈ యాప్ వీడియోలను షేర్ చేయగలదు. ఇప్పుడు యాప్ స్టోర్, tangi.coలో అందుబాటులో ఉంది. ప్రతి రోజు కొత్త విషయాలను వీడియోలతో తెలుసుకోవడానికి ఈ యాప్ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని గూగుల్ వెల్లడించింది. కొత్త విషయాలను తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది. కళాత్మకత, వంటలు, స్టయిల్స్ వంటి ఇతర అంశాలను 60 సెకన్లలోపు రికార్డు చేసి షేర్ చేయవచ్చు. తక్కువ వ్యవధి గల వీడియోలను కూడా అప్‌లోడ్ చేయవచ్చు. గూగుల్ టాంగి యాప్ ఐఓఎస్‌లో మాత్రమే అందుబాటులో ఉంది.

## పోకో నుంచి రెండో ఫోన్

**షావోమి నుంచి విడిపోయిన పోకో రెండో ఫోన్‌ను విడుదల చేసింది. పోకో ఎక్స్1 తర్వాత ఈ సిరీస్‌లో రెండో స్మార్ట్‌ఫోన్‌ను పోకో ఎక్స్ 2 పేరుతో తీసుకొచ్చింది.**

**పోకో ఎక్స్ 2 ఫీచర్లు**



**డిస్‌ప్లే:** 6.67 అంగుళాలు
**రిజల్యూషన్:** 1080x2380 పిక్సెల్స్
**ప్రాసెసర్:** క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 730జీ
**ర్యామ్:** 6,8 జీబీ
**స్టోరేజ్:** 128, 256 జీబీ
**ఓఎస్:** ఆండ్రాయిడ్ 10
**కెమెరా:** 64+8+2+2 ఎంపీ
**సెల్ఫీ కెమెరా:** 20 +2 ఎంపీ ఎంపీ
**బ్యాటరీ:** 4500 ఎంఏహెచ్

## చిన్నారుల భద్రత కోసం

### ఈజీ ట్రాక్ స్మార్ట్‌వాచ్



చిన్నారుల భద్రత కోసం ప్రముఖ సెక్యూరిటీ, నిఘా ఉత్పత్తుల సంస్థ సీపీ ప్లస్ ఈజీ ట్రాక్‌ను విపణిలోకి ప్రవేశపెట్టింది.ఇటీవల దేశంలో చిన్నారుల కిడ్నాప్‌ల సంఖ్య పెరుగుతున్నది. వీటిని నివారించడానికి సీపీ ప్లస్ సంస్థ ముందుకొచ్చింది. పిల్లల భద్రతతోపాటు వారిని పర్యవేక్షించడానికి సరికొత్త పరికరాన్ని అందుబాటులోకి తెచ్చింది. సీపీ ప్లస్ ఈజీట్రాక్ స్మార్ట్‌వాచ్‌ను చిన్నారుల చేతికి పెట్టొచ్చు. ఈ వాచ్‌కు అత్యవసర బటన్‌తోపాటు జీపీఎస్ ట్రాకింగ్ సౌకర్యం ఉన్నది. దీనిని ధరించిన చిన్నారులు ఎక్కడున్నారో సులువుగా గుర్తించవచ్చు. ఆండ్రాయిడ్ యాప్స్‌తోపాటు ఐఓఎస్, ఇన్‌బిల్ట్ కెమెరా, వాయిస్ చాట్, పెడోమీటర్, టేక్ ఆఫ్ అలర్ట్ వంటి అత్యాధునిక సదుపాయాలు ఇందులో ఉన్నాయి. సీపీ ప్లస్ ఈజీట్రాక్‌ను పిల్లలే కాకుండా, వృద్ధులు కూడా వినియోగించవచ్చు. ప్రముఖ ఈ-కామర్స్ వెబ్‌సైట్లలో ఈజీ ట్రాక్‌స్మార్ట్‌వాచ్ అందుబాటులో ఉన్నది. దీని ధర రూ. 3,199.

## మరింత కఠినం..




యూట్యూబ్‌లో నిరాధార వీడియోలను నియంత్రించేందుకు ఆ సంస్థ మరిన్ని ఫీచర్లను అభివృద్ధి చేస్తున్నది. తప్పుడు సమాచారం పోస్ట్ చేయడాన్ని యూట్యూబ్‌లో నిషేధించనున్నట్లు గూగుల్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు మరణించారనిగానీ, ఎన్నికల తేదీ వ్యవహారంలో తప్పుడు సమాచారంగానీ యూట్యూబ్‌లో పోస్ట్ చేస్తే దాన్ని తొలగిస్తామని ఆ సంస్థ చెప్పింది. ట్రస్ట్ అండ్ సేఫ్టీ టీమ్ సభ్యులు ఆయా వీడియోలను నిరంతరం పరిశీలిస్తుంటారు. వార్తలకు నమ్మదగిన స్థానం కలిగిన దానిగా యూట్యూబ్‌ను మారుస్తున్నరు. 'వార్తా సమాచారానికి విశ్వసనీయ సోర్స్‌గా యూట్యూబ్‌ను తీర్చిదిద్దేందుకు గత కొన్నేండ్లుగా కసరత్తును ముమ్మరం చేశాం. అదే సమయంలో ఆరోగ్యకరమైన రాజకీయ చర్చలకు బహిరంగ వేదికగా మలిచేందుకు కృషి చేస్తున్నామ'ని యూట్యూబ్ ప్రభుత్వ వ్యవహారాలు, పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ లెస్లీ మిల్లర్ పేర్కొన్నారు.

# ఈ- వెహికిల్ మార్కెట్‌లో జీఎండబ్ల్యూ బ్రాండ్

చదువు తర్వాత ప్రతి ఒక్కరూ ఎదురు చూసేది వారి అర్హతకు తగిన ఉద్యోగం కోసమే... డిగ్రీలు, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లు పూర్తి చేసిన వారు ప్రతి ఏటా లక్షల్లో పుట్టుకొస్తున్నారు. అందరికీ ఉపాధి దొరకడమంటే సాధ్యమయ్యే పనేనా? ఈ యువకులకు సరిగ్గా ఇటువంటి ఆలోచనే కలిగింది. తాము ఉద్యోగాలు వెతకడం కాదు. మరికొందరికి ఉద్యోగాలు అందించేలా ఉండాలనుకున్నారు. తెలంగాణకు చెందిన మెగ్గరు యువకులు ఎలక్ట్రిక్ వాహనాలను రూపొందించడం మొదలు పెట్టారు. పర్యావరణానికి మేలు చేసే ఈ-వెహికిల్స్ తయారీ పరిశ్రమను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఈ- వెహికిల్ మార్కెట్‌లోనే 'గాయం మోటార్ వర్క్స్' జీఎండబ్ల్యూ సంస్థకు ఓ బ్రాండ్ క్రియేట్ చేస్తున్నారు. ఇక్కడ తయారైన వేలాది వాహనాలను ఇతరదేశాలకు ఎగుమతి చేస్తూ విజయపథంలో దూసుకు పోతున్నారీ కుర్రాళ్లు..



వినియోగదారుని అభిరుచికి తగిన వస్తువులే మార్కెట్‌లో ఓ ట్రెండ్‌ను సృష్టిస్తాయి. అటువంటి లక్ష్యంతో వచ్చిన కంపెనీలే విపణిలో నిలబడగలుగుతాయి. ఏదైనా వ్యాపారం మొదలు పెట్టాలంటే మార్కెట్ అవసరాలను గుర్తించడంతోపాటు ట్రెండ్‌కు తగిన వాటిని అందించగలగాలి. అటువంటి వస్తువులకే ఆదరణ ఉంటుంది. లక్షలాది రూపాయలు పోసి కొన్న కారుకు ప్రతి రోజూ పెట్రోల్ పోయాలి. దాని నిర్వహణ కూడా కాస్త భారమే. ఇటువంటి వాహనాలు రోడ్లపై తిరగడం వల్ల కాలుష్యం తీవ్రంగా పెరుగుతున్నది. ఫలితంగా పర్యావరణం ప్రమాదంలో పడుతున్నది. అందుకోసమే భవిష్యత్ తరాలకు మేలు చేసేలా ఇంధన ఉద్గారాలను తగ్గించి ప్రకృతిని కాపాడేందుకు వీరు ముందుకు వచ్చారు. రాజా, రాహుల్, శ్రీహర్షలు పర్యావరణహితమైన ఈ-వెహికిల్స్‌తో 'గాయం మోటార్ వర్క్స్ (జీఎండబ్ల్యూ)' కంపెనీని స్థాపించారు.

**సొంతగా పరిశోధన కేంద్రం**

2010లో తొలిసారిగా ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కోసం పరిశోధనలు ప్రారంభించారు. వీటి తయారీలో వాడిన విడి భాగాలను బయట కంపెనీల నుంచి కొనుగోలు చేశారు. అవి నాసిరకంగా ఉండటంతోపాటు వీరి వాహనాలకు సరిపోయేవి కాదు. ఆటోల తయారీకి ఉపయోగపడే విడి భాగాల ధరలు అధికమయ్యాయి. దీంతో తయారీ ఖర్చు పెరిగి ఆటో ధర రూ. 6 లక్షలకు చేరింది. అలా వీరు ముగ్గురూ కలిసి సొంతగా పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవాలనుకున్నారు. ఆ ఆలోచనతోనే సొంతగా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్(ఆర్ అండ్ డీ)ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఆటో తయారీకి అవసరమైన పరికరాలను, విడి భాగాలను కావలసిన ప్రమాణాలతో సొంతగా తయారు చేసేందుకు సిద్ధమయ్యారు.

**ఇలా మొదలైంది**

గాయం రాజా ఐఐటీలో ఇంజినీరింగ్, యూనివర్సిటీ ఆఫ్ లండన్‌లో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ చదివాడు. రాజా సోదరుడు రాహుల్‌కు అమెరికాలో ఎలక్ట్రికల్ వాహనాల తయారీ సంస్థలో పనిచేసిన అనుభవం ఉన్నది. వీరిద్దరు పరిశ్రమ ప్రారంభించిన కొన్నాళ్లకు రాజా స్నేహితుడు శ్రీహర్ష వీరితో కలిశాడు. ఆయన ఐఐటీతోపాటు స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో బిజినెస్‌మేనేజ్‌మెంట్ పూర్తి చేశాడు. ఈ ముగ్గురి ఆలోచనలే వీరిని కలిపాయి. రాజా తండ్రికి అప్పటికే బస్ బాడీ తయారీ యూనిట్ ఉన్నది. అందులో కొన్ని పరికరాలు వీరికి బాగా ఉపకరించాయి. దీంతో అదే స్థలంలో ఆటో బాడీ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభించారు.



**మెరుగైన పనితీరు**

ప్రస్తుతం వాహనాల్లో వాడుతున్న లెడ్ ఆసిడ్ బ్యాటరీలకు బదులు లిథియం ఐయాన్ బ్యాటరీని తయారు చేశారు. ఈ బ్యాటరీ చాలా వేగంగా ఛార్జింగ్ అవుతుంది. బరువు తక్కువ ఉంటుంది. ఆటో వేగంగా నడిచేందుకు అవసరమైన పవర్‌ను అందిస్తుంది. దీనివల్ల ఆటో వేగం గంటకు 50-55 కి.మీ పెరిగింది. సొంత ప్లాంట్ ఏర్పాటు చేసి బ్యాటరీలను తయారు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని పటాన్‌చెరు ప్లాంట్‌లో ఆటోలను తయారు చేస్తున్నారు. పూర్తిగా సొంత టెక్నాలజీతో తయారు చేసిన ఎలక్ట్రిక్ ఆటోను 2015లో మార్కెట్లోకి ప్రవేశపెట్టారు. ప్యాసింజర్ , కార్గో రెండురకాల ఆటోలు తయారు చేశారు. వీరు రూపొందించిన సాంకేతికతతో ఆటో ధర సగానికి తగ్గటంతోపాటు పనితీరులోనూ మెరుగైన మార్పులు తీసుకువచ్చారు. పటాన్‌చెరులోని ప్లాంట్‌లో 180 మంది సిబ్బంది ఉన్నారు. నెలకు 250 ఆటోలను తయారు చేసే సామర్థ్యం దీనికి ఉన్నది. ఆటో ధర రూ. 2.50 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకూ ఉంటుంది.

**డ్రైవర్లకు ఆదాయం రావడమేకాక, ప్రజలకు పొగ, ధ్వని, కాలుష్యం నుంచి విముక్తి కలుగుతుందని వీరు చెబుతున్నారు. ఈ- వాహనాల పరిశ్రమలో ఓ బ్రాండ్ క్రియేట్ చేసే లక్ష్యంతో రాజా, రాహుల్, శ్రీహర్షలు పనిచేస్తున్నారు. చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేసిన తర్వాత భారతదేశంలో పాసింజర్ ఆటోలను ప్రవేశ పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇలా పర్యావరణహితం కోసం కృషి చేస్తూ అందరి ప్రశంసలూ అందుకుంటున్నారు.**

**కిలోమీటరుకు 50 పైసలే!**

డీజిల్, పెట్రోల్ వాహనాలతో పోలిస్తే ఇంధనం ధర చాలా తక్కువ . దీంతో హైదరాబాద్‌లో ఉన్న పలు ఈ -కామర్స్ సంస్థలు గాయం మోటార్ వర్క్స్ తయారు చేసిన ఎలక్ట్రిక్ వాహనాలను వాడేందుకు ఆసక్తి చూపుతున్నాయి. డిజిల్ ఆటోలకు కి.మీ.కు రూ. 3.50 వరకు ఖర్చవుతుండగా, గాయం సంస్థ తయారు చేసిన ఎలక్ట్రిక్ ఆటోకు కిమీ.కు 50 పైసలు మాత్రమే ఖర్చవుతున్నది. ఈ-వెహికల్స్ వాడకం వల్ల ఆయా ఈ-కామర్స్ సంస్థలకు వందల రెట్లు ఖర్చుతగ్గడంతోపాటు ఆదాయమూ పెరుగుతున్నది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలు తమ సరుకులను తరలించేందుకు గాయం మోటార్ వర్క్స్ 'కంపెనీ తయారు చేసిన ఆటోలనే వినియోగిస్తున్నాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, బిగ్‌బాస్కెట్, డెల్హీవరి, బ్లూడాట్ వంటి సంస్థలకు వీరు సేవలందిస్తున్నారు.ఆయా సంస్థల గోదాముల్లోనే చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. 3 గంటలు చార్జింగ్ చేస్తే 70 కిలోమీటర్ల వరకు నడుస్తాయి. బ్యాటరీ స్వైపింగ్ టెక్నాలజీని ప్రవేశ పెట్టారు. బ్యాటరీలను మార్చిడి విధానాన్ని రూపొందించారు. చార్జింగ్ అయిపోయిన వాహనాలకు వెంటనే మరొక బ్యాటరీనీ అమర్చేలా సరికొత్త సాంకేతికతను తయారు చేశారు. ఇండియాలో 800లకు పైగా యూనిట్లను అమ్మారు. జపాన్, శ్రీలంక వంటి విదేశాలకు ఇప్పటివరకు 7 వేల ఆటోలను విక్రయించారు.

... పసుపులేటి వెంకటేశ్వరరావు
నర్రే రాజేష్

# క్యాన్సర్ క్యాప్స్!

**క్యాన్సర్ రోగులకు చికిత్సలో భాగంగా కీమో థెరపీ చేయడం సహజం. ఇందులో మహిళలకు క్యాన్సర్ ఉందనే బాధకన్నా.. తమ జుట్టు ఊడి పోతుందనే విషయమే ఎక్కువ వేధిస్తుంది. సరిగ్గా ఆ బాధ వారింట్లోనే ఎదురైంది. ఒక్కరు కాదు ఏడాది వ్యవధిలో ఆ బాధతో ఇద్దరు కుంగి పోయారు. బతికినన్నాళ్లు బాధతో చచ్చిపోయారు. వారిని ప్రత్యక్షంగా చూసిన ఆ ఇద్దరు క్యాన్సర్ పేషెంట్ల కోసం ఏం చేశారంటే..**

ఢిల్లీకి చెందిన సామ్రాట్‌నాథ్, సార్థక్‌నాథ్ సోదరులు. సామ్రాట్ స్థానికంగా ఇంటర్ చదువుతున్నాడు. సార్థక్ పదోతరగతి చదువుతున్నాడు. 2015లో ఈ సోదరుల అమ్మమ్మ క్యాన్సర్ బారిన పడింది. చికిత్సలో భాగంగా ఆమెకు తరచూ కీమో థెరపీ చేయించేవారు. క్యాన్సర్ ఆమెను కుంగదీయలేదు కానీ వెంట్రుకలు






మొత్తం రాలిపోవడం మాత్రం ఆమెను కుంగదీసింది. అనంతరం కొన్ని రోజులకు సామ్రాట్, సార్థక్ మేనత్తకు సైతం క్యాన్సర్ వచ్చింది. అప్పుడు కూడా ఆమె తన జుట్టును కోల్పోతున్నందుకు రోజూ చింతించేది. అత్త బాధను చూడలేక వారు పాలిస్టర్‌తో క్యాప్ కుట్టించి ఇచ్చారు. కానీ ఆ క్యాప్ వాడడం వల్ల తలపై దురద మొదలైంది. వైద్యుల సలహా ప్రకారం కాటన్ వస్త్రంతో క్యాప్స్ తయారు చేయించారు. తమ కుటుంబీకుల మాదిరిగానే ఎంతోమంది ఇలాంటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్నారు. వాళ్లందరికీ కీమో క్యాప్స్ ఉచితంగా అందించాలని సంకల్పించుకున్నారు. తమ దగ్గర డబ్బుల్లేవ్. ఇంట్లో వాళ్లను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేదు. అందుకని ఓ క్యాంపెయినింగ్ మొదలెట్టారు. తన తండ్రి బట్టల వ్యాపారంలో ఉండడంతో ఆయన సలహా మేరకు కొంతమంది పారిశ్రామికవేత్తలను కలిసి తమ ఆలోచనను పంచుకున్నారు. పాఠశాలకు, కళాశాలకు సెలవు ఉన్న రోజుల్లో విరాళాలు సేకరించి కీమో క్యాప్స్ తయారు చేయించారు. 2019 ఏప్రిల్‌లో మొదటిసారి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో క్యాన్సర్ రోగులకు ఉచితంగా ఆ టోపీలను అందించారు. ఆ తర్వాత నాగ్‌పూర్‌లోని సంత్ తుక్డోజీ రీజినల్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో మందనియా క్యాన్సర్ హాస్పిటల్‌లో క్యాన్సర్‌తో బాధపడే వారికి ఉచితంగా వాటిని అందించారు. ఇలా ఇప్పటి వరకు 2 వేల మంది క్యాన్సర్ పేషెంట్లకు ఉచితంగా కీమో క్యాప్స్ అందించారు. ప్రస్తుతం chemocaps.co.in అనే వెబ్‌సైట్‌ను సైతం ప్రారంభించారు. క్యాన్సర్ రోగులకు స్కార్ఫ్‌లు, టోపీలు ఉచితంగా అందిస్తామని ప్రచారం చేస్తున్నారు.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

**కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)లో ఒప్పంద ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

## ఈసీఐఎల్‌లో

**ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**




- **పోస్టు:** టెక్నికల్ ఆఫీసర్ (కాంట్రాక్టు ప్రాతిపదికన)
- **మొత్తం ఖాళీలు:** 7
- **అర్హతలు:** బీఈ/బీటెక్ లేదా ఎంసీఏ/ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్/ఐటీ లేదా ఈసీఈలో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఏడాది అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 30 ఏండ్ల లోపు ఉండాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** ఫిబ్రవరి 15
- **వెబ్‌సైట్:** www.ecil.co.in

## ఎయిమ్స్‌లో

**భోపాల్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 13
- **పోస్టులు:** ప్రోగ్రామ్ కోఆర్డినేటర్-1, ఫీల్డ్ మానిటర్-1, ప్రాజెక్ట్ అసోసియేట్-1, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్-10 ఉన్నాయి.
- అర్హతలు, ఎంపిక తదితర వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 21
- **వెబ్‌సైట్:** http://aiimsbhopal.edu.in

## సాయ్‌లో 347 ఖాళీలు

- **మొత్తం ఖాళీలు:** 347
- **పోస్టుల వారీగా ఖాళీలు:** ఆంత్రోప్రోమెట్రిస్ట్-23, ఎక్సర్‌సైజ్ సైకాలజిస్ట్-34, స్ట్రెంథ్ అండ్ కండిషనింగ్ ఎక్స్‌పర్ట్-62, బయోమెకనిస్ట్-3, సైకాలజిస్ట్-4, బయోకెమిస్ట్-2, స్పోర్ట్స్ మెడిసిన్-10, డాక్టర్-1, ఫిజియోథెరపిస్ట్-47, మెజరర్-72, ఫార్మాసిస్ట్-12, నర్సింగ్ అసిస్టెంట్-36, ల్యాబ్ టెక్నీషియన్-12, ల్యాబ్ టెక్నీషియన్ (నాన్ మెడికల్)-29 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హతలు:** పోస్టుని బట్టి ఇంటర్, సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 15
- **వెబ్‌సైట్:** https://sportsauthorityofindia.gov.in

## ఐఐటీ మద్రాస్‌లో

**చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీఎం)లో ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 49
- **పోస్టులు:** ప్రాజెక్ట్ అసోసియేట్లు, జూనియర్ టెక్నీషియన్, ప్రాజెక్ట్ అసోసియేట్
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్ లేదా ఎంబీఏ ఉత్తీర్ణత. అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 28 ఏండ్లు మించరాదు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 10
- **వెబ్‌సైట్:** https://icandsr.iitm.ac.in

## అలింకోలో

**ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యాను ఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎల్ఐఎంసీఓ)లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 30
- **విభాగాలవారీగా ఖాళీలు:** ప్రోస్తటిస్ట్ అండ్ ఆర్థోటిస్ట్ ప్రొఫెషనల్-4, ఆడియోలజిస్ట్-25, టీం లీడర్-1.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ, పీజీ/ఎంబీఏ/ పీజీడీబీఎం/ పీజీడీబీఏ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 17
- **వెబ్‌సైట్:** www.alimco.in

epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
ఆట
12
[ కరీంనగర్ ]
బుధవారం 5 ఫిబ్రవరి 2020
WWW.NTNEWS.COM

**7**

**అండర్-19 ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్ చేరడం ఇది ఏడోసారి. గతంలో 2000, 2008, 2012, 2018లో ట్రోఫీ నెగ్గిన యువ భారత్.. 2006, 2016లో రన్నరప్‌గా నిలిచింది.**

# వన్డే వార్..

నేడు భారత్, న్యూజిలాండ్ తొలి వన్డే

గాయాలతో ఇరుజట్లు సతమతం

కొత్త కుర్రాళ్లపైనే ఆశలు

**ప్రత్యర్థిని వారి సొంతగడ్డపైనే ఉక్కిరిబిక్కిరి చేస్తున్న టీమ్‌ఇండియా వన్డే పోరుకు సై అంటున్నది. టీ20 సిరీస్‌లో ఒకటికి ఐదుసార్లు న్యూజిలాండ్‌ను చిత్తుచేసిన కోహ్లీ సేన.. వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్ తర్వాత ఈ ఫార్మాట్‌లో తొలిసారి బ్లాక్‌క్యాప్స్‌తో తలపడనుంది. ఇరుజట్లు గాయాలతో సతమతమవుతున్నా.. రిజర్వ్ బెంచ్ బలంగా ఉండటంతో ఎలాంటి ఇబ్బంది లేదని కోహ్లీ అంటుంటే.. విలియమ్సన్ గైర్హాజరీలో లాథమ్ కివీస్‌ను నడిపించనున్నాడు. పొట్టి సిరీస్ మాదిరిగా కాకుండా.. వన్డేలు ఉదయాన్నే ప్రారంభం కానున్నాయి. మీరు ఈ వార్త చదివే లోపే మ్యాచ్ ప్రారంభమైనా ఆశ్చర్యపోనక్కర్లేదు! మరి ఆలస్యమెందుకు టీవీలు ట్యూన్ చేసేయండి.**




**హామిల్టన్:** పొట్టి ఫార్మాట్‌లో ప్రత్యర్థిని చిత క్కొట్టి మంచి జోరుమీదున్న టీమ్‌ఇండియా వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం ఇక్కడి సెడాన్ పార్క్‌లో న్యూజిలాండ్‌తో తలపడనుంది. వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్ అనంతరం ఇరు జట్ల మధ్య ఇదే తొలి వన్డే కావడం గమనార్హం. మెగాటోర్నీ తర్వాత కోహ్లీసేన వెస్టిండీస్, ఆస్ట్రేలియాపై సిరీస్ విజయాలు సాధిస్తే.. న్యూజిలాండ్ మాత్రం అప్పటి నుంచి ఈ ఫార్మాట్ బరిలోనే దిగలేదు. ప్రపంచకప్ తుది సమరంలో ఇంగ్లండ్ చేతిలో సూపర్ ఓవర్‌లో ఓడిన కివీస్ అప్పటి నుంచి వన్డేలు ఆడక పోగా.. మిగిలిన ఫార్మాట్లలోనూ తడబాటు కొనసాగుతున్నది. గత తొమ్మిది మ్యాచ్‌ల్లోనూ బ్లాక్ క్యాప్స్ ఓటమి పాలయ్యారు. కెప్టెన్ కేన్ విలియమ్సన్ గాయపడటం ఆ జట్టుకు మరో ఎదురుదెబ్బ కాగా.. యువ ఆటగాళ్లు తమ జట్టు రాత మారుస్తారని తాత్కాలిక సారథి లాథమ్ అంటున్నాడు. మరోవైపు భారత్ కూడా రోహిత్ శర్మ సేవలు కోల్పోయింది. ధవన్ కూడా అందుబాటులో లేకపోవడంతో ఈ సిరీస్‌లో మయాంక్ అగర్వాల్, పృథ్వీ షా ఓపెనింగ్ చేయనున్నారు. మరి వరుస విజయాలతో ఊపుమీదున్న కోహ్లీ గ్యాంగ్‌ను.. లాథమ్ సేన నిలువరిస్తుందా చూడాలి.

**పృథ్వీపైనే దృష్టి**

రెండేండ్ల క్రితం ఇదే సమయంలో న్యూజిలాండ్ వేదికగా జరిగిన అండర్-19 ప్రపంచకప్ గెలిచిన యువ భారత సారథి పృథ్వీ షా.. బుధవారం టీమ్‌ఇండియా తరఫున తొలి వన్డే ఆడనున్నాడు. ఈ సిరీస్‌ను టీ20 ప్రపంచకప్‌నకు సన్నాహంగా భావించడం లేదన్న కెప్టెన్ కోహ్లీ బ్యాటింగ్‌లో కొత్త కుర్రాళ్లను పరీక్షించాలనుకుంటున్నాడు. పిక్క కండరాలు పట్టేయడంతో సిరీస్‌కు దూరమైన హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ స్థానంలో.. మయాంక్ అగర్వాల్ ఓపెనింగ్ చేయనున్నాడు. గతేడాది జరిగిన వన్డే ప్రపంచకప్‌నకు చివరి నిమిషంలో మయాంక్ అగర్వాల్ ఎంపికైనా.. మ్యాచ్ ఆడే అవకాశం మాత్రం రాలేదు. మరోవైపు ఇప్పటికే టెస్టు ఫార్మాట్ బరిలో దిగిన తొలి మ్యాచ్‌లోనే సెంచరీతో దుమ్మురేపిన పృథ్వీ షాకు ఇదే తొలి వన్డే పిలుపు. వన్‌డౌన్‌లో కోహ్లీ పక్కా కాగా.. నాలుగో స్థానంలో అయ్యర్ బ్యాటింగ్‌కు రానున్నాడు. లోకేశ్ రాహుల్‌ను ఫినిషర్‌గానే పరిగణిస్తామని మ్యాచ్‌కు ముందు విరాట్ పేర్కొన్న నేపథ్యంలో అతడు ఐదో స్థానంలోనే కొనసాగుతాడు. ప్రస్తుతానికి పరిమిత ఓవర్ల క్రికెట్‌లో రాహుల్‌తోనే వికెట్ కీపింగ్ చేయించాలని జట్టు యాజమాన్యం భావిస్తుండటంతో పంత్ ఎదురుచూడక తప్పదు. ఆరో ప్లేస్‌లో మనీశ్ పాండేను ఆడిస్తారా లేక అదనపు ఆల్‌రౌండర్ వైపు మొగ్గు చూపుతారా అనేది తేలాల్సి ఉంది. పేస్ బౌలింగ్‌లో బుమ్రా, షమీతో పాటు శార్దూల్, సైనీల్లో ఒకరు తుది జట్టులో ఉండనున్నారు. జడేజాతో పాటు కుల్దీప్, చాహల్‌లో ఒకరు స్పిన్ బాధ్యతలు మోయనున్నారు.

> టీ20 ప్రపంచకప్ గురించి ఇప్పటి నుంచే ఆలోచించడం లేదు. దానికి ఐపీఎల్ సరైన వేదిక అని భావిస్తున్నాం. పృథ్వీ, మయాంక్ ఓపెనింగ్ చేస్తారు. రాహుల్ మిడిలార్డర్‌లో ఆడుతాడు.
>
> **- విరాట్ కోహ్లీ, భారత కెప్టెన్**

**పోటీనిచ్చేనా..**

మరోవైపు న్యూజిలాండ్ జట్టు కూడా గాయాలతో సతమతమవుతున్నది. రెగ్యులర్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ తొలి రెండు మ్యాచ్‌లకు దూరమవడంతో అతడి స్థానంలో మార్క్ చాప్‌మన్ వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగనున్నాడు. తాత్కాలిక సారథి టామ్ లాథమ్‌కు భారత్‌పై మంచి రికార్డు ఉండటం ఆ జట్టుకు సానుకూలాంశం. ఏదేమైనా ఈ ఫార్మాట్‌లో టీమ్‌ఇండియాకు పోటీనివ్వాలంటే సీనియర్లు టేలర్, గప్టిల్ సత్తాచాటక తప్పదు. లాథమ్, నికోల్స్, చాప్‌మన్ కూడా తలో చేయి వేస్తే భారీ స్కోరు ఖాయమే. ఎన్నో అంచనాలు పెట్టుకున్న ఆల్‌రౌండర్లు నీషమ్, గ్రాండ్‌హోమ్ రెండు విభాగాల్లో విజృంభిస్తే కివీస్‌కు తిరుగుండదు. ఇక బౌలింగ్‌లో కుగ్లిన్, బెనెట్, సౌథీ కీలకం కానున్నారు. న్యూజిలాండ్ చరిత్రలో అత్యంత పొడగరి పేసర్ జెమీసన్ (6 అడుగుల 8 అంగులాలు)కు తుది జట్టులో చోటు దక్కుతుందా చూడాలి.

## పిచ్, వాతావరణం

ఇరు జట్ల మధ్య మూడో టీ20 జరిగిన పిచ్ పైనే తొలి వన్డే నిర్వహించనున్నారు. రెండో ఇన్నింగ్స్‌లో పిచ్ మందకొడిగా ఉండనుంది. మ్యాచ్ రోజు వర్ష సూచనలేదు.

## తుది జట్లు (అంచనా)

**భారత్:** కోహ్లీ (కెప్టెన్), మయాంక్, పృథ్వీ షా, అయ్యర్, రాహుల్, మనీశ్ పాండే, జడేజా, శార్దూల్/సైనీ, చాహల్/కుల్దీప్, షమీ, బుమ్రా.

**న్యూజిలాండ్:** లాథమ్ (కెప్టెన్), గప్టిల్, నికోల్స్, చాప్‌మన్, టేలర్, గ్రాండ్‌హోమ్, నీషమ్, శాంట్నర్/సోధి, సౌథీ/జెమీసన్, బెనెట్, కుగ్లిన్.

**4**

**ఒకే మ్యాచ్‌లో ఇద్దరు ఓపెనర్లు అరంగేట్రం చేయనుండటం భారత్ క్రికెట్ చరిత్రలో ఇది నాలుగోసారి. గతంలో రాహుల్, కరుణ్ నాయర్ (2016లో జింబాబ్వేపై), సునీల్ గవాస్కర్, సుధీర్ నాయక్ (1974లో ఇంగ్లండ్‌పై), పార్థసారథి శర్మ, దిలీప్ వెంగ్‌సర్కార్ (1976లో న్యూజిలాండ్‌పై) అరంగేట్రం మ్యాచ్‌ల్లో ఓపెనింగ్ చేశారు.**

# యశస్వి జయం

అజేయ శతకంతో అదరగొట్టిన జైస్వాల్.. సెమీస్‌లో పాక్‌పై 10 వికెట్లతో భారత్ జయభేరి

ఏడోసారి ఫైనల్లో యంగ్‌ఇండియా.. అండర్-19 ప్రపంచకప్




**కార్తీక్ యార్కర్లు.. బిష్ణోయ్ గూగ్లీలు.. యశస్వి సిక్సర్లు.. దివ్యాన్ష్ బౌండ్రీలు.. యువభారత్ జోరు.. ప్రత్యర్థి పాకిస్థాన్ బేజారు..**

**సెమీఫైనల్లోనూ ఇదే సీన్ రిపీట్ కావడంతో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ ఇంటిముఖం పట్టింది. డిఫెండింగ్ చాంపియన్ హోదాకు తగ్గట్లు దూసుకెళ్తున్న యంగ్‌ఇండియా వరుసగా మూడోసారి తుదిపోరుకు చేరింది. మనవాళ్లు వీరలెవల్లో విజృంభించి ప్రత్యర్థిని ఆలౌట్ చేసిన చోట పాక్ జట్టు ఒక్క వికెట్ తీసేందుకు నానా తంటాలు పడింది. వాళ్ల బ్యాట్స్‌మెన్ క్రీజులో నిలదొక్కుకోలేక తైతక్కలాడిన చోట మనవాళ్లు పరుగుల వరద పారిస్తూ సగర్వంగా ఫైనల్లో అడుగుపెట్టారు.**

**1**

**అండర్-19 ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌లో ఒక జట్టు 10 వికెట్ల తేడాతో నెగ్గడం ఇదే తొలిసారి.**




జైస్వాల్ (105★)

> ప్రపంచకప్ సెమీఫైనల్లో పాకిస్థాన్‌పై సెంచరీ చేయడం.. ఈ అనుభూతిని మాటల్లో వర్ణించలేను. నా కల నిజమైనట్లు అనిపిస్తున్నది. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ ఇలాంటి ప్రదర్శన చేసినందుకు ఆనందంగా ఉంది.
>
> **-యశస్వి జైస్వాల్**

**పోచెఫ్‌స్ట్రూమ్:** యంగ్ తరంగ్ యశస్వి జైస్వాల్ (113 బంతుల్లో 105 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్సర్లు) అజేయ శతకంతో విజృంభించడంతో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను తుక్కుకింద కొట్టిన యువ భారత జట్టు వరుసగా మూడోసారి అండర్-19 ప్రపంచకప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం ఇక్కడ జరిగిన సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ 10 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌పై జయభేరి మోగించి ఓవరాల్‌గా ఏడోసారి మెగాటోర్నీ తుది పోరుకు అర్హత సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 43.1 ఓవర్లలో 172 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ నజీర్ (62), ఓపెనర్ హైదర్ అలీ (56) అర్ధ శతకాలు సాధించారు. భారత బౌలర్లలో సుశాంత్ మిశ్రా 3, కార్తీక్ త్యాగి, రవి బిష్ణోయ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో యశస్వితో పాటు మరో ఓపెనర్ దివ్యాన్ష్ సక్సేనా (99 బంతుల్లో 59 నాటౌట్; 6 ఫోర్లు) అర్ధశతకంతో అదరగొట్టడంతో యువ భారత్ 35.2 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 176 పరుగులు చేసింది. యశస్వికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. న్యూజిలాండ్, బంగ్లాదేశ్ మధ్య గురువారం జరిగే రెండో సెమీఫైనల్ విజేతతో ప్రియం గార్గ్ సేన ఫైనల్లో తలపడనుంది.

## స్కోరు బోర్డు

**పాకిస్థాన్:** హైదర్ అలీ (సి) రవి (బి) యశస్వి 56, హురేరా (సి) దివ్యాన్ష్ (బి) మిశ్రా 4, మునీర్ (సి) అంకొలేకర్ (బి) రవి 0, నజీర్ (సి) తిలక్ వర్మ (బి) మిశ్రా 62, ఖాసిం (రనౌట్) 9, హరీస్ (సి) దివ్యాన్ష్ (బి) అంకొలేకర్ 21, ఇర్ఫాన్ ఖాన్ (బి) కార్తీక్ 3, అబ్బాస్ అఫ్రీది (ఎల్బీ) రవి 2, తాహిర్ (సి) జురేల్ (బి) కార్తీక్ 2, ఆమిర్ అలీ (సి) వీర్ (బి) మిశ్రా 1, అమీర్ ఖాన్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు:** 12, **మొత్తం:** 43.1 ఓవర్లలో 172ఆలౌట్. **వికెట్ల పతనం:** 1-9, 2-34, 3-96, 4-118, 5-146, 6-156, 7-163, 8-169, 9-172, 10-172, **బౌలింగ్:** కార్తీక్ త్యాగి 8-0-32-2, సుశాంత్ మిశ్రా 8.1-0-28-3, రవి బిష్ణోయ్ 10-0-46-2, ఆకాశ్ సింగ్ 7-0-25-0, అథర్వ అంకొలేకర్ 7-0-29-1, యశస్వి జైస్వాల్ 3-0-11-1.

**భారత్:** యశస్వి (నాటౌట్) 105, దివ్యాన్ష్ (నాటౌట్) 59, **ఎక్స్‌ట్రాలు:** 12, **మొత్తం:** 35.2 ఓవర్లలో 176/0. **బౌలింగ్:** తాహిర్ 6-1-17-0, ఖాసిం 8-0-37-0, అమీర్ ఖాన్ 5-1-20-0, అబ్బాస్ అఫ్రీది 7-0-50-0, ఆమిర్ అలీ 5.2-0-38-0, మునీర్ 4-0-12-0.

## 'జై'స్వాల్

సెమీఫైనల్లో పాకిస్థాన్‌పై యశస్వి బ్యాటింగ్ చూసిన వారెవరైనా.. జరుగుతున్నది అండర్-19 మ్యాచ్.. ఆడుతున్నది ఓ పద్దెనిమిదేండ్ల కుర్రాడు అంటే కచ్చితంగా నమ్మరు. పూర్తి పరిణతి సాధించిన ఓ బ్యాట్స్‌మెన్ క్రీజులో నిల్చొని ఉంటే ఇన్నింగ్స్ ఎలా సాగుతుందో.. మంగళవారం యంగ్‌ఇండియా ఆట అలాగే సాగింది. ఆరంభంలో కుదురుకునేందుకు సమయం తీసుకున్న జైస్వాల్.. ఒక్కసారి క్రీజులో పాతుకుపోయాక వెనుదిరిగి చూసుకోలేదు. తానెదుర్కొన్న తొలి 35 బంతుల్లో కేవలం 15 పరుగులే చేసిన యశస్వి ఆ తర్వాత భారీ షాట్లతో విరుచుపడ్డాడు.

**సూపర్ షాట్లతో..**

ఏజ్ గ్రూప్ క్రికెట్‌లో ఇప్పటికే లెక్కకు మిక్కిలి శతకాలు బాది అదుర్స్ అనిపించుకున్న జైస్వాల్.. ఈ టోర్నీ ఆరంభం నుంచి తనదైన శైలిలో దూసుకెళ్తున్నాడు. జట్టు బ్యాటింగ్ భారం తనపైనే ఉందని గుర్తించిన అతడు మంగళవారం ఇన్నింగ్స్‌ను చాలా పద్ధతిగా ముందుకు నడిపించాడు. చెత్త బంతులను మాత్రమే శిక్షించాడు. అందుకే అతడి ఇన్నింగ్స్‌లో 60కి పైగా డాట్‌బాల్స్ ఉన్నాయి.

**ద్రవిడ్ బాటలోనే..**

యశస్వి వయసులో చిన్నోడే అయినా.. ఆటలో చాలా పెద్దోడినని నిరూపించుకున్నాడు. అడ్డదిడ్డమైన షాట్లకు పోకుండా.. బంతిని గాల్లోకి లేపకుండా.. అతడు కొట్టిన స్ట్రెయిట్ డ్రైవ్‌లు, కవర్ డ్రైవ్‌లు కట్టిపడేశాయనడంలో అతిశయోక్తి లేదు. అమీర్ బౌలింగ్‌లో కాళ్ల ముందు పడ్డ బంతిని అమాంతం అందుకున్న జైస్వాల్.. తనదైన శైలిలో సిక్సర్ బాది మ్యాచ్‌ను ముగించడంతో పాటు సెంచరీ పూర్తి చేసుకొని విజయ గర్జన చేయడం మరింత ఆకట్టుకుంది. సిక్సర్ బాదాక సింగిల్ తీయడం.. వరుస బౌండ్రీలు బాదినా.. బంతిని ఏమాత్రం గాల్లోకి లేపకుండా ఆడటం చూస్తే.. జైస్వాల్‌లో ద్రవిడ్ శిష్యుడు కనిపించక మానడు.

## వన్డేల్లో మయాంక్.. టెస్టుల్లో పృథ్వీ షా



**హామిల్టన్:** న్యూజిలాండ్‌తో జరుగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం బీసీసీఐ మంగళవారం జట్టును ప్రకటించింది. 16 మందితో కూడిన ఈ జట్టులో చాన్నాళ్ల తర్వాత పృథ్వీ షా చోటు దక్కించుకుంటే.. శుభ్‌మన్ గిల్ రిజర్వ్ ఓపెనర్‌గా కొనసాగనున్నాడు. రెగ్యులర్ ఓపెనర్ రోహిత్ శర్మ గాయపడటంతో వన్డే జట్టులో అతడి స్థానంలో మయాంక్ అగర్వాల్ ఓపెనింగ్ చేయనున్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో దుమ్మురేపుతున్న లోకేశ్ రాహుల్‌ను టెస్టు జట్టుకు ఎంపిక చేయకపోవడం మినహా అంతా ఊహించిన విధంగానే జట్టు ఎంపిక సాగింది. ఇరు జట్ల మధ్య ఈ నెల 21 నుంచి రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. కివీస్ గడ్డపై ఇద్దరు స్పిన్నర్లు చాలనుకున్న సెలెక్టర్లు కుల్దీప్‌ను పక్కనపెట్టి సీనియర్లు అశ్విన్, జడేజాకు అవకాశం ఇచ్చారు.

## కౌల్ హ్యాట్రిక్

**పటియాలా:** ఆంధ్రతో మంగళవారం మొదలైన రంజీ మ్యాచ్‌లో పంజాబ్ స్పీడ్‌స్టర్ సిద్ధార్థ్ కౌల్(5/24) హ్యాట్రిక్‌తో అదరగొట్టాడు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్ర..కౌల్ ధాటికి 39.4 ఓవర్లలో 97 పరుగులకు కుప్పకూలింది. ఇన్నింగ్స్ 40వ ఓవర్లో వరుసగా మూడు బంతుల్లో శశికాంత్(20), స్వరూప్(0), అశిష్(0)ను ఔట్ చేశాడు. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్‌కు దిగిన పంజాబ్..షోయబ్ ఖాన్(5/46), అశిష్(5/50) ధాటికి 108 పరుగులకు ఆలౌటైంది. తిరిగి రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఆంధ్ర తొలి రోజు ఆట ముగిసే సరికి 31 పరుగులకు 4 వికెట్లు కోల్పోయింది.

## భారత అమ్మాయిల గెలుపు

**ఆక్లాండ్:** కెప్టెన్ రాణి రాంపాల్ సూపర్ గోల్‌తో మెరువడంతో ముక్కోణపు టోర్నీలో భారత మహిళల హాకీ జట్టు విజయం సాధించింది. మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత్ 1-0తో గ్రేట్ బ్రిటన్‌ను చిత్తు చేసింది. భారత జట్టు తరఫున కెప్టెన్ రాణి రాంపాల్ (47వ నిమిషంలో) ఏకైక గోల్ చేసింది. మ్యాచ్ ఆరంభం నుంచి ఇరు జట్లు హోరాహోరీగా పోరాడగా.. తొలి అర్ధభాగంలో ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. భారత్‌కు రెండు పెనాల్టీ కార్నర్ అవకాశాలు వచ్చినా వాటిని వినియోగించుకోలేకపోయింది. ఎట్టకేలకు చివరి క్వార్టర్‌లో రాణి గోల్‌తో భారత్ ఖాతా తెరిచింది. ఆ తర్వాత ప్రత్యర్థి ఎంత ప్రయత్నించినా స్కోరు సమం చేయలేకపోవడంతో భారత్ గెలుపు ఖాయమైంది.

## సత్తాచాటిన ప్రియదర్శిని



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** కోల్‌కతా వేదికగా జరుగుతున్న జాతీయ సీనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ లిఫ్టర్ ప్రియదర్శిని సత్తాచాటింది. మహిళల 49కిలోల విభాగం స్నాచ్‌లో 70కిలోలు ఎత్తిన ప్రియదర్శిని, క్లీన్ అండ్ జర్క్ విభాగంలో 98కిలోలతో ఆకట్టుకుంది. దీంతో ఓవరాల్‌గా ఇంటర్‌స్టేట్ స్వర్ణ పతకంతో పాటు కాంస్య పతకాన్ని ఖాతాలో వేసుకుంది. హకీంపేట తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ పూర్వ విద్యార్థి అయిన ప్రియదర్శిని ప్రదర్శన పట్ల కోచ్ మాణిక్యాల్ రావు అభినందనలు తెలిపారు.

## మీరాబాయి కొత్త జాతీయ రికార్డు

**కోల్‌కతా:** భారత స్టార్ లిఫ్టర్ మీరాబాయి చాను కొత్త జాతీయ రికార్డు నెలకొల్పింది. జాతీయ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో 203 కేజీల బరువెత్తిన ప్రపంచ మాజీ చాంపియన్ చాను.. తన పేరిటే ఉన్న రికార్డును మెరుగు పరుస్తూ స్వర్ణం నెగ్గింది. మహిళల 49 కేజీల విభాగంలో 25 ఏండ్ల మీరాబాయి మంగళవారం స్నాచ్‌లో 88 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 203 కిలోల బరువెత్తి అగ్రస్థానం దక్కించుకుంది. ప్రస్తుతం చైనాకు చెందిన లిఫ్టర్లు జియాంగ్ హుహువా (212 కేజీలు), హూ జీహు (211 కేజీలు) కొరియాకు చెందిన రీ సాంగ్ గమ్ (209 కేజీలు) తర్వాత చాను ప్రపంచ నాలుగో ర్యాంకులో నిలిచింది.

